నీ బలం ఎవ్వరికీ
తెలియకపోయినా పర్వాలేదు.
హాయిగా బ్రతికేయచ్చు.
కానీ
నీ బలహీనతను మాత్రం
ఎవ్వరికీ తెలియనివ్వకూడదు
తెలిస్తే నిన్ను బ్రతకనియ్యరు.

TS-11-0036701

# నేటి చర్చ
జాతీయ తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

ప్రజా సమస్యలపై స్పందించే తత్వం మీకుందా..? సమాజంలో జరుగుతున్న అన్యాయాలకు, అక్రమాలకు అక్షర రూపమిచ్చి బాధితులకు అండగా నిలబడే ధైర్యం మీకుందా..? మీకోసమే చర్చన్యూస్ ఎదురుచూస్తోంది. కలం బలంతో ముందుకు సాగుదాం. తెలంగాణ వ్యాప్తంగా చర్చ దినపత్రికలో రాష్ట్రం, జిల్లాలు, నియోజకవర్గ, మండలాల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఉత్సాహవంతులైన యువతి, యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

నేటి చర్చ జాతీయ తెలుగు దిన పత్రిక

సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 99666 41155

తెలంగాణ , సంపుటి : 01 సంచిక : 54 శనివారం, అక్టోబర్ 24, 2026 , పేజీలు - 12 వెల : 2/-




# సమన్వయంతో నేరాలను అరికడదాం



## హైదరాబాద్ ఎస్ఆర్‌పీసీసీ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం**

**సాంకేతిక పరిజ్ఞానంతో పటిష్ఠమైన పోలీసు వ్యవస్థ నిర్మాణం**

**దక్షిణ భారతదేశాన్ని సురక్షిత ప్రాంతంగా తీర్చిదిద్దాలి**

**హైదరాబాద్, అక్టోబర్ 23:** దక్షిణాది రాష్ట్రాల పోలీసు బలగాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రాల సరిహద్దులతో సంబంధం లేకుండా పోలీసులు పరస్పరం సమన్వయంతో పనిచేసేలా పటిష్ఠ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సూచించారు. హైదరాబాద్‌లోని 'ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్' (ఐసీసీసీ)లో శుక్రవారం జరిగిన దక్షిణ ప్రాంతీయ పోలీసు సమన్వయ కమిటీ (ఎస్ఆర్‌పీసీసీ)

మిగతా 2లో

# కేసీఆర్ సీఎం కావడం ఖాయం

## దేశ రాజకీయాల్లో కేసీఆర్ చక్రం తిప్పే రోజులు వస్తున్నాయి: కేటీఆర్

- రేవంత్ రెడ్డి పాలన తాత్కాలికమేనని, త్వరలో కేసీఆర్ సీఎం అవుతారని ధీమా
- కాంగ్రెస్, బీజేపీయేతర కూటమి దేశంలో కీలకపాత్ర పోషిస్తుందని జోస్యం
- కరెంట్ కోతలతో రైతులు ఇబ్బంది పడుతున్నారని ప్రభుత్వంపై విమర్శ
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు యువత తగిన గుణపాఠం చెబుతుందన్న కేటీఆర్



**హైదరాబాద్, అక్టోబర్ 23:** దేశ రాజకీయాల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీలక పాత్ర పోషించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, ఆయన జాతీయ స్థాయిలో చక్రం తిప్పే సమయం ఆసన్నమైందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వ హడావిడి కొద్దిరోజులు మాత్రమేనని, ఆ తర్వాత మళ్లీ కేసీఆరే ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన అంబర్‌పేట నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నేతల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

మిగతా 2లో

# ప్రియాంక వర్సెస్ రాహుల్..

## బీజేపీ సంచలన ఆరోపణలు

**రైహాన్ ఎగ్జిబిషన్ వివాదంపై రాహుల్ మౌనాన్ని ప్రశ్నించిన భండారీ**

**రైహాన్ వివాదంపై ఇప్పటి వరకు బహిరంగంగా స్పందించని రాహుల్**



**న్యూ ఢిల్లీ, అక్టోబర్ 23:** కాంగ్రెస్‌లో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ మధ్య అంతర్గత పోరు సాగుతోందని బీజేపీ ఆరోపించింది. ప్రియాంక కుమారుడు రైహాన్ వాద్రా ఫొటో ఎగ్జిబిషన్‌లో కొన్ని చిత్రాలను తొలగించిన వివాదంపై రాహుల్ గాంధీ

మిగతా 2లో

# అరుణాచల్‌ప్రదేశ్ సరిహద్దులో చైనా కవ్వింపు

- ఘర్షణల్లో శౌర్య కమాండోలు ప్రతిభ చూపారని ప్రశంస
- చైనాతో 3,488 కిలోమీటర్ల ఎల్ఏసీకి ఐటీబీపీ కాపలా
- అన్ని సరిహద్దు యూనిట్లలో డ్రోన్ ప్లటూన్ల ఏర్పాటు
- గల్వాన్ తరహా పరిస్థితుల కోసం ప్రత్యేక శిక్షణ
- ఐటీబీపీ డీజీ శత్రుజీత్ కపూర్



2లో.

# మహారాష్ట్రతో చర్చలకు సిద్ధం కండి

## తుమ్మిడిహట్టి బ్యారేజీపై అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం

**బ్యారేజీ ఎత్తు, ముంపు ప్రభావంపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సూచన**

**అక్టోబర్ 23 తర్వాత మహారాష్ట్ర సీఎంతో చర్చలు జరపనున్నట్టు వెల్లడి**



**హైదరాబాద్, అక్టోబర్ 23:** రాష్ట్రంలోని కీలక సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణంపై మహారాష్ట్ర ప్రభుత్వంతో నిర్వహించనున్న చర్చలకు సర్వసన్నద్ధంగా ఉండాలని

మిగతా 2లో

# 54 మందిపై కేసులు నమోదు

## ఏపీలో నామినేషన్ల హింస..

- 54 మందిపై కేసులు నమోదు చేశామన్న డీజీపీ
- 13 జిల్లాల్లో 31 ఘర్షణలు, దాడుల కేసుల నమోదు
- వాహనాల దహనం, జేసీబితో ఇల్లు కూల్చివేత
- ఓ అభ్యర్థిని తరలిస్తున్న పోలీసు వాహనంపై దాడి



2లో.

# మూడు దశల్లో లక్ష ఫ్లాట్ల నిర్మాణం



**ఇందిరమ్మ టవర్ల నిర్మాణంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక ఆదేశాలు**

**ఈ నెలాఖరులోగా లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని మంత్రి పొంగులేటి సూచన**

**లాటరీ ప్రక్రియను యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేసి పారదర్శకత పాటించాలని స్పష్టం**

**హైదరాబాద్, అక్టోబర్ 23:** హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో ప్రతిపాదించిన ఇందిరమ్మ టవర్ల నిర్మాణం కోసం యుద్ధప్రాతిపదికన భూములను గుర్తించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.

మిగతా 2లో



2లో.

# 100 పతకాల మార్క్ దాటిన భారత్

- ఏషియన్ పారా గేమ్స్: ప్రపంచ రికార్డుల మోత..
- ఏషియన్ పారా గేమ్స్‌లో ఐదో రోజు భారత్‌కు స్వర్ణాల పంట
- షూటర్ మోనా అగర్వాల్ ప్రపంచ రికార్డుతో రెండో స్వర్ణం కైవసం
- అథ్లెటిక్స్‌లో ప్రపంచ రికార్డులతో సందీప్ కుమార్, హనీలకు పసిడి పతకాలు
- 100 పతకాల మైలురాయిని దాటిన భారత బృందం
- బ్యాడ్మింటన్, ఆర్చరీలోనూ భారత్‌కు స్వర్ణ పతకాలు

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు

## : చంద్రబాబుపై జగన్ ఫైర్

- నామినేషన్ కేంద్రాల్లో వైసీపీ అభ్యర్థులపై దాడులు చేశారన్న జగన్
- వైసీపీ నేతలను గృహ నిర్బంధం చేస్తున్నారని మండిపాటు
- సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత కూడా ప్రభుత్వ వైఖరిలో మార్పు రాలేదని విమర్శ



2లో.

# నేడు ఢిల్లీకి చంద్రబాబు

- అర్ధరాత్రికి మళ్లీ అమరావతికి చేరుకోనున్న సీఎం
- కేంద్ర పెద్దలను కలిసే అవకాశం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రేపు ఢిల్లీలో పర్యటించనున్నారు. ఇది కేవలం ఒక్కరోజు పర్యటన మాత్రమే కావడం గమనార్హం.




2లో.

# సమన్వయంతో నేరాలను అరికడదాం

**(మొదటి పేజీ తరువాయి)**
సమావేశంలో ఆయన మాట్లాడారు.
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళం రాష్ట్రాల డీజీపీలు, ఐజీలు, అండమాన్ నికోబార్ దీవులు, పుదుచ్చేరి, లక్షద్వీప్ ప్రతినిధులు, కేంద్ర దర్యాప్తు సంస్థల ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. దక్షిణ భారతదేశాన్ని సురక్షిత ప్రాంతంగా తీర్చిదిద్దే బాధ్యత పోలీసు అధికారులపై ఉందని సీఎం పేర్కొన్నారు. పొరుగు రాష్ట్రాలతో సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఐసీసీసీ వ్యవస్థలను పంచుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. నేరాల స్వరూపం మారుతున్న నేపథ్యంలో పోలీసింగ్ విధానాల్లోనూ నిరంతర సంస్కరణలు అవసరమని రేవంత్‌రెడ్డి అన్నారు. పోలీసులకు కేటాయించే నిధులను ఖర్చుగా కాకుండా మెరుగైన సమాజ నిర్మాణానికి, ప్రజల భద్రతకు చేసే పెట్టుబడిగా చూడాలని చెప్పారు. ప్రజలు సమర్థంగా పనిచేసే, నైతిక విలువలను పాటించే, పక్షపాతం లేకుండా వ్యవహరించే పోలీసు వ్యవస్థను ఆశిస్తున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్ పోలీసు వ్యవస్థను మూడు కమిషనరేట్లుగా పునర్వ్యవస్థీకరించామని సీఎం తెలిపారు. దీనివల్ల ప్రతి పోలీసు కమిషనర్ తన పరిధిపై ప్రత్యేకంగా దృష్టి సారించే అవకాశం ఉంటుందన్నారు. వివిధ రకాల నేరాల నియంత్రణ కోసం హైడ్రా, ఈగల్, టీ–సేఫ్ వంటి ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.
సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ట్రాఫిక్ సమస్యలు ప్రస్తుతం కీలక సవాళ్లుగా మారాయని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. వీటిని ఎదుర్కొనేందుకు సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, సిబ్బందికి శిక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.
సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని ప్రధాని అధ్యక్షతన జరిగిన ప్రగతి సమీక్ష సమావేశంలో గుర్తించినట్లు సీఎం తెలిపారు. తెలంగాణను నక్సలిజం రహిత రాష్ట్రంగా మార్చడంలో పోలీసుల కృషిని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రశంసించారని చెప్పారు. మాదకద్రవ్యాల నియంత్రణలో ఈగల్ విభాగానికి కేంద్ర ప్రభుత్వం 80 శాతానికి పైగా స్కోరు ఇచ్చిందన్నారు. సైబర్ నేరాల్లో బాధితులు కోల్పోయిన డబ్బును తిరిగి ఇప్పించడంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతోందని పేర్కొన్నారు. ఆహార కల్తీని అరికట్టడం, ఔషధాల నియంత్రణ కోసం అమెరికా ఎఫ్‌డీఏ తరహాలో వివిధ శాఖల మధ్య సమన్వయం కల్పించేలా టీ–సేఫ్ విభాగాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. చెరువులు, సరస్సులు, ఇతర జలవనరులను పరిరక్షించి పునరుద్ధరించడంలో హైడ్రా కృషికి ప్రజల నుంచి ప్రశంసలు లభిస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వ, ప్రజా ఆస్తుల పరిరక్షణకు కూడా ఈ సంస్థ పనిచేస్తోందన్నారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసు విభాగంలో ట్రాన్స్‌జెండర్లను ట్రాఫిక్ అసిస్టెంట్లుగా నియమించిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని సీఎం పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలను సైతం పణంగా పెట్టే పోలీసు సిబ్బంది సంక్షేమం, వారి కుటుంబాల భవిష్యత్తు తనకు అత్యంత ప్రాధాన్యమని తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్, కర్ణాటక డీజీపీ ఎం.ఏ.సలీం, తమిళనాడు డీజీపీ మహేశ్ అగర్వాల్, పుదుచ్చేరి డీజీపీ షాలినీ సింగ్, లక్షద్వీప్ ఏడీజీపీ బి.శంకర్ జైస్వాల్, కేరళం ఐజీ అజితా బేగం, ఏపీ ఐజీపీ రవికృష్ణ, ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ తదితరులు పాల్గొన్నారు

# 100 పతకాల మార్క్ దాటిన భారత్

**ఏషియన్ పారా గేమ్స్: ప్రపంచ రికార్డుల మోత..**

**న్యూ ఢిల్లీ, అక్టోబర్ 23:**
ఐచి–నగోయా వేదికగా జరుగుతున్న 2026 ఏషియన్ పారా గేమ్స్‌లో భారత క్రీడాకారులు విశ్వరూపం ప్రదర్శిస్తున్నారు. ఐదో రోజు మన అథ్లెట్లు ప్రపంచ రికార్డుల మోత మోగించి స్వర్ణాల వర్షం కురిపించారు. ఈ అద్భుత ప్రదర్శనతో భారత్ పతకాల సంఖ్య 100 మైలురాయిని దాటింది. షూటింగ్‌లో మోనా అగర్వాల్ అద్భుతం చేసింది. మహిళల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ ఎస్‌హెచ్1 విభాగంలో 357.5 స్కోరుతో ప్రపంచ రికార్డు సృష్టించి పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ గేమ్స్‌లో ఆమెకు ఇది రెండో స్వర్ణం కావడం విశేషం. చైనా క్రీడాకారిణి కుయిపింగ్ జాంగ్‌పై 3.8 పాయింట్ల భారీ ఆధిక్యంతో మోనా విజయం సాధించింది. అథ్లెటిక్స్‌లోనూ భారత హవా కొనసాగింది. టీ44 400 మీటర్ల స్ప్రింట్‌లో సందీప్ కుమార్ కేవలం 52.28 సెకన్లలో లక్ష్యాన్ని పూర్తి చేసి ప్రపంచ రికార్డుతో స్వర్ణం గెలుచుకున్నాడు. ఈ పతకంతో భారత్ పతకాల సంఖ్య 100 దాటింది. ఇదే ఈవెంట్‌లో అజయ్ కుమార్ 53.61 సెకన్లతో కాంస్య పతకం సాధించాడు. జావెలిన్ త్రో ఎఫ్37 విభాగంలో హనీ తన చివరి ప్రయత్నంలో 60.49 మీటర్లు విసిరి ప్రపంచ రికార్డు నెలకొల్పి స్వర్ణ పతకాన్ని ముద్దాడాడు.
ఇతర క్రీడల్లోనూ భారత్ సత్తా చాటింది. పురుషుల సింగిల్స్ ఎస్‌ఎల్3 బ్యాడ్మింటన్ ఆల్–ఇండియన్ ఫైనల్‌లో ప్రమోద్ భగత్‌ను ఓడించి నితేష్ కుమార్ స్వర్ణం గెలుచుకోగా, ప్రమోద్ రజతంతో సరిపెట్టుకున్నాడు. పారా ఆర్చరీ పురుషుల రికర్వ్ టీమ్ ఈవెంట్‌లో హర్విందర్ సింగ్, విజయ్ సుండి ద్వయం 5–1 తేడాతో చైనాపై గెలిచి పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది.

# మూడు దశల్లో లక్ష ఫ్లాట్ల నిర్మాణం

**(మొదటి పేజీ తరువాయి)**
ఈ సందర్భంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాల కలెక్టర్లతో కలిసి 'క్యూర్' ఇందిరమ్మ టవర్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకాల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు.
ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, క్యూర్ పరిధిలో మూడు దశల్లో మొత్తం లక్ష ఇందిరమ్మ ఫ్లాట్లను నిర్మించనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం కొనసాగుతున్న మొదటి దశతో పాటు, రెండు, మూడవ దశలకు అవసరమైన భూములను త్వరితగతిన సేకరించాలని అధికారులకు సూచించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ఈ నెలాఖరు నాటికి అత్యంత పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపిక కోసం నిర్వహించే లాటరీ ప్రక్రియను యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయాలని అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. నగరంలోని పేదలకు వారి నివాస ప్రాంతాలకు, ఉపాధి మార్గాలకు సమీపంలోనే గృహ వసతి కల్పించాలనేదే ఇందిరమ్మ టవర్ల ప్రధాన ఉద్దేశమని మంత్రి వివరించారు. పేదలను నగర శివార్లకు తరలించకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ పథకం కింద లబ్ధి పొందే వారికి ఫ్లాట్‌పై పూర్తి యాజమాన్య హక్కులతో పాటు, అవిభాజ్య భూమి వాటాను ఎటువంటి రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండా అందజేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి శంకుస్థాపనలు జరిగాయని, కొన్ని ప్రాంతాల్లో టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయిందని మంత్రి గుర్తుచేశారు. లబ్ధిదారుల అర్హతలను నిశితంగా పరిశీలించిన తర్వాత బహిరంగ డ్రాల ద్వారా ఎంపిక ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే లక్షలాది ఇళ్లను మంజూరు చేసిన ఇందిరమ్మ పథకంలో భాగంగా, పట్టణ ప్రాంత గృహ నిర్మాణానికి కూడా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. భూముల గుర్తింపుతో పాటు ఇతర అనుబంధ ప్రక్రియలను వేగవంతం చేసి, ప్రాజెక్టుల నిర్మాణ వేగాన్ని కొనసాగించాలని అధికారులను ఆదేశించారు.

# ప్రియాంక వర్సెస్ రాహుల్.. : బీజేపీ సంచలన ఆరోపణలు

**(మొదటి పేజీ తరువాయి)**
స్పందించకపోవడాన్ని ఆ పార్టీ ప్రస్తావించింది. ఈ వివాదాన్ని సృష్టించి తన కుమారుడిని రాజకీయంగా తెరపైకి తీసుకొచ్చేందుకు ప్రియాంక ప్రయత్నిస్తున్నారని బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ విమర్శించారు. రాహుల్‌పై ప్రియాంకకు రాజకీయ విశ్వాసం తగ్గిందా? అని ప్రశ్నించారు. వ్యక్తిగత పర్యటన కోసం గత ఆదివారం వియత్నాం వెళ్లిన రాహుల్ గాంధీ.. రైహాన్ ఎగ్జిబిషన్ వివాదంపై ఇప్పటివరకు బహిరంగంగా స్పందించలేదు. ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌లో ప్రియాంక వర్సెస్ రాహుల్ పరిస్థితి నెలకొందని భండారీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. అయితే, కొన్ని రోజుల క్రితమే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో రాహుల్, ప్రియాంక కలిసి పాల్గొన్న విషయం తెలిసిందే. ఢిల్లీలో ఇటీవల జరిగిన విద్యార్థుల నిరసనలకు సంబంధించిన ఫొటోలను తన ఎగ్జిబిషన్ నుంచి తొలగించారని కళాకారుడు, ఫొటోగ్రాఫర్ రైహాన్ వాద్రా బుధవారం వెల్లడించారు. 'నో ఐడియా ఈజ్ ఫైనల్' పేరుతో బికనీర్ హౌస్‌లో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఎగ్జిబిషన్ ప్రారంభానికి కొన్ని గంటల ముందు 105 ఫొటోల్లో 74 చిత్రాలను తొలగించాలని లేదా వాటి స్థానంలో వేరేవి పెట్టాలని నిర్వాహకులు కోరినట్లు రైహాన్ తెలిపారు. ప్రదర్శన ప్రారంభమయ్యే సమయానికి 35 ఫ్రేములు మాత్రమే మిగిలాయని చెప్పారు. ఈ చిత్రాల సేకరణ కోసం మూడేళ్లు కష్టపడ్డానని పేర్కొన్నారు. అక్టోబరు 15నే ఎగ్జిబిషన్ లేఅవుట్‌ను బికనీర్ హౌస్ యాజమాన్యానికి పంపించానని, దానికి సంబంధించిన అంగీకార సమాచారం కూడా అందిందని రైహాన్ వెల్లడించారు. చిత్రాల ఏర్పాట్లు ప్రారంభించిన తర్వాతే అభ్యంతరాలు వ్యక్తమయ్యాయని ఆయన తండ్రి రాబర్ట్ వాద్రా తెలిపారు. మరోవైపు, తమ ప్రాంగణ విధానాలకు అనుగుణంగా లేవని గుర్తించిన ఫొటోలను తొలగించాలని కోరినట్లు బికనీర్ హౌస్ ప్రకటించింది. ఈ వివాదంపై స్పందించిన ప్రియాంక గాంధీ.. యువత గొంతును అణచివేసే ప్రయత్నంగా అభివర్ణించారు. రైహాన్ పంపిన ఇమెయిల్, ఎగ్జిబిషన్ ప్రతిపాదనకు సంబంధించిన స్క్రీన్‌షాట్లను బీజేపీ పంచుకుంది. జూన్ 10న పంపిన ప్రతిపాదనలో ప్రకృతి, వన్యప్రాణులు, అబ్‌స్ట్రాక్ట్ ఆర్ట్, పోర్ట్రెయిట్లు, శిల్పాల వంటి అంశాలే ఉన్నాయని భండారీ పేర్కొన్నారు. అందులో రాజకీయ అంశాల ప్రస్తావన లేదని అన్నారు. జూన్ 30న బికనీర్ హౌస్ ఈ ప్రతిపాదనను అంగీకరించిందని బీజేపీ తెలిపింది. అక్టోబరు 21న బికనీర్ హౌస్ యాజమాన్యం రైహాన్‌కు నోటీసు పంపి 74 ఫొటోలను తొలగించాలని కోరినట్లు భండారీ పేర్కొన్నారు. తొలుత రాజకీయ అంశాలు లేని ప్రదర్శనకు అంగీకారం పొందిన తర్వాత, కుటుంబం ఒత్తిడితో రాజకీయ ఫొటోలను చేర్చి ఉంటారని ఆరోపించారు. ఈ ఇమెయిళు ,, ప్రతిపాదనలు ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ చేస్తున్న వాదనల్లోని అసత్యాలను బయటపెడుతున్నాయని బీజేపీ విమర్శించింది.




# కేసీఆర్ సీఎం కావడం ఖాయం

**(మొదటి పేజీ తరువాయి)**
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని కేటీఆర్ ఆరోపించారు. తీవ్రమైన విద్యుత్ కోతల వల్ల రైతులు అల్లాడుతున్నారని, వారి కష్టాలను పట్టించుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ఎల్‌నినో ప్రభావంపై నిపుణులు పది నెలల ముందే హెచ్చరించినప్పటికీ, ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడంలో విఫలమైందని మండిపడ్డారు. కాంగ్రెస్ హామీలను నమ్మి మోసపోయిన అన్ని వర్గాల ప్రజలు ఇప్పుడు మళ్లీ బీఆర్ఎస్ వైపే చూస్తున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి హడావిడి మరికొద్దిరోజులు మాత్రమే ఉంటుందని కేటీఆర్ పేర్కొన్నారు.
జాతీయ రాజకీయాల గురించి ప్రస్తావిస్తూ, భవిష్యత్తులో కాంగ్రెస్, బీజేపీయేతర పార్టీలే దేశంలో నిర్ణయాత్మక పాత్ర పోషిస్తాయని కేటీఆర్ జోస్యం చెప్పారు. రాహుల్ గాంధీ ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆశించిన ఫలితం ఉండదని, అటు ప్రధాని మోదీ పాలనలోనూ దేశానికి చేకూరిన ప్రయోజనం ఏమీ లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం తెలంగాణ నుంచి గెలిచిన ఎంపీలెవరూ పార్లమెంటులో గళం విప్పడం లేదని ఆయన దుయ్యబట్టారు.
రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు యువత తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాల వల్లే నేడు యువత రోడ్లపైకి వచ్చి పోరాటాలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతలు రాష్ట్ర అభివృద్ధిని విస్మరించి, కేవలం ప్రతిపక్షాలను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని ఆయన ఆరోపించారు.

# అరుణాచల్‌ప్రదేశ్ సరిహద్దులో చైనా కవ్వింపు

**న్యూ ఢిల్లీ, అక్టోబర్ 23:** అరుణాచల్‌ప్రదేశ్ సరిహద్దులో చైనా సైనికులతో పలుచోట్ల ముఖాముఖి ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయని ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) డైరెక్టర్ జనరల్ శత్రుజీత్ కపూర్ వెల్లడించారు. ఈశాన్య సరిహద్దులో ప్రస్తుత పరిస్థితిపై అధికారికంగా ఈ స్థాయిలో వెల్లడించడం ఇదే తొలిసారి అని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. "గత కొన్ని రోజులుగా అరుణాచల్‌లో పలుచోట్ల చైనా సైనికులతో ముఖాముఖి పరిస్థితులు ఏర్పడ్డాయి. అవి ఇంకా కొనసాగుతున్నాయి" అని ఐటీబీపీ సిబ్బంది వార్షిక సత్కార కార్యక్రమంలో కపూర్ తెలిపారు. ఈ పరిణామాల్లో ఐటీబీపీకి చెందిన శౌర్య కమాండోలు అసాధారణ ప్రతిభ కనబరిచారని ప్రశంసించారు. ఎత్తైన పర్వత ప్రాంతాల్లో యుద్ధం చేయడంలో ప్రత్యేక శిక్షణ పొందినవారే శౌర్య కమాండోలు. సరిహద్దుల్లో వీరు కీలక పాత్ర పోషిస్తున్నారని ఐటీబీపీ చీఫ్ చెప్పారు. 1962లో ఏర్పాటైన ఈ బలగం చైనాతో ఉన్న 3,488 కిలోమీటర్ల వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వెంబడి కాపలా బాధ్యతలు చూస్తుంటుంది.
2004లో సరిహద్దు రక్షణ బాధ్యతలు అప్పగించినప్పటికీ, పర్వత ప్రాంతాల్లో గెరిల్లా యుద్ధానికి సంబంధించిన తమ అసలు నైపుణ్యాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉందని కపూర్ పేర్కొన్నారు. చైనాతో ఉన్న సరిహద్దు అత్యంత క్లిష్టమైనదని ఐటీబీపీ డీజీ అభిప్రాయపడ్డారు. సరిహద్దు ప్రాంతాల్లోని అన్ని యూనిట్లలో డ్రోన్ ప్లటూన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గల్వాన్ లోయ తరహా పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రత్యేక పోరాట శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించినట్లు చెప్పారు. భూగర్భ మౌలిక సదుపాయాలను కూడా అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. అయితే తాజా ముఖాముఖి ఘటనలు ఏ ప్రాంతాల్లో జరిగాయి? ఎంతమంది సైనికులు పాల్గొన్నారు? ఎలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి? అనే వివరాలను ఐటీబీపీ చీఫ్ వెల్లడించలేదు.

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు: చంద్రబాబుపై జగన్ ఫైర్

**అమరావతి, అక్టోబర్ 23:**
ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని వైసీపీ అధినేత జగన్ ఆరోపించారు. రాష్ట్రంలో రావణకాసుర పాలన నడుస్తోందని ఆయన మండిపడ్డారు. నామినేషన్ కేంద్రాల వద్ద వైసీపీ అభ్యర్థులపై దాడులు చేసి, వారి నామినేషన్ పత్రాలను చించివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీ నేతలను పోలీసులు గృహ నిర్బంధం చేయడం, పోలీస్ స్టేషన్లకు పిలిపించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ అక్రమాలపై తాము ఆధారాలు సేకరించి రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ), గవర్నర్‌తో పాటు సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించామని తెలిపారు.
తమ పిటిషన్‌పై స్పందించిన సుప్రీంకోర్టు, అభ్యర్థుల తుది జాబితా ప్రకటనను అక్టోబర్ 25 వరకు వాయిదా వేయాలని, నామినేషన్ల దాఖలుకు స్వేచ్ఛ కల్పించాలని, అభ్యర్థులకు రక్షణ, సీసీటీవీ రికార్డింగ్ ఏర్పాటు చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని జగన్ గుర్తుచేశారు. అయినప్పటికీ ప్రభుత్వ యంత్రాంగం వైఖరిలో ఎలాంటి మార్పు రాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.
రాష్ట్రంలోని 19 మున్సిపాలిటీలలో తమ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని, కానీ ఎస్ఈసీ కేవలం పరిమిత సంఖ్యలో కొన్ని చోట్ల మాత్రమే రీ–నామినేషన్లకు అవకాశం ఇచ్చిందని జగన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏకపక్ష విజయాల కోసం చంద్రబాబు నిబంధనలు మార్చుతున్నారని, ఇది మహాభారతంలోని మాయాజూదాన్ని తలపిస్తోందని ఆయన విమర్శించారు.

# నేడు ఢిల్లీకి చంద్రబాబు

**అమరావతి, అక్టోబర్ 23:**
నేడు మధ్యాహ్నం అమరావతి నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలుదేరి, అక్కడ అధికారిక కార్యక్రమాలు ముగించుకుని అదే రోజు అర్ధరాత్రికి తిరిగి అమరావతి చేరుకుంటారు.
ఈ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంలోని పలువురు ముఖ్య నేతలతో భేటీ అయ్యే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. రాష్ట్రానికి సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలు, పెండింగ్ అంశాలు, కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై చర్చించే వీలుంది. అలాగే ఢిల్లీలోని జన్‌పథ్‌లో జరగనున్న ఒక ప్రత్యేక అధికారిక కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని తెలుస్తోంది. అయితే, ఢిల్లీ పర్యటనకు సంబంధించిన పూర్తి షెడ్యూల్, ఎవరెవరితో సమావేశమవుతారనే వివరాలు అధికారికంగా వెలువడాల్సి ఉంది.

# మహారాష్ట్రతో చర్చలకు సిద్ధం కండి

**(మొదటి పేజీ తరువాయి)**
అధికారులను ఆదేశించారు. రైతుల ప్రయోజనాలే పరమావధిగా ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ప్రధానంగా తుమ్మిడిహట్టి, దిండి, అచ్చంపేట ఎత్తిపోతల పథకాలపై చర్చించారు. తుమ్మిడిహట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే ఎల్లంపల్లి వరకు నీటిని తరలించే అవకాశం ఉంటుందని, అయితే దీనివల్ల సుమారు 2,300 ఎకరాల మేర ముంపునకు గురవుతుందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అదే 150 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే ముంపు వెయ్యి ఎకరాల లోపే మాత్రమే ఉంటుందని తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం, మహారాష్ట్రలో ముంపు ప్రభావాన్ని అంచనా వేస్తూనే, తెలంగాణకు గరిష్ఠంగా నీటి లభ్యత ఉండేలా బ్యారేజీ డిజైన్‌ను రూపొందించాలని సూచించారు. అక్టోబర్ 23 తర్వాత చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు మహారాష్ట్ర ముఖ్యమంత్రి సంకేతాలిచ్చారని రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. ఇటీవల కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో రెండు రాష్ట్రాల మధ్య జరిగిన సమావేశ వివరాలతో పాటు, సీడబ్ల్యూసీ కోరే ఎలాంటి సమాచారానికైనా సిద్ధంగా ఉండాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. దిండి ప్రాజెక్టుకు సంబంధించి ఏదుల రిజర్వాయర్ నుంచి 0.5 టీఎంసీలు, అచ్చంపేట ఎత్తిపోతల పథకానికి 0.1 టీఎంసీల నీటిని తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. శ్రీశైలం నుంచి అదనంగా 0.6 టీఎంసీల నీటిని తీసుకునేందుకు, శ్రీశైలం, నార్లాపూర్ నుంచి ఏదుల రిజర్వాయర్‌కు నీటిని మళ్లించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, డి. శ్రీధర్ బాబు, సాగునీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఏపీలో నామినేషన్ల వేళ హింసాత్మక ఘటనలు

**- 13 జిల్లాల్లో 31 ఘటనలు..**
**54 మంది నిందితుల గుర్తింపు**



**అమరావతి, అక్టోబర్ 23:** ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా పలు ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల్లో 31 ఎన్నికల సంబంధిత ఘటనలు నమోదైనట్లు డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వెల్లడించారు. వీటిలో 22 ఘర్షణలు, దాడులు కాగా, మరో తొమ్మిది ఘటనల్లో నామినేషన్ పత్రాలను లాక్కోవడం, చించివేయడం వంటి చర్యలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనల్లో రెండు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలకు నిప్పుపెట్టారు. కొన్ని చోట్ల రాళ్లు, కర్రలతో దాడులు జరగగా, ఒక ఇంటిని యంత్రంతో కూల్చివేసిన ఘటన కూడా నమోదైంది. అభ్యర్థులకు రక్షణగా వెళు న్న పోలీసు వాహనంపై రాళ్లదాడి జరగడంతో ఓ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఒక అభ్యర్థితో సహా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. జిల్లాల వారీగా అత్యధికంగా అనంతపురంలో ఎనిమిది ఘటనలు నమోదయ్యాయి. అన్నమయ్య, కడప, ప్రకాశం, తిరుపతి జిల్లాల్లో మూడేసి, చిత్తూరు, శ్రీ సత్యసాయి, పల్నాడు జిల్లాల్లో రెండేసి ఘటనలు చోటుచేసుకున్నాయి. నెల్లూరు, కర్నూలు, మార్కాపురం, నంద్యాల, ఏలూరు జిల్లాల్లో ఒక్కో ఘటన నమోదైంది. ఈ ఘటనలకు సంబంధించి ఇప్పటివరకు 16 కేసులు నమోదు చేయగా, మరో 11 ఘటనల్లో కేసుల నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. మొత్తం 54 మందిని నిందితులుగా గుర్తించినట్లు డీజీపీ తెలిపారు. హింసకు పాల్పడినవారు ఏ రాజకీయ పార్టీకి చెందినవారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సున్నితమైన ప్రాంతాల్లో అదనపు పోలీసు బలగాలను మోహరించాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల సమయంలో బెదిరింపులు, దాడులు ఎదురైతే 100 లేదా 112 నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు.

# యాసంగిలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యం

- సమావేశంలో మాట్లాడుతున్న పాక్స్ చైర్మన్ ఆవుల శ్రీనివాస్



**నెక్కొండ అక్టోబరు 23,** రెడ్లవాడ ఎల్‌నినో ప్రభావం, భూగర్భ జలాల తగ్గుదల దృష్ట్యా యాసంగిలో వరి సాగు తగ్గించి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని ఫ్యాక్స్ చైర్మన్ ఆవుల శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం రెడ్లవాడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శనగ, వేరుశనగ, నువ్వులు, పెసర, మినుములు, జొన్న, ఆముదం, కూరగాయలు సాగు చేయాలని సూచించారు. నీటి వనరులను సంరక్షిస్తూ వ్యవసాయ భూములను పరిరక్షించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ దగ్గు సంతోష్ గాంధీ, మండల వ్యవసాయ అధికారి నాగరాజు, ఉపసర్పంచ్ మేకల ప్రవీణ్, ఏఈవో అరవింద్, ఫ్యాక్స్ సీఈవో ఎం. సురేష్, రైతులు పాల్గొన్నారు.

# పీఎన్జీ గ్యాస్ పైప్‌లైన్‌కు అనుమతులు వేగవంతం చేయాలి

- పెండింగ్ అనుమతులను త్వరగా పరిష్కరించాలి
- అధికారులకు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ఆదేశం

**హనుమకొండ, అక్టోబర్ 23 :**
హనుమకొండ పట్టణ ప్రజలకు పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్జీ) సరఫరా చేసేందుకు చేపట్టనున్న భూగర్భ గ్యాస్ పైప్‌లైన్ నిర్మాణానికి అవసరమైన అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల వద్ద పెండింగ్‌లో ఉన్న అనుమతులను సత్వరమే పరిష్కరించి పనులు వేగవంతం చేయాలని సూచించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మేఘా సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ, ఐఓసీఎల్, హెచ్‌పీసీఎల్ సంస్థల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో పీఎన్జీ గ్యాస్ పైప్‌లైన్ నిర్మాణం, గ్యాస్ సరఫరా ఏర్పాట్లు, శాఖల వారీగా అవసరమైన అనుమతులు, పెండింగ్ అంశాలపై సమీక్షించారు.ప్రజలకు పైపుల ద్వారా సహజ వాయువు సరఫరా చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. పైప్‌లైన్ నిర్మాణానికి అవసరమైన అనుమతుల జారీలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్యాస్ సరఫరా వ్యవస్థను త్వరగా అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సంస్థల ప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, జిల్లా పౌరసరఫరాల అధికారి మహేందర్, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, హనుమకొండ ఏసీపీ నరసింహారావు, ఎన్‌హెచ్‌ఏఐ అధికారి లింగయ్య, ఆర్అండ్‌బీ ఈఈ దేవిక చౌహన్, డీపీవో లక్ష్మీ రమాకాంత్, విద్యుత్ శాఖ ఏడీఈ గంగారెడ్డి, మేఘా సంస్థ ప్రతినిధులు హరి, ఎస్‌కే రషీద్, ఐఓసీఎల్, హెచ్‌పీసీఎల్ ప్రతినిధులు, పాల్గొన్నారు.

## కూనంనేని సాంబశివరావు గారిని కలిసి, మన హ్యూమన్ ఫౌండేషన్ ద్వారా నిర్వహించే అవగాహన సదస్సులు,



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అక్టోబర్ 23 నేటి చర్చ** భద్రాద్రి కొత్తగూడెం నియోజకవర్గ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు గారిని కలిసి, మన హ్యూమన్ ఫౌండేషన్ ద్వారా నిర్వహించే అవగాహన సదస్సులు, చారిటీ కార్యక్రమాలు, అలాగే చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించే విషయాన్ని వివరించడం జరిగింది అలాగే, లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్ట్, పోష్ చట్టాలకు సంబంధించిన పోస్టర్స్ ని వారి చేతుల మీదుగా ఆవిష్కరింప చేయడం జరిగింది వారు మనం చేసే హ్యూమరైడ్స్ ఫౌండేషన్ కార్యక్రమాలను అభినందించి, అలాగే మన రాష్ట్ర కార్యాలయాన్ని త్వరలోనే సందర్శిస్తానని తెలియజేయడం జరిగింది. మన గౌరవనీయులు ఎమ్మెల్యే గారికి మన ఫౌండేషన్ ద్వారా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో గౌరవనీయులు మన రాష్ట్ర అధ్యక్షులు కాల్వ సుధాకర్ రావు , అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అడ్వైజరీ కమిటీ ప్రెసిడెంట్ శ్రీ షేక్ అబ్బాస్, జిల్లా కమిటీ ఇన్చార్జ్ గడ్డం సామ్యూల్,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీమతి కోడి రెక్కల భవాని ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది

# బీఆర్ఎస్ లీగల్ సెల్ కన్వీనర్‌గా కన్నోజు రామకృష్ణ



**చర్చ:- హుస్నాబాద్:** బీఆర్ఎస్ పార్టీ హుస్నాబాద్ నియోజకవర్గ లీగల్ సెల్ కన్వీనర్‌గా పార్టీ సీనియర్ నాయకుడు, పట్టణ మాజీ అధ్యక్షుడు, మాజీ ఏజీపీ కన్నోజు రామకృష్ణ నియమితులయ్యారు. మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ శుక్రవారం ఈ నియామకాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న న్యాయపరమైన సమస్యల పరిష్కారానికి రామకృష్ణ కృషి చేయాలని, వారికి అవసరమైన న్యాయ సలహాలు అందించాలని కోరారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్‌కు రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి, నాయకులు, కార్యకర్తల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# జగిత్యాల వెలుగులకు ఫ్లెక్సీల గండం..!

**సెంట్రల్ లైటింగ్ పోల్స్ సిరీస్ లైట్లకు నష్టం**
**తెగిపోతున్న విద్యుత్ వైర్లు**
**వెలుగులు కోల్పోతున్న అలంకరణ లైట్లు**



**చర్చ, జగిత్యాల:** జగిత్యాల పట్టణంలోని ప్రధాన రహదారుల మధ్య ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ పోల్స్‌కు ఫ్లెక్సీలు కడుతుండటంతో వాటి చుట్టూ అమర్చిన సిరీస్ లైట్లకు విద్యుత్ సరఫరా చేసే సన్నని వైర్లు దెబ్బతింటున్నాయి. దీంతో రాత్రివేళల్లో వివిధ రంగుల్లో వెలుగులు విరజిమ్మాల్సిన అలంకరణ లైట్లు పనిచేయకపోవడంతో పట్టణ సౌందర్యానికి విఘాతం కలుగుతోంది. జగిత్యాల పట్టణంలోని ప్రధాన రహదారుల మధ్య ఉన్న సెంట్రల్ లైటింగ్ పోల్స్‌పై ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు రాత్రివేళల్లో రహదారులకు వెలుగులు అందిస్తున్నాయి.వీటితోపాటు పోల్స్ చుట్టూ అమర్చిన రంగు రంగుల సిరీస్ లైట్లు పట్టణానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. అయితే వివిధ కార్యక్రమాలు, ప్రచారాల కోసం కొందరు పోల్స్‌కు చిన్నచిన్న ఫ్లెక్సీలు కట్టే సమయంలో సిరీస్ లైట్లకు సంబంధించిన వైర్లు తెగిపోతున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా లైట్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయి అవి వెలగడం లేదు.

**చిన్నపాటి నిర్లక్ష్యంతో లైటింగ్ వ్యవస్థకు నష్టం**
పోల్స్‌కు ఫ్లెక్సీలు కట్టే సమయంలో వాటిపై ఉన్న విద్యుత్ వైర్లు, అలంకరణ లైట్ల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల ఈ సమస్య తలెత్తుతోంది. ఫ్లెక్సీలు తాత్కాలికంగా ఏర్పాటు చేసినప్పటికీ, వాటి కారణంగా దెబ్బతిన్న వైర్లను సకాలంలో మరమ్మతు చేయకపోతే సిరీస్ లైట్లు నిరుపయోగంగా మారే అవకాశం ఉంది. ప్రజాధనంతో ఏర్పాటు చేసిన లైటింగ్ వ్యవస్థ దెబ్బతినకుండా చూడాల్సిన అవసరం ఉంది.

**మున్సిపల్ అధికారులు దృష్టి సారించాలి**
పట్టణంలోని సెంట్రల్ లైటింగ్ పోల్స్‌ను పరిశీలించి, తెగిపోయిన వైర్లకు మరమ్మతులు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. పోల్స్‌కు ఫ్లెక్సీలు కట్టే సమయంలో విద్యుత్ అలంకరణలకు నష్టం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. అవసరమైన చోట్ల పర్యవేక్షణ పెంచడంతోపాటు, అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. సెంట్రల్ లైటింగ్ పోల్స్ పట్టణ సౌందర్యాన్ని పెంచడంలో కీలకంగా ఉన్నందున వాటి నిర్వహణపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. దెబ్బతిన్న సిరీస్ లైట్లను పునరుద్ధరించి, భవిష్యత్తులో వైర్లు తెగిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఇద్దరికి చూపునిచ్చిన యువకుడి నేత్రాలు

**- కుటుంబ సభ్యుల ఔదార్యం**
**- నేత్రదానంపై అవగాహన కల్పించిన బంధువు**



**చర్చ,గోదావరిఖని:** రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన యువకుడి నేత్రాలను దానం చేసి ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగులు నింపారు. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం బేగంపేటకు చెందిన ముత్తె అరవింద్ కల్యాణ్ (32) ఈ నెల 22న హన్మకొండలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన సమీప బంధువు లగిశెట్టి రాజకిశోర్ కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. దీంతో వారు అంగీకరించగా, శుక్రవారం ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య సంస్థ సాంకేతిక నిపుణుడు నరేందర్ సహకారంతో అరవింద్ కల్యాణ్ నేత్రాలను సేకరించి హైదరాబాద్‌లోని ఐ బ్యాంకుకు పంపించారు. ఈ నేత్రదానం ద్వారా ఇద్దరు అంధులకు చూపు కల్పించే అవకాశం లభించింది. యువకుడి మరణంతో పుట్టెడు దుఃఖంలో ఉన్నప్పటికీ నేత్రదానానికి అంగీకరించిన ఆయన తల్లిదండ్రులు ముత్తె కళ్యాణి, చంద్రమౌళి, సోదరుడు ముత్తె సుమన్‌ను బంధుమిత్రులు, సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు అభినందించారు. నేత్రదానంపై అవగాహన కల్పించిన లగిశెట్టి రాజకిశోర్‌ను ప్రశంసించారు. బంధుమిత్రులు సందేల కుమార్, కాట సది, శివ, బొడ్డు రవీందర్, దూండే రాజయ్య, కాసర్ల శ్రీను, రాజేశం, కరస్పాండెంట్ తిరుపతిరెడ్డి, బర్ల శ్రీనివాస్ తదితరులు అరవింద్ కల్యాణ్‌కు నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి, ప్రచార కార్యదర్శి వాసు, గౌరవ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ముఖ్య సలహాదారు నూక రమేష్, జిల్లా గౌరవ అధ్యక్షుడు లగిశెట్టి చంద్రమౌళి, జిల్లా అధ్యక్షుడు రాజమౌళి, కె. సమ్మయ్య తదితరులు కుటుంబ సభ్యులను అభినందించారు.

# సొంత ఇంటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

**చర్చ:- హుస్నాబాద్:**హుస్నాబాద్ నియోజకవర్గంలో పూర్తిగా ఇళ్లు లేని నిరుపేదలకు, గుడిసెల్లో నివసిస్తున్న వారికి ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ గారు తెలిపారు.
నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం అర్హుల నుంచి డిమాండ్ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో, అత్యంత దయనీయ పరిస్థితుల్లో నివసిస్తున్న వారికి ముందుగా న్యాయం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రాధాన్యతా క్రమంలో ఇళ్లను కేటాయిస్తోందని పేర్కొన్నారు.
అదేవిధంగా గౌరవెల్లి – గండిపల్లి ప్రాజెక్టు నిర్మాణం కారణంగా ఇళ్లు కోల్పోయి, ఇప్పటివరకు ఎలాంటి ఇల్లు పొందని నిర్వాసితుల్లో భూమి ఉండి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన వారికి కూడా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు.




కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ వరకు నిర్మిస్తున్న నాలుగు వరుసల రహదారి విస్తరణలో భాగంగా చిగురుమామిడి, సుందరగిరి తదితర ప్రాంతాల్లో ఇళ్లు కోల్పోయిన అర్హులైన కుటుంబాలకు కూడా ఇందిరమ్మ ఇళ్లు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.అలాగే హుస్నాబాద్ పట్టణంలోని మల్లెచెట్టు చౌరస్తా నుంచి జనగామ మార్గంలో అక్కన్నపేట మీదుగా రహదారి విస్తరణ తదితర కారణాలతో ఇళ్లు కోల్పోయిన అర్హులైన వారికి సైతం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.
**నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం**
ఇళ్లు లేని నిరుపేదలకు, గుడిసెల్లో జీవనం సాగిస్తున్న కుటుంబాలకు, వివిధ అభివృద్ధి ప్రాజెక్టులు, రహదారి విస్తరణ కారణంగా నివాసాలను కోల్పోయిన అర్హులైన నిర్వాసితులకు న్యాయం చేయాలన్నదే తమ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. అర్హుల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ, అత్యంత అవసరంలో ఉన్న కుటుంబాలకు మొదటి ప్రాధాన్యతనిస్తూ, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి
- సింగరేణి జీఎం కార్యాలయంలో ఓటరు నమోదుపై అవగాహన
- నవంబర్ 6 వరకు గడువు ఉందని వెల్లడి

**భూపాలపల్లి, అక్టోబర్ 23 :**
వరంగల్--ఖమ్మం--నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకోవాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి కోరారు. శుక్రవారం భూపాలపల్లి సింగరేణి జనరల్ మేనేజర్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన జీఎంతో పాటు ఉద్యోగులను కలిసి పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదుకు నవంబర్ 6 వరకు గడువు ఉందని, అర్హులైన వారు చివరి తేదీ వరకు వేచి చూడకుండా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు నమోదు ప్రాధాన్యతను వివరించేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఇందులో భాగంగా భూపాలపల్లి అంబేద్కర్ స్టేడియంలో మార్నింగ్ వాకర్స్‌ను, సింగరేణి కార్మికుల క్వార్టర్స్‌తో పాటు పట్టణంలోని 5, 6, 7, 24వ వార్డుల్లో ప్రజలను కలిసి అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలో సుమారు ఐదు వేల మంది పట్టభద్రులు ఓటరుగా నమోదైనట్లు సమాచారం ఉందన్నారు. గతంతో పోలిస్తే నమోదు సంఖ్య తక్కువగా ఉందని, ఇంకా ఎక్కువ మంది నమోదు చేసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు ఎంతో ప్రాధాన్యత ఉందని, అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకుని ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని గండ్ర విజ్ఞప్తి చేశారు. జీఎం కార్యాలయ ఉద్యోగులు ఓటరు నమోదు కార్యక్రమంపై సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, టీబీజీకేఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సర్వపిండిపై చర్చ'తో వినూత్న కార్యక్రమం

- పట్టభద్రుల సమస్యలపై చర్చకు కొత్త వేదిక
- కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ అభ్యర్థి డా. చింతం ప్రవీణ్ కుమార్



**వరంగల్, అక్టోబర్ 23 :**
వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ చింతం ప్రవీణ్ కుమార్ 'సర్వపిండిపై చర్చ' పేరుతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తెలంగాణ సంప్రదాయ పిండి వంటకమైన సర్వపిండిని వేదికగా చేసుకుని పట్టభద్రులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో గురువారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా డా. చింతం ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన 'చాయ్ పే చర్చ' తరహాలో తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే 'సర్వపిండిపై చర్చ' కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. పట్టభద్రులు, విద్యావంతులు, నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకోవడంతోపాటు విద్యారంగం, ఉపాధి అవకాశాలు, రాజకీయ అంశాలపై చర్చించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. సామాన్య ప్రజలతో నేరుగా మమేకమై వారి అభిప్రాయాలను తెలుసుకునేందుకు ఈ వేదిక ఉపయో గపడుతుందని తెలిపారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో విద్యావంతుల సమస్యలను చర్చకు తీసుకు రావాలని భావిస్తున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ పాక శ్రీధర్, చింతం రాజేశ్వర్, జంగిలి దేవరాజు, మట్ట దుర్గాప్రసాద్, చింతల అనిల్, గోసుల ఆనంద్, తిరుపతి నాయక్, బోడకుంట్ల రవికుమార్, కెత్త జయశంకర్, చింతం అమర్ వర్మ, వీరబత్తిని శ్యాంసుందర్, వద్దె శ్రీనివాస్, రుద్ర శ్రీనివాస్, దీపక్ వరియల్, మేకల కార్తీక్ పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో తాగునీటి కొరతకు చెక్..
# ‘గ్రీన్ వాటర్’ సరఫరాకు జలమండలి ప్రణాళిక

హైదరాబాద్: హైదరాబాద్‌లో పెరుగుతున్న నీటి అవసరాలు, తాగునీటి వనరులపై ఒత్తిడిని తగ్గించేందుకు జలమండలి (హెచ్ ఎండబ్ల్యూ ఎస్ఎస్‌బీ) వినూత్న ప్రణాళికతో ముందుకొచ్చింది. ప్రస్తుతం ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో భవిష్యత్తులో తాగునీటి కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా శుద్ధి చేసిన మురుగునీటిని (ట్రీటెడ్ వాటర్) నిర్మాణ పనులు, పారిశ్రామిక అవసరాలు, రోడ్ల శుభ్రత వంటి పనులకు అందించేందుకు ‘గ్రీన్ వాటర్’ సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. దీనికోసం నగర శివారులోని కోకాపేటలో ప్రత్యేకంగా ఒక గ్రీన్ వాటర్ ఫిల్లింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిస్తోంది. ఈ కేంద్రం అందుబాటులోకి వస్తే, అత్యంత విలువైన తాగునీటిని ఇతర అవసరాలకు వాడటాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. ఈ ప్రణాళిక అమలు సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ కె. అశోక్‌రెడ్డి గురువారం కోకాపేటలో పర్యటించారు. అక్కడి నీటి నాణ్యత పరీక్షల ప్రయోగశాలను సందర్శించి, శుద్ధి చేసిన నీటి నాణ్యతను ఎలా పరీక్షిస్తున్నారు, ఏయే ప్రమాణాలు పాటిస్తున్నారనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలంటే నాణ్యత విషయంలో రాజీ పడరాదని, నిరంతర పర్యవేక్షణ




అత్యంత కీలకమని స్పష్టం చేశారు. జలమండలి అధికారులతో పాటు ‘తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి’ (టీజీఎస్‌పీసీబీ) అధికారులు సమన్వయంతో పనిచేసి, నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా నీటి పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు. నీటి నాణ్యత పరీక్షల ఫలితాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఎండీ అశోక్‌రెడ్డి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దీనివల్ల జలమండలి ప్రధాన కార్యాలయం నుంచే నీటి నాణ్యతను నేరుగా పర్యవేక్షించేందుకు వీలవుతుందని తెలిపారు. ఇందుకు అవసరమైన సాంకేతిక మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసేందుకు ఐటీ విభాగంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ విధానం వల్ల పర్యవేక్షణలో పారదర్శకత పెరగడమే కాకుండా సరఫరా వ్యవస్థను మరింత సమర్థంగా నిర్వహించవచ్చని వివరించారు. గ్రీన్ వాటర్ ఫిల్లింగ్ స్టేషన్‌లో ట్యాంకర్లకు నీటిని నింపే ప్రక్రియపైనా అశోక్‌రెడ్డి పలు కీలక సూచనలు చేశారు. ప్రతి ట్యాంకర్ సామర్థ్యాన్ని బట్టి నీటిని నింపేందుకు పరిమితులు విధించాలని ఆదేశించారు. ఏ ట్యాంకర్‌కు ఎంత నీటిని సరఫరా చేశారనే వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని, పరిమితికి మించి నీరు నింపకుండా ఆటోమేటిక్ కంట్రోల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని తెలిపారు. ట్యాంకర్లు నిండిన తర్వాత అదనంగా మిగిలే నీరు వృథా కాకుండా, దాన్ని తిరిగి సమీపంలోని చెరువుకు మళ్లించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని చెప్పారు. ఈ గ్రీన్ వాటర్ అనేది తాగునీటికి ప్రత్యామ్నాయం కాదని, కేవలం తాగడానికి అవసరం లేని పనులకు మాత్రమే వినియోగించాలని జలమండలి అధికారులు స్పష్టం చేస్తున్నారు. నిర్మాణ రంగం, పరిశ్రమలు, రోడ్లపై దుమ్ము నియంత్రణ, పార్కులు, హరితహారం మొక్కల సంరక్షణ వంటి పనులకు ఈ నీటిని ఉపయోగించేలా ప్రజలను, సంస్థలను ప్రోత్సహించనున్నారు.

## డిసెంబర్ 11 నుంచి 22 వరకు తెలంగాణలో ఖేలో ఇండియా పోటీలు: మంత్రి శ్రీహరి



హైదరాబాద్, అక్టోబరు 23 : తెలంగాణలో ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహణకు పకడ్బందీ కార్యాచరణ రూపొందిస్తున్నామని మంత్రి వాకిటి శ్రీహరి వ్యాఖ్యానించారు. డిసెంబర్ 11వ తేదీ నుంచి 22వ తేదీ వరకు తెలంగాణలో ఖేలో ఇండియా పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. (శుక్రవారం) ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహణ ఏర్పాట్లపై మంత్రి వాకిటి శ్రీహరి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు. ఖేలో ఇండియా నిర్వహణను తమ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని వెల్లడించారు. గ్రామీణ స్థాయి నుంచే ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తిస్తామని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. 27 క్రీడాంశాల్లో ప్రతిభ ఆధారంగా క్రీడాకారుల ఎంపిక చేస్తామని వివరించారు. ఎంపిక ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. క్రీడాకారులకు మెరుగైన శిక్షణ, పోషకాహారం అందించడంపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని మార్గనిర్దేశం చేశారు. స్టేడియాలు, క్రీడా పరికరాలు, మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. క్రీడాకారులకు వైద్య సహాయం, వసతి, రవాణా సదుపాయాలు కల్పించాలని దిశానిర్దేశం చేశారు. దేశానికే ఆదర్శంగా ఖేలో ఇండియా పోటీల నిర్వహణ ఉండాలని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.

## క్యూవీఎస్ఈ యాప్‌తో జాగ్రత్త!



వరంగల్ క్యూవీఎస్ఈ (క్వాంటమ్ వెస్ట్ స్టాక్ ఎక్స్ఛేంజ్) యాప్ ద్వారా ఆన్‌లైన్ పెట్టుబడి మోసాలు జరుగుతున్నట్లు కేంద్ర, రాష్ట్ర సైబర్ క్రైం విభాగాలు హెచ్చరిస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత సూచించారు. సైబర్ నేరగాళ్లు యాప్‌లో ఏపీకే ఫైల్స్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఇన్‌స్టాల్ చేసుకోవాలని మొబైల్‌ఫోన్ యూజర్లను ఏమార్చుతున్నారని తెలిపారు. భారతదేశ డబ్బును ఫైనాన్స్ ఎక్ఛేంజ్ ద్వారా క్రిప్టో కరెన్సీగా మార్చి పెట్టుబడి పెట్టాలని సూచిస్తున్నారని, అలా చేస్తే 1 శాతం లాభం వస్తుందని నమ్మిస్తున్నారని తెలిపారు. ఈ తరహా మోసాలకు సంబంధించి తెలంగాణలో ఇప్పటికే 52 కేసులు నమోదయ్యాయన్నారు. అత్యాశకు పోయి కష్టపడి సంపాదించిన డబ్బును పోగొట్టుకోవద్దన్నారు. సైబర్ నేరానికి గురైతే తక్షణమే 1930 హెల్ప్‌లైన్ నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

# జీరో నక్సల్ స్టేట్‌గా తెలంగాణ

హైదరాబాద్, అక్టోబరు 23 : నక్సల్స్ సమస్య 1980లో ఉండేదని.. ఇందుకోసం గ్రేహౌండ్స్ ఏర్పాటు చేశామని.. ఈ విభాగానికి దేశవ్యాప్తంగా ప్రాముఖ్యం ఉందని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వ్యాఖ్యానించారు. నక్సల్స్ సమస్య తగ్గిపోయిన తర్వాత గతంలో హైదరాబాద్‌లో బ్లాస్టులు జరిగాయని.. అప్పుడు అక్టోపస్‌ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఇటీవల జీరో నక్సల్ స్టేట్‌గా తెలంగాణ ఏర్పాటైందని అన్నారు. రెండేళ్లలో 824 మంది లొంగిపోయారని.. 302 ఆయుధాలను అప్పగించారని ప్రస్తావించారు. హైదరాబాద్‌లో తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ 36వ రైజింగ్ డే పరేడ్‌ను ఈరోజు (శుక్రవారం) నిర్వహించారు. అమీన్‌పూర్‌లోని టీజీ ఎస్పీఎఫ్ సెక్యూరిటీ అకాడమీలో ఈ వేడుకలు జరిగాయి. ఈ పరేడ్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, డీజీపీ ఆనంద్, టీజీఎస్పీఎఫ్ డీజీ స్వాతి లక్రా, హోం ప్రిన్సిపాల్ సెక్రటరీ శిఖా గోయల్ హాజరయ్యారు. 36వ ఆవిర్భావ దినోత్సవం



సందర్భంగా అందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డీజీపీ ఆనంద్ మాట్లాడారు. డ్రగ్స్‌పై పోరాటానికి ఈగల్ ఫోర్స్ ఏర్పాటు. .ఇప్పుడు డ్రగ్స్‌పై పోరాటానికి ఈగల్ ఫోర్స్ ఏర్పాటు చేశామని డీజీపీ ఆనంద్ వెల్లడించారు. డీజీ స్థాయి అధికారి దీనికి హెడ్‌గా ఉంటారని ప్రస్తావించారు. దేశ విదేశాల్లో నేరగాళ్ల కోసం ప్రత్యేక ఆపరేషన్లు చేశారని తెలిపారు. ఇందుకుగాను కేంద్ర హోం శాఖ అవార్డు ఇచ్చిందని అన్నారు. సైబర్ నేరాల కట్టడికి సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పాటు చేశామని వివరించారు. ఇటీవల సీఎస్‌బీ చేసిన ఎఫర్ట్స్‌కి కేంద్ర హోం శాఖ అవార్డు ఇచ్చిందని తెలిపారు. డయల్ 112 నంబర్‌ను బలోపేతం చేశామని వివరించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ ద్వారా ప్రకృతి విపత్తుల్లో సమర్థవంతంగా పనిచేస్తున్నామని వెల్లడించారు. పోలీసులు వినియోగించే యాప్స్‌ను పూర్తిగా ఏఐ బేస్డ్‌గా మార్చేసి ‘ంజాఘుతీని పేరుతో అప్‌డేట్ చేశామని తెలిపారు. స్త్రీల భద్రతకు మహిళా భద్రత విభాగం పనిచేస్తోందని వివరించారు. అలాగే, టీ-సేఫ్ యాప్‌ను రూపొందించామని డీజీపీ ఆనంద్ పేర్కొన్నారు. డ్రగ్స్‌కు బానిసైన వారికోసం సన్మిత్ర: డీజీపీ సలీంకర్ణాటకలో ‘మనే మనేగే పోలీస్’ పేరుతో సీనియర్ సిటిజన్, పేద ప్రజలకు సేవలు అందిస్తున్నట్లు కర్ణాటక డీజీపీ ఎంఏ సలీం తెలిపారు. మొత్తం కోటి మందికి పైగా ప్రజల సమస్యలను పోలీసు సిబ్బంది పరిష్కరించినట్లు వివరించారు. ప్రత్యేక మొబైల్ నంబర్‌ను ఏర్పాటు చేసి వాటికీ అత్యవసర సహాయం అందేలా చూస్తున్నామని తెలిపారు. డ్రగ్స్‌కు బానిసైన వారికోసం ‘సన్మిత్ర’ పేరుతో సెంటర్లు ఏర్పాటు చేశామని చెప్పుకొచ్చారు. ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా సహకారంతో డ్రగ్స్ కట్టడికి కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు ట్రాఫిక్ ప్రధాన సమస్య అని... రద్దీని తగ్గించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని చెప్పారు. ‘అస్త్రం’ పేరుతో ఏఐ బేస్డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ ఏర్పాటు చేశామని కర్ణాటక డీజీపీ సలీం పేర్కొన్నారు.

# 12 లక్షల కార్లు విడుదల చేసే కాలుష్యంతో సమానం

హైదరాబాద్: మహానగరంలో ఇతర ప్రాంతాల ప్రజలు స్వచ్ఛమైన గాలిని పీల్చుకుంటుంటే, జవహర్‌నగర్ నివాసితులు మాత్రం నగరం అంతటి నుంచి వచ్చే వ్యర్థాల దుర్వాసనను భరించాల్సిన దుస్థితి నెలకొంది. సుమారు 1.5 కోట్ల జనాభా కలిగిన భాగ్యనగరం, ఈ డంపింగ్ యార్డుపైనే ఆధారపడి, అక్కడే చెత్తను పారబోయడమే అందుకు ప్రధాన కారణం. చెత్త, దుర్వాసన సమస్యతో జవహర్‌నగర్ పరిసర గ్రామాల్లోనూ భయాందోళనలు పెరుగుతున్నాయి. అయితే అధికారులు మాత్రం దీని వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్?రంజన్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి ఇటీవల డంపింగ్ యార్డు సమీపంలోని ప్రాంతాలను సందర్శించారు. కానీ సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. ఈ ప్రాంతం నుంచి వెలువడుతున్న ప్రమాదకరమైన మీథేన్ వాయువు వ్యాప్తిపైన అధ్యయనం చేయించి, నిజాన్ని తేల్చేందుకు కూడా ప్రయత్నాలు




చేయలేదు. రోజుకు 3,000 టన్నుల వ్యర్థాల పెరుగుదలనగర శివార్లలో ఆధునిక, దుర్వాసన వెదజల్లని వ్యర్థాల నిర్వహణ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని గతంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. సంగారెడ్డి జిల్లాలోని ప్యారానగర్, దుండిగల్, అలాగే రంగారెడ్డి జిల్లాలోని ఖానాపూర్, యాచారం గ్రామాల్లో భూ సర్వేలు కూడా నిర్వహించారు. అయితే స్థానికుల నుంచి వ్యతిరేకత రావడంతో ఈ ప్రక్రియ అక్కడితో నిలిచిపోయింది. దీనికి బదులుగా జవహర్‌నగర్‌లో రెండు, దుండిగల్‌లో ఒకటి చొప్పున వ్యర్థాల నుంచి విద్యుత్తు ఉత్పత్తి చేసే ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఇవి రోజుకు 2,500 టన్నుల వ్యర్థాలను ప్రాసెస్ చేస్తున్నా, జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు మాత్రం భారం తగ్గడం లేదు. గతంలో రోజుకు 7,500 టన్నులుగా ఉన్న వ్యర్థాల ఉత్పత్తి, ప్రస్తుతం 10,500 టన్నులకు పెరిగింది. మరోవైపు రంగారెడ్డి జిల్లాలోని సిద్ధాపూర్‌లో అత్యాధునిక వ్యర్థాల రీసైక్లింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన కూడా అక్కడే ఆగిపోయింది. కార్బన్ డయాక్సైడ్ కంటే 86 రెట్లు ప్రమాదకరంసెంటర్ ఫర్ ఫైనాన్షియల్ అకౌంటబిలిటీ (సీఎఫ్ఏ) వెల్లడించిన అంచనాల ప్రకారం, జవహర్‌నగర్ డంపింగ్ యార్డు ప్రపంచవ్యాప్తంగా మీథేన్ ఉద్గారాలను విడుదల చేస్తున్న అతిపెద్ద చెత్త కేంద్రాల్లో నాలుగో స్థానంలో ఉంది. కార్బన్‌డయాక్సైడ్‌తో పోలిస్తే మీథేన్ 86 రెట్లు ఎక్కువ ప్రమాదకరమైంది. ప్రస్తుతం జవహర్‌నగర్ డంపింగ్ యార్డు నుంచి గంటకు 5.9 టన్నుల చొప్పున మీథేన్ గాల్లోకి విడుదలవుతోంది. ఇది 12 లక్షల కార్ల ద్వారా వెలువడే కాలుష్యంతో సమానం.

## తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం.. ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు..!

హైదరాబాద్, అక్టోబరు 23 : తెలంగాణ ప్రభుత్వం ఇక నుంచి ఇంటి వద్దకే మీ సేవా, ఆధార్ సేవలు తీసుకువచ్చేందుకు సిద్ధమవుతోంది. అలాగే, ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు ఇంటి వద్దే పొందే అవకాశం కల్పించనుంది. ఆధార్ నమోదు, వివరాల అప్‌డేట్ సేవలు కూడా ఇంటి వద్దకే తీసుకురానున్నట్లు తెలుస్తోంది. మీ సేవా డోర్‌స్టెప్ ద్వారా డెలివరీకి తొలి నెలలోనే అపూర్వ స్పందన వచ్చింది. 1100 టోల్‌ఫ్రీ నంబర్‌కు 3,885 కాల్స్, 1100కు కాల్ చేసి లేదా మీ సేవా పోర్టల్ ద్వారా సేవలు బుక్ చేసుకోవచ్చని అధికారులు తెలుపుతున్నారు. క్యూల్లో నిలబడే అవసరం లేకుండా ఇంటి వద్దే సేవలు తీసుకువచ్చేలా కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం జఖ=జు పరిధిలోని ప్రాంతాల్లోనే డోర్‌స్టెప్ సేవలు ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. బుక్ చేసుకున్న సేవల ఆధారంగా నిర్దేశిత రుసుములు చెల్లించాలనే షరతును విధించనుంది. తెలంగాణ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో ఈ సేవలను రాష్ట్ర ప్రభుత్వం బలోపేతం చేస్తోంది.

## స్వీట్ షాపుల్లో టీజీ సేఫ్ తనిఖీలు.. ఫంగస్ ఉన్న మిఠాయిల గుర్తింపు



TG SAFE
TELANGANA STANDARDS AUTHORITY FOR FOOD AND ESSENTIAL DRUGS

హైదరాబాద్, అక్టోబర్ 23: నగరంలోని పలు స్వీట్ షాపులపై టీజీ సేఫ్ ఫుడ్ వింగ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మొత్తం 12 బృందాలతో ఫుడ్ సేఫ్టీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రంగంలోకి దిగారు. ఈ క్రమంలో అపరిశుభ్ర పరిసరాల్లో స్వీట్లను తయారు చేస్తున్నట్లు గుర్తించారు. లైసెన్స్ లేకుండానే కొన్ని స్వీట్ షాపులను నిర్వహిస్తున్నారని, అంతేకాకుండా గడువు ముగిసిన లైసెన్స్‌లతోనూ షాపులను నడుపుతున్నట్లు తనిఖీల్లో బయటపడింది. ఎక్స్‌పైరీ ముగిసిన స్వీట్లను తొలగించకుండా విక్రయానికి పెట్టడంతో పాటు గడువు ముగిసిన స్వీట్లను కొత్త స్వీట్ల తయారీలో కలుపుతున్నట్లు టీజీ సేఫ్ అధికారులు గుర్తించారు. పురుగులు, ఫంగస్ ఉన్న పల్లీలు, స్వీట్లు విక్రయానికి ఉంచినట్లు తనిఖీల్లో తేలింది. తార్నాకలోని వీ/ఎ.సుదర్శన్ రెడ్డి ప్యూర్ ఘీ స్వీట్స్‌కు టీజీ సేఫ్ అధికారులు దాడులు నిర్వహించారు.

# పొదుపు సంఘాల మాటున అక్రమాలు – దొరికిపోతామనే భయంతో రూ. 40 కోట్లు వెనక్కి

హైదరాబాద్: పట్టణ ప్రాంతాల్లో పేదరికాన్ని నిర్మూలించేందుకు అమలు చేస్తున్న మిషన్? ఫర్? ఎలిమినేషన్? ఆఫ్? పావర్టీ ఇన్? మున్సిపల్? ఏరియాస్? (మెప్మా)లో అవినీతి విపరీతంగా పెరిగిపోతోంది. ఈ విషయమై ఫిర్యాదులు అందిన తర్వాత జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు జరిపిన విచారణలో ఆందోళనకరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. తమదాకా వస్తే దొరికిపోతామనే భయంతో రాష్ట్రవ్యాప్తంగా అప్రమత్తమైన అవినీతి సిబ్బంది ఏకంగా రూ.40 కోట్లను బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం గమనార్హం. దీంతో రుణాల మంజూరు ప్రక్రియను పూర్తిగా ప్రక్షాళన చేసేందుకు అధికారులు కసరత్తులు చేస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లోని పేద మహిళలు సంఘాలుగా ఏర్పడి దరఖాస్తు చేసుకుంటే బ్యాంకులు వారికి రుణాలు అందిస్తాయి. వారు వాటిలో చిన్న వ్యాపారాలు చేసుకుని ఉపాధి అవకాశాలు పొందవచ్చు. ఈ రుణాల మంజూరు ప్రక్రియలో కమ్యూనిటీ ఆర్గనైజర్లు (సీవోలు) కీలక పాత్ర పోషిస్తారు. ఈ సంఘాల సూక్ష్మ రుణ ప్రణాళిక (మైక్రో క్రెడిట్? ప్లాన్?)లను రూపొందించడంలో, వాటిని అధికారులకు సమర్పించడంలో, వారి ఆమోదం పొందిన తర్వాత బ్యాంకుల ద్వారా రుణాలు



ఇప్పించడంలో వీరు కీలక పాత్ర పోషిస్తారు. ఈ అవకాశాన్ని ఆసరాగా చేసుకుని కొందరు సీవోలు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. తమకు వాటా ఇస్తామని చెప్పే సంఘాలకు మాత్రమే రుణాలు ఇప్పిస్తున్నారు. అసలు పని చేయని వాటికి కూడా రుణాలు మంజూరు చేయిస్తున్నారు. కొంతమంది సీవోలు పొదుపు సొసైటీలకు రుణాలు మంజూరు చేయిస్తున్నారు. అయితే వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం లేదు. ఫలితంగా దీనికి సంబంధించిన రుణాల గురించి అధికారులకు తెలియడం లేదు. ఈ సొమ్మును నిబంధనలకు విరుద్ధంగా వినియోగించుకోవాలన్నదే వీరి ఉద్దేశం. ఇంకోవైపు కొందరు సీవోలు మూసివేసిన, ఉనికిలో లేని సంఘాలకు నకిలీ పత్రాలతో రుణాలు ఇప్పించారు. ఉదాహరణకు సరూర్‌నగర్ సర్కిల్‌లో 2,241 సంఘాలు ఉండగా, వాటిలో 1,897 ఉనికిలో ఉన్నాయి. 310 సంఘాలు పని చేయడం లేదు. 34 డిఫాల్ట్ జాబితాలో ఉన్నాయి. ఎల్?బీనగర్ పరిధిలో 1,953 సంఘాలకు 1,783 క్రియాశీలకంగా ఉండగ 118 పని చేయడం లేదు, 52 డిఫాల్ట్ అయ్యాయి. హయత్‌నగర్ సర్కిల్? పరిధిలోని 1,904 సంఘాలలో 1,395 క్రియాశీలంగా ఉన్నాయి, 469 పనిచేయడం లేదు, 40 డిఫాల్ట్ అయ్యాయి. వాస్తవానికి పనిచేయని, డిఫాల్ట్ అయిన సంఘాలకు రుణాలు ఇవ్వకూడదు. అయితే అధికారులు అప్రమత్తమై అలాంటి సంఘాలకు రుణాల మంజూరుపై రాష్ట్రవ్యాప్త విచారణకు ఆదేశించగా వందలాది పొదుపు సంఘాల నుంచి రూ. 40 కోట్లు బ్యాంకుల్లో తిరిగి జమ అయినట్లు తెలుస్తోంది. చాలా మంది సీవోలు ఒకే సర్కిల్‌లో చాలా కాలంగా పనిచేస్తుండటంతో అక్కడి సంఘాల వారు, బ్యాంకుల సిబ్బందితో పరిచయాలు పెంచుకున్నారు.

## అనూహ్య పరిణామం.. జడ్పీటీసీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన పరిటాల శ్రీరామ్



**సత్యసాయి జిల్లా :** రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరుస్తూ, తెలుగు దేశం పార్టీ నేత పరిటాల శ్రీరామ్ స్థానిక సంస్థల ఎన్నికల బరిలోకి దిగారు. శ్రీ సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గం నల్లచెరువు జడ్పీటీసీ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా ఆయన ఈరోజు నామినేషన్ దాఖలు చేశారు. ఎలాంటి హడావుడి లేకుండా నిరాడంబరంగా ఈ ప్రక్రియ పూర్తి చేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది. నామినేషన్ల స్వీకరణకు చివరి రోజైన శుక్రవారం, పరిటాల శ్రీరామ్ కొత్తచెరువులోని శ్రీ సత్యసాయి జిల్లా పరిషత్ కార్యాలయంలో తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన వెంట కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఎం.ఎస్. రాజు ఉన్నారు. కదిరి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని నల్లచెరువు నుంచి ఆయన పోటీకి దిగడం రాజకీయంగా ప్రాధాన్యం సం తరించుకుంది. శ్రీ సత్యసాయి జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవిని కైవసం చేసుకునే వ్యూహంలో భాగంగానే, టీడీపీ అధిష్ఠానం పరిటాల శ్రీరామ్‌ను జడ్పీటీసీ అభ్యర్థిగా బరిలోకి దించినట్లు తెలుస్తోంది. జిల్లా జడ్పీ ఛైర్మన్ అభ్యర్థిగా ఆయనే ఉంటారని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈ పరిణామం చోటుచేసుకుంది. నవంబర్ 3న పోలింగ్, 5న ఓట్ల లెక్కింపు జరగనుంది. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణల గడువు ముగిశాక తుది అభ్యర్థుల జాబితా వెలువడనుంది.

# పులివెందులలో నామినేషన్ల వేళ హై టెన్షన్.. అవినాశ్ రెడ్డి ఇంటికి పోలీసుల నోటీసులు

**పులివెందుల:** పులివెందులలో ఉద్రిక్తతల మధ్య నామినేషన్ల పర్వం పట్టణంలో ర్యాలీలు, సభలపై నిషేధం ఉందన్న పోలీసులు నలుగురు లేదా ఐదుగురికి మించి గుమికూడకూడదని హెచ్చరిక కడప జిల్లా పులివెందులలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ తీవ్ర ఉద్రిక్తతల మధ్య కొనసాగుతోంది. శాంతి భద్రతల పరిరక్షణ పేరుతో పోలీసులు కఠిన ఆంక్షలు విధించారు. ఇందులో భాగంగా వైసీపీ ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి నివాసానికి పోలీసులు అధికారికంగా నోటీసులు జారీ చేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది. పులివెందుల పట్టణంలో బీఎన్ఎస్ సెక్షన్ 163, పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 కింద కఠిన ఆంక్షలు అమల్లో ఉన్నాయని పులివెందుల అర్బన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పేరుతో జారీ చేసిన నోటీసులో స్పష్టం చేశారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఎలాంటి ర్యాలీలు, బహిరంగ సభలు, ధర్నాలకు అనుమతి లేదని తెలిపారు. నలుగురు లేదా ఐదుగురి కంటే ఎక్కువ మంది గుమిగూడితే



నిబంధనల ఉల్లంఘనగా పరిగణించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే, పోలీసుల చర్యలపై ఎంపీ అవినాశ్ రెడ్డితో పాటు వైసీపీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. తమ పార్టీ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అడ్డుకునేందుకే అధికార పక్షం ఒత్తిడితో పోలీసులు ఈ ఆంక్షలు విధిస్తు న్నారని వారు ఆరోపిస్తున్నారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవ హరిస్తూ ప్రతిపక్షాన్ని అణిచి వేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగ కుండా పట్టణంలో భారీగా పోలీసులను మోహరిం చారు. కడప జిల్లా పులివెందులలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అధికార యంత్రాంగం, పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా అధికార పార్టీకి చెందిన కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి పోలీసులు నోటీసులు జారీ చేశారు. శుక్రవారం ఉదయం పులివెందులలోని ఆయన స్వగృహానికి వెళ్లిన పోలీసులు, నేరుగా ఇంటికి నోటీసులు అంటించారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల వేళ క్షేత్రస్థాయిలో కఠిన ఆంక్షలు అమలు చేస్తున్నట్లు నోటీసుల్లో పోలీసులు స్పష్టం చేశారు. నాయకులు, రాజకీయ పార్టీలు ఎలాంటి ర్యాలీలు, బహిరంగ సమావేశాలు నిర్వహించరాదని తేల్చి చెప్పారు. నిబంధనల ప్రకారం ఐదుగురికి మించి ఒకేచోట గుమిగూడినా అది కచ్చితంగా ఎన్నికల నిబంధనల ఉల్లంఘన కిందకే వస్తుందని స్పష్టం చేశారు. ఈ ఆంక్షలను ఏమాత్రం ఉల్లంఘించినా చట్టపరమైన కఠిన చర్యఅధికార పార్టీకి చెందిన కడప ఎంపీ వైఎస్ లు తీసుకుంటామని ఎంపీకి ఇచ్చిన నోటీసుల్లో గట్టి హెచ్చరికలు జారీ చేశారు. పరిషత్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకే ముందస్తుగా ఈ ఆంక్షలు అమలు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అయితే, సిట్టింగ్ ఎంపీ ఇంటికే పోలీసులు నేరుగా వెళ్లి నోటీసులు అంటించడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు: చంద్రబాబుపై జగన్ ఫైర్

**అమరావతి, :** ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని వైసీపీ అధినేత జగన్ ఆరోపించారు. రాష్ట్రంలో రావణ కాసుర పాలన నడుస్తోందని ఆయన మండి పడ్డారు. నామినేషన్ కేంద్రాల వద్ద వైసీపీ అభ్యర్థులపై దాడులు చేసి, వారి నామినేషన్ పత్రాలను చించివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీ నేతలను పోలీసులు గృహ నిర్బంధం చేయడం, పోలీస్ స్టేషన్లకు పిలిపిం చడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ అక్రమాలపై తాము ఆధారాలు సేకరించి రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ), గవర్నర్‌తో పాటు సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించామని తెలిపారు. తమ పిటిషన్‌పై స్పందించిన సుప్రీం కోర్టు, అభ్యర్థుల తుది జాబితా ప్రకటనను అక్టోబర్ 25 వరకు వాయిదా వేయాలని, నామినేషన్ల దాఖలుకు స్వేచ్ఛ కల్పించాలని, అభ్యర్థులకు రక్షణ, సీసీటీవీ రికార్డింగ్ ఏర్పాటు చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని జగన్



గుర్తుచేశారు. అయినప్పటికీ ప్రభుత్వ యంత్రాంగం వైఖరిలో ఎలాంటి మార్పు రాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 19 మున్సిపాలిటీలలో తమ అభ్య ర్థులు నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని, కానీ ఎస్ఈసీ కేవలం పరిమిత సంఖ్యలో కొన్ని చోట్ల మాత్రమే రీ-నామినేషన్లకు అవకాశం ఇచ్చిందని జగన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏకపక్ష విజయాల కోసం చంద్రబాబు నిబంధనలు మార్చుతున్నారని, ఇది మహాభారతంలోని మాయాజూదాన్ని తలపిస్తోందని ఆయన విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్లు, ఏకగ్రీవాలపై వైసీపీ నేతల ఫేక్ ప్రచారాలు బయటపడుతున్నాయి. ఈ ఎన్నికల్లో హోరాహోరీగా నామినేషన్లు దాఖలవుతున్నాయని అసత్యపు ప్రచారాలకు ఫ్యాన్ పార్టీ కేడర్ దిగుతున్నారు. తెలుగుదేశం పార్టీ కంటే ఎక్కువ నామినేషన్లు దాఖలు చేసినట్లు వైసీపీ నేతలు ప్రచారం చేసుకుంటున్నారు. 28 జిల్లాల్లో 9829 ఎంపీటీసీలకు గానూ మొత్తం 32,095 నామినేషన్లు దాఖలైనట్లు వైసీపీ నేతలు ఫేక్ ప్రచారాలు చేస్తున్నారు. మొత్తం 15,017 నామినేషన్లను టీడీపీ అభ్యర్థులు దాఖలు వేశారు. ఇప్పటికీ 12,419 నామినేషన్లను వైసీపీ అభ్యర్థులు దాఖలు చేశారు. జనసేన పార్టీ తరపున 2073 మంది నామినేషన్లను దాఖలు చేశారు. బీజేపీ నుంచి 562 నామినేషన్లు దాఖలయ్యాయి. 28 జిల్లాల్లో 659 జెడ్పీటీసీ స్థానాలకు గానూ మొత్తం 2805 నామినేషన్లు దాఖలు అయ్యాయి. వైసీపీ నుంచి 1092 మంది నామినేషన్లు వేశారు. తెలుగుదేశం పార్టీ తరపున 1055 నామినేషన్లు దాఖలయ్యాయి. జనసేన పార్టీ నుంచి 178, బీజేపీ తరపున 111 నామినేషన్లు దాఖలయ్యాయి. 2020లో జరిగిన పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల్లో భారీగా ఏకగ్రీవలైన విషయం తెలిసిందే. నాడు జరిగిన పట్టణ స్థానిక సంస్థల్లో 20.72 శాతం ఏకగ్రీవాలను వైసీపీ చేసుకుంది. జగన్ మోహన్ రెడ్డి పాలనలో జరిగిన గ్రామీణ స్థానిక సంస్థల్లో 24 శాతం మేర ఎంపీటీసీ స్థానాలు, 19 శాతం మేర జెడ్పీటీసీ స్థానాలను ఏకగ్రీవంగా బలవంతంగా చేజిక్కించుకున్నారు. వైసీపీ నేతల విధ్వంసాలు, దాడులతో గొడవలను సృష్టించి ఏకగ్రీవం చేసుకుని విజయం సాధించామని నాడు జగన్ అండ్ కో ప్రకటించిన విషయం తెలిసిందే.

## తాడిపత్రిలో ఫ్యాక్షన్ లేకుండా చేస్తా.. జేసీ ప్రభాకర్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

**అనంతపురం జిల్లా, అక్టోబరు 23 :** అభివృద్ధి అంటే ప్రభుత్వం ఇచ్చే నిధులతో కాదని. సొంత ఆలోచనలతో నిధులు తేవడాన్ని అభివృద్ధి అంటారని మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకరరెడ్డి పేర్కొన్నారు. తాడిపత్రి మున్సిపల్ కార్యాలయానికి తన సొంత ఆలోచనలతో నిధులు తెచ్చి రూపురేఖలు మార్చనని చెప్పుకొచ్చారు. తాడిపత్రి నియోజకవర్గ పరిధిలోని మండలాల జెడ్పీటీసీ అభ్యర్థులతో కలిసి నామినేషన్ కేంద్రం వద్దకు ప్రభాకరరెడ్డి వచ్చారు. జెడ్పీటీసీ అభ్యర్థులతో కలిసి జిల్లా పరిషత్‌లో నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా జేసీ ప్రభాకర్ రెడ్డి మాట్లాడారు. తాడిపత్రికి ఇంటర్నేషనల్ డ్రైవింగ్ లైసెన్స్ సెంటర్..అనంతపురం జిల్లా పరిషత్‌ను అభివృద్ధి చేస్తామని జేసీ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. త్వరలోనే తాడిపత్రికి ఇంటర్నేషనల్ డ్రైవింగ్ లైసెన్స్ సెంటర్ వస్తోందని అన్నారు. దేశంలో రెండు ప్రాంతాల్లో మాత్రమే ఈ లైసెన్స్ సెంటర్స్ ఉన్నాయని వెల్లడించారు. తెలుగుదేశం పార్టీ యల్లనూరు జెడ్పీటీసీగా ఎంటెక్ చదివే అమ్మాయిని పోటీలో పెడుతు



న్నానని తెలిపారు. ఈ ఎన్నికల్లో ఓడిపోయిన పర్వాలేదని, తాడిపత్రిలో ఫ్యాక్షన్ లేకుండా చేస్తానని స్పష్టం చేశారు. స్థానిక ఎన్ని కలంటే భయం లేదు..స్థానిక ఎన్నికలంటే తనకు భయం లేదని జేసీ ప్రభాకర్ రెడ్డి చెప్పారు. స్థానిక ఎన్నికల్లో తన కొడుకు, తాను పోటీ చేశా, తన అన్న కూడా గతంలో పనిచేశారని.. అందుకే భయం లేదని అన్నారు. రాబోయే రోజుల్లో తాను, కేతిరెడ్డి పెద్దారెడ్డి రాళ్లు వేసుకుంటుంటే.. జనం తమ ఇద్దరి మీద రాళు వేస్తారని చమత్కరించారు. ప్రజల్లో మార్పు వచ్చిందని.. 2028లో రాజకీయ నాయకులను మెట్టు(చెప్పు)తో కొడుతారని చెప్పారు. రాబోయే

## ఎన్నికల్లో మారణాయుధాలను చూపి బెదిరించడం దుర్మార్గం

**నెల్లూరు, అక్టోబర్ 23:** కూటమి ప్రభుత్వ హయాంలో ఆత్మకూరులో రూ. 117 కోట్లతో అభివృద్ధి జరిగిందని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. (శుక్రవారం) మీడియాతో మాట్లాడుతూ.. రూ. 29 కోట్లతో సిమెంట్ రోడ్ల పనులు జరుగుతున్నాయన్నారు. ఇటీవల డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేతల మీదుగా నాలుగు లైన్ల రోడ్డును ప్రారంభించుకున్నామని



తెలిపారు. ఎమ్ఎస్ఎమ్ఈ (మీవీజు) పార్కుకు 30కి పైగా పరిశ్రమలు వచ్చాయని... 20 ఎకరాల్లో స్టేడియం నిర్మిస్తున్నామని చెప్పారు. వైసీపీ హయాంలో ఒక్క అభివృద్ధి జరగలేదని మంత్రి విమర్శించారు. ఒక్క పరిశ్రమ వస్తే, దానిని కడప జిల్లాకు తరలించుకుపోయారని మండిపడ్డారు. ఆత్మకూరులో ఏం చేశారో చూపిస్తే... తాము వచ్చి చూస్తామన్నారు. అసత్య ఆరోపణలు సరికావని.. ప్రజలు సహించబోరని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేందుకు బొమ్మిరెడ్డి కుటుంబసభ్యులు ముందుకొచ్చారని తెలిపారు. డాక్టర్ బొమ్మిరెడ్డి షకీలా మున్సిపల్ ఛైర్మన్‌గా పోటీ చేస్తున్నారని... ఆమె గెలుపు తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. తుపాకులు, పిస్టళ్లు, గన్స్ కొన్ని కుటుంబాలు, ప్రాంతాలకే పరిమితమని ఆనం అన్నారు. ఎన్నికల్లో మారణాయుధాలను చూపి ప్రజలని బెదిరించడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మా రక్షణకి మా వద్ద వెపన్స్ ఉన్నాయి. అలా అని వాటిని ప్రజల్లోకి తీసుకువెళ్లం. అటువంటి చర్యలని ప్రజలు సహించరు' అని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు.

# కూటమిలో సీట్ల సర్దు'పాట్లు' - చంద్రబాబుతో ప్రత్యేకంగా సమావేశమైన పవన్‌కల్యాణ్

**అమరావతి, :** రాష్ట్రంలో స్థానిక ఎన్నికల్లో నామినేషన్ల గడువు ముగుస్తున్న వేళ కూటమిలో సీట్ల సర్దుబాటు వ్యవహారం కీలక మలుపు తిరిగింది. దీంతో సీఎం చంద్రబాబుతో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మరోసారి భేటీ అయ్యారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలపై ఇంకా ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసానికి ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేరుకుని ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నామినేషన్లకు చివరి రోజు కావడంతో మూడు పార్టీల్లోనూ ఆశావహులు తమకు అవకాశం ఉన్న చోట్ల పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో సీట్ల పంపకాలపై ఇరు నేతలు చర్చించి, కూటమి పార్టీల మధ్య ఏకాభిప్రాయం సాధించడంపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. నామినేషన్ల ఉపసంహరణ గడువు కీలకం కానుండటంతో అప్పటిలోగా అసంతృప్త నేతలను బుజ్జగించి, రెబల్ అభ్యర్థుల పోటీని తగ్గించడం అధినేతలకు సవాలుగా మారింది. సీట్ల సర్దుబాటులో పార్టీ ప్రయోజనాలు, స్థానిక నేతల ఆశలు, కూటమి సమన్వయం ఈ మూడింటినీ సమతుల్యం చేస్తూ వివాదాలకు పరిష్కారం చూపడంపైనే తాజా చర్చల దృష్టి సారించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కూటమి అధినేతలకు కీలక పరీక్ష : స్థానిక



పోరులో సీట్ల సర్దుబాటు కూటమి అధినేతలకు కీలక పరీక్షగా మారింది. వీూజ,గ్రాుజ లకు నామినేషన్ల గడువు ముగుస్తున్న వేళ ఆశావహుల పోటీ, రెబల్స్ బెడద మధ్య కూటమి సమన్వయంపై చంద్రబాబు, పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా చర్చించారు. ముఖ్యమంత్రి నివాసంలో దాదాపు 40 నిమిషాల పాటు సాగిన ఈ భేటీలో స్థానిక సంస్థల ఎన్నికల తాజా పరిణామాలతో పాటు ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల పంపకాలపై చర్చించినట్లు తెలుస్తోంది. అదే ఫార్ములానే అనుసరిస్తారా? : మున్సిపల్ ఎన్నికల్లో 123 స్థానాలకు గాను జనసేనకు 24, బీజేపీకి 9 స్థానాలు కేటాయించారు. అంటే జనసేనకు దాదాపు 20శాతం మేర, బీజేపీకి 7శాతం మేర సీట్లు కేటాయింపు జరిగింది. ఇదే ఫార్ములానే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లోనూ అనుసరిస్తారా? లేక స్థానిక పరిస్థితులు, పార్టీల బలాబలాలను బట్టి సీట్ల పంపకాల్లో మార్పులు చేస్తారా? అన్నది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే మూడు పార్టీల ఆశావహులు తమకు అవకాశం ఉన్న చోట్ల నామినేషన్లు దాఖలు చేయడంతో సీట్ల సర్దుబాటుపై ఏకాభిప్రాయం సాధించడం అధినేతలకు సవాలుగా మారింది. సర్దుబాటుకు మార్గం సుగమమైందా? : నామినేషన్ల ఉపసంహరణ గడువులోగా అసంతృప్తులను బుజ్జగించి, రెబల్ అభ్యర్థుల పోటీని తగ్గించగలిగితేనే క్షేత్రస్థాయిలో కూటమి ఐక్యతకు బలం చేకూరనుంది. పార్టీ శ్రేణుల ఆకాంక్షలు, స్థానిక రాజకీయ సమీకరణాలు, మిత్రపక్షాల మధ్య సమతుల్యత ఈ మూడింటినీ సమన్వయం చేయడంపైనే సీట్ల పంపకాల సక్సెస్ ఆధారపడి ఉంది. 40 నిమిషాల భేటీతో సర్దుబాటుకు మార్గం సుగమమైందా? లేక ఇంకా కొన్ని స్థానాలపై చర్చలు కొనసాగాల్సి ఉందా? అన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది.

# కొల్లూరు మండలంలో ఎడతెరిపి లేని వర్షం - నామినేషన్ అభ్యర్థులకు ఇబ్బందులు

**బాపట్ల జిల్లా:** కొల్లూరు మండలంలో శుక్రవారం ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. ఈ వర్షంతో జనజీవనం స్తంభించింది. కొల్లూరులోని లోతట్టు ప్రాంతాల్లో రోడ్లు, గృహాల్లోకి వర్షపు నీరు చేరింది. రోడ్లపై నీరు చేరడంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మరోవైపు కొల్లూరు ఎంపీడీఓ కార్యాలయంలోకి భారీగా వర్షం నీరు చేరింది. కార్యాలయ ఆవరణ మొత్తం నీటితో నిండిపోయింది. ప్రస్తుతం ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో నామినేషన్ వేయడానికి వచ్చే అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నామినేషన్ అభ్యర్థులు వేచి ఉండే ప్రదేశంలోనూ వర్షపు నీరు నిల్వడంతో అభ్యర్థులు నీళ్లలోనే నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పిడుగులతో కూడిన వర్షం:



రాష్ట్రంలో పలు జిల్లాలకు పిడుగులతో కూడిన వర్ష సూచన ఉన్నట్లు అధికారులు తెలిపారు. నెల్లూరు, తిరుపతి, ప్రకాశం జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వెల్లడించారు. ఏలూరు, కృష్ణా, చిత్తూరు, కడప, అన్నమయ్య, సత్యసాయి జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని సూచించారు. మత్స్యకారులు వెంటనే తీరానికి: తూర్పు మధ్య- ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. శనివారం నాటికి అదే ప్రాంతంలో వాయుగుండంగా రూపాంతరం చెందనుంది. ఆదివారం తీవ్ర వాయుగుండంగా బలపడి ఈ నెల 26 ఉదయానికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తుపానుగా బలపడే అవకాశం ఉంది. తుపాను ఆ తర్వాత రెండు రోజుల్లో ఉత్తరాంధ్ర-దక్షిణ ఒడిశా తీరాల వైపు కదిలే సూచనలు ఉన్నాయి. అల్పపీడనం ప్రభావంతో ఏపీలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ప్రజలు, రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. మత్స్యకారులు వెంటనే తీరానికి తిరిగి రావాలని కోరింది.

## ముగ్గురు ఐపీఎస్‌లను తొలగించండి.. రాష్ట్రపతికి వైసీపీ ఎంపీ గురుమూర్తి లేఖ

**అమరావతి :**

ఆంధ్రప్రదేశ్‌లో ముగ్గురు సీనియర్ ఐపీఎస్ అధికారులను ఎన్నికల విధుల నుంచి తక్షణమే తొలగించాలని కోరుతూ వైసీపీ ఎంపీ గురుమూర్తి రాష్ట్రపతి, భారత ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్ర గవర్నర్, రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి సహా పలువురు ఉన్నతాధికారులకు లేఖ రాశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ అధికారులు పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని ఆయన తన



లేఖలో తీవ్ర ఆరోపణలు చేశారు. డీఐజీ కోయ ప్రవీణ్, అన్నమయ్య ఎస్పీ ధీరజ్ కనుబిల్లి, కడప ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్‌లను ఎన్నికల విధుల నుంచి తప్పించాలని ఎంపీ గురుమూర్తి డిమాండ్ చేశారు. 2019 ఎన్నికల సమయంలోనూ డీఐజీ కోయ ప్రవీణ్‌పై పక్షపాత ఆరోపణలు రావడంతో ఎన్నికల సంఘం ఆయన్ను విధుల నుంచి తొలగించిందని, అలాంటి అధికారిని మళ్లీ నియమించడం నిబంధనలకు విరుద్ధమని గుర్తుచేశారు. స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో పుంగనూరు, పులివెందుల, కమలాపురం, బద్వేల్ వంటి ప్రాంతాల్లో వైసీపీ అభ్యర్థులపై దాడులు జరిగాయని, వారిని అడ్డుకున్నారని గురుమూర్తి ఆరోపించారు. ముఖ్యంగా పుంగనూరులో తమ పార్టీ ఒక్క నామినేషన్ కూడా దాఖలు చేయలేకపోయిందని పేర్కొన్నారు. పోలీసుల పక్షపాత వైఖరి, పర్యవేక్షణ లోపాలపై స్వతంత్ర విచారణ జరిపించాలని, అభ్యర్థులకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించాలని ఆయన తన లేఖలో కోరారు.

# 'అరుణాచల్ ఘర్షణలపై మోదీ మౌనమేంటి కాంగ్రెస్ విమర్శలు

**న్యూ ఢిల్లీ :**అరుణాచల్‌ప్రదేశ్‌లో చైనా సైన్యంతో ఇటీవల జరిగిన ఘర్షణలపై ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వం మౌనం వహిస్తున్నాయని కాంగ్రెస్ విమర్శించింది. చైనాకు ప్రణాళికాబద్ధంగా రాయితీలు ఇస్తున్నారని ఆరోపించింది. ఈ మేరకు కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జ్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ శుక్రవారం ఎక్స్ వేదికగా స్పందించారు. అరుణాచల్‌ప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో గత కొన్ని రోజులుగా చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్‌ఏ), ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) సిబ్బంది మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయని, అవి ఇంకా కొనసాగుతున్నాయని ఐటీబీపీ డైరెక్టర్ జనరల్ శత్రుజీత్ కపూర్ చెప్పినట్లు ఓ మీడియా కథనాన్ని ప్రస్తావించారు. చైనా సైన్యంతో ఇటీవల జరిగిన ఘర్షణల్లో ఐటీబీపీ సిబ్బంది పనితీరును ఆ సంస్థ డీజీ ప్రశంసించడం సరైనదేనని జైరాం రమేశ్? పేర్కొన్నారు. అరుణాచల్‌ప్రదేశ్‌లోని ప్రాంతాలకు చైనా కొత్త పేర్లు పెట్టడం, 60,000 మెగావాట్ల సామర్థ్యంతో భారీ ఆనకట్ట నిర్మించడం వంటి చర్యలు భారత్‌కు ఆందోళన కలిగించే అంశాలని తెలిపారు. ఇవి దేశ పర్యావరణ, జల భద్రతకు ముప్పు కలిగిస్తాయని అభిప్రాయపడ్డారు."స్వయం



ప్రకటిత విశ్వగురువు చైనాకు ప్రణాళికాబద్ధమైన రాయితీలు ఇస్తూనే ఉన్నారు. అరుణాచల్‌ప్రదేశ్‌లో పీఎల్‌ఏతో ఇటీవల జరిగిన ఘర్షణల్లో ఐటీబీపీ పనితీరును డీజీ ప్రశంసించారు. అది సరైనదే. కానీ ఈ అంశంపై ప్రధాని, ఆయన ప్రభుత్వం నుంచి మాత్రం పూర్తి నిశ్శబ్దం నెలకొంది. టాక్సింగ్ ఘర్షణ అనంతరం గత నెలలో అరుణాచల్ ప్రదేశ్‌లోని వాచా, దమాయ్‌లలో కార్ప్స్ కమాండర్ల చర్చలు జరిగాయి. లద్దాఖ్?లో మాదిరిగానే పెట్రోలింగ్ పాయింట్లను మరోసారి కోల్పోయినట్లు స్థానికులు తెలిపారు. చైనా అరుణాచల్ ప్రదేశ్‌లోని మన పట్టణాల పేర్లను మారుస్తూనే ఉంది. అలాగే మన పర్యావరణ, జల భద్రతకు ముప్పు కలిగించే 60,000 మెగావాట్ల ఆనకట్టను నిర్మిస్తోంది."- జైరాం రమేశ్‌వాణిజ్య లోటు పెరుగుదలపై ఆందోళనచైనాతో భారత్ వాణిజ్య లోటు పెరుగుతుండటంపైనా కాంగ్రెస్ నేత ఆందోళన వ్యక్తం చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో 99 బిలియన్ డాలర్లుగా ఉన్న వాణిజ్య లోటు 2025-26 నాటికి రికార్డు స్థాయిలో 112 బిలియన్ డాలర్లకు చేరిందని తెలిపారు. ఈ పరిస్థితి పలు రంగాల్లోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలపై (ఎంఎస్ఎంఈలు) తీవ్ర ప్రభావం చూపుతోందని ఆరోపించారు. 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం కాస్తా 'చైనా నుంచి దిగుమతి'గా మారిపోయిందని జైరామ్ రమేశ్ విమర్శించారు. చైనాతో భారీ వాణిజ్య లోటు దేశ ఆర్థిక భద్రతకు పెద్ద ముప్పుగా మారుతోందని పేర్కొన్నారు. సరిహద్దు భద్రతతో పాటు వాణిజ్య రంగంలోనూ చైనాతో భారత్ ఎదుర్కొంటున్న సవాళ్లను ఆయన తన పోస్టులో ప్రస్తావించారు. 2020 జూన్ 19న భారత సైనికులు 20 మంది అమరులైన ఘటనను జైరాం రమేశ్ గుర్తుచేశారు. ఆ తర్వాత చైనాకు ప్రధాని మోదీ ఇచ్చినట్లు పేర్కొన్న 'క్లీన్ చిట్'కు భారత్ మూల్యం చెల్లిస్తోందని విమర్శించారు. లద్దాఖ్‌లో చైనా చొరబాట్లకు సంబంధించి అప్పట్లో ప్రధాని చేసినట్లు పేర్కొన్న వ్యాఖ్యలను ప్రస్తావించారు. "మన భూభాగంలోకి ఎవరూ ప్రవేశించలేదు. మన పోస్టుల్లో ఏదీ ఇతరుల నియంత్రణలో లేదు" అని ప్రధాని చెప్పినట్లు జైరాం రమేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. లద్దాఖ్‌లో చైనా చొరబాట్లు జరిగిన సమయంలో తనకు అందిన ఆదేశాల గురించి రిటైర్డ్ ఆర్మీ చీఫ్ జనరల్ నరవణె వెల్లడించిన అంశాలను కూడా ప్రస్తావించారు. తనకు "మీకు ఏది సముచితమనిపిస్తుందో అది చేయండి" అనే ఆదేశం మాత్రమే అందిందని నరవణె చెప్పినట్లు పోస్టులో పేర్కొన్నారు.

## ఈఫిల్ టవర్ వివాదంపై బ్రహ్మవిహారి స్వామీజీ వివరణ.. బాప్స్‌పై అపార్థం తొలగిపోతుందా?



**న్యూఢిల్లీ:** పారిస్‌లోని ప్రసిద్ధ ఈఫిల్ టవర్ వద్ద మహిళా ఉద్యోగులను పక్కకు తప్పించారనే వివాదంపై బాప్స్ సంస్థకు చెందిన బ్రహ్మ విహారి స్వామీజీ స్పష్టతనిచ్చారు. ఓ జాతీయ మీడియా సంస్థ నిర్వహించిన వరల్డ్ సమ్మిట్‌లో పాల్గొన్న ఆయన.. ఈ ఘటనకు ప్రధాన కారణం ఈఫిల్ టవర్ నిర్వాహకుల వైపు నుంచి జరిగిన సమాచార లోపమేనని పేర్కొన్నారు. మహిళా ఉద్యోగులను తొలగించాలని తమ సంస్థ ఎలాంటి విజ్ఞప్తి చేయలేదని స్పష్టం చేశారు. 'ఇది ఈఫిల్ టవర్ వైపు నుంచి జరిగిన అపార్థం. నేను వారినీ నిందించడం లేదు' అని స్వామీజీ చెప్పుకొచ్చారు. తన వివరణతో బాప్స్ సంస్థపై ఏర్పడిన అపార్థం తొలగిపోతుందని భావిస్తున్నట్లు బ్రహ్మవిహారి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఏడాది సెప్టెంబర్ 5న బాప్స్‌కు చెందిన సుమారు 100 మంది సభ్యుల బృందం ఈఫిల్ టవర్‌ను సందర్శించింది. వీరిలో పలువురు సాధువులు, సంస్థ ఆధ్యాత్మిక ప్రముఖులు ఉన్నారు. అయితే, ఈ పర్యటన సందర్భంగా మహిళా ఉద్యోగులను కొన్ని ప్రాంతాల నుంచి తప్పించి, వారి స్థానాల్లో పురుష ఉద్యోగులను నియవించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో ఈ ఘటన అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. పలువురు విమర్శలు గుప్పించారు.

## సీఆర్పీఎఫ్‌ను కొట్టిన మహిళా యూట్యూబర్.. కేసు నమోదు చేసిన పోలీసులు



**న్యూఢిల్లీ:** కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఢిల్లీలో లెహ్రా దో తిరంగా నిరసన ప్రదర్శన జరిగిన విషయం తెలిసిందే. పాలికా బజార్ వద్ద జరిగిన నిరసనలో ఓ మహిళా యూట్యూబర్.. పారామిలిటరీ సైనికుడిపై చేయి చేసుకున్నారు. సెంట్రల్ ఢిల్లీలోని రాజీవ్ చౌక్ మెట్రో స్టేషన్ వద్ద ఉన్న గేట్ నెంబర్ 6 దగ్గర ఈ ఘటన జరిగింది. సీఆర్పీఎఫ్ జవాను, అక్కడ ఉన్న గుంపు మధ్య వాగ్వాదం జరిగింది. ఆ సమయంలో ఓ మహిళ జవాన్ చెంపపై కొట్టింది. నిరసన పేరుతో పోలీసులు, పారామిలిటరీ దళాలపై దాడి జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఓ సీఆర్పీఎఫ్ జవాన్‌ను కొట్టిన ఘటనకు చెందిన వీడియోను ఢిల్లీ పోలీసులు రిలీజ్ చేశారు. దాడిలో పాల్గొన్న నిరసనకారులు, యూట్యూబర్లను గుర్తిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు చెప్పారు.

## 'దేశం ముందు వాస్తవాలు పెట్టండి- మోదీకి ఖర్గే మూడు ప్రశ్నలు చైనా పాలసీపై తీవ్ర విమర్శలు

**అరుణాచల్‌ప్రదేశ్:** అరుణాచల్‌ప్రదేశ్‌లో చైనా సైన్యంతో కొనసాగుతున్న ఘర్షణలపై ప్రధాని మోదీ, కేంద్రం మౌనం వహించడంపై కాంగ్రెస్ పార్టీ మండిపడింది. ముఖ్యంగా భారత విదేశాంగ విధానంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్ష్యంగా తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే. చైనాకు ఇప్పటికే చాలా క్లీన్ చిట్‌లు ఇచ్చేశారని, ఇకనైనా ప్రధానమంత్రి మోదీ దేశం ముందుకు వచ్చి అసలు వాస్తవాలు ఏంటో స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎక్స్? వేదికగా ప్రధాని మోదీకి ప్రశ్నలు సంధించారు. అరుణాచల్‌లో చైనా సైన్యంతో ఘర్షణలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయని ఝదీూ-డైరెక్టర్ జనరల్ శతృజీత్ కపూర్ చేసిన వ్యాఖ్యలను ఎక్స్ వేదికగా పంచుకున్నారు."చైనాకు ఇచ్చిన క్లీన్ చిట్‌లు చాలు. ప్రధాని మోదీ భారత్ ముందు



వాస్తవాలు చెప్పాలి! మూడు ప్రశ్నలకు సమాధానాలు కావాలి: 1. జాతీయ భద్రత: అరుణాచల్ ప్రదేశ్‌లో ుూూతో ఘర్షణలు కొనసాగుతున్నాయని ఝదీూ డీజీ ధ్రువీకరించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. డోక్లాం, గల్వాన్ తర్వాత మరో తీవ్రమైన ఘర్షణ చోటుచేసుకుంటోందా? ఆగస్టులో టాక్సింగ్ సమీపంలో చైనా చొరబాట్లపై నివేదికలు వెలువడ్డాయి. అయినప్పటికీ, కేవలం 180 కిలోమీటర్ల దూరంలోనే ఉన్నట్లు చెబుతున్న వాచా-దమాయ్‌లో కార్ప్స్ కమాండర్ స్థాయి చర్చలు జరిగి 47 రోజులు గడిచినా, ఘర్షణలు కొనసాగుతున్నాయి. భారతదేశ గస్తీ మార్గాలకు ఆటంకం కలిగిందా? అరుణాచల్ ప్రదేశ్ భారతదేశంలో విడదీయరాని భాగం. దేశాన్ని ఎందుకు చీకట్లో ఉంచుతున్నారు? 2. ఆర్థిక భద్రత: గల్వాన్‌లో 20 మంది భారత సైన్యపు వీరయోధుల త్యాగం తర్వాత, చైనా దిగుమతులు 102శాతం పెరిగాయి. అదే సమయంలో చైనాతో భారతదేశ వాణిజ్య లోటు 155శాతం పెరిగి 112.16 బిలియన్? డాలర్లకు చేరింది. భారత ఎగుమతులకు చైనా ఆటంకం కలిగిస్తోందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా అంగీకరిస్తున్నారు. అయినా, ప్రభుత్వం చైనా పెట్టుబడులపై ఆంక్షలను సడలిస్తూ, అర్హత కలిగిన చైనా అనుబంధ సంస్థలకు పీఎల్ఐ (ూా×) ప్రయోజనాలను పరిశీలిస్తోంది. 'మేక్ ఇన్ ఇండియా' కాస్తా 'ఇంపోర్ట్? ఫ్రమ్ చైనా'గా మారిందా? 3. దౌత్యపరమైన జవాబుదారీతనం: కనీసం 23 సార్లు మోదీ-జిన్?పింగ్ మధ్య సమావేశాలు, సంభాషణలు జరిగాయి.చైనాకు అప్పగిస్తూనే ఉన్నారు. మీరు తొలగించిన ప్రయాణ ఆంక్షలైనా, 99 బిలియన్ డాలర్ల నుంచి 112 బిలియన్ డాలర్లకు పెరిగిన వాణిజ్య లోటు అయినా, పరిమితం చేసిన వీసాలు అయినా, ఇక్కడికి వచ్చే చైనా కార్మికులకు, చైనా అధికారులకు మీరు అకస్మాత్తుగా మళ్లీ వీసాలను పెంచుతున్నారు. దీనివల్ల భారతదేశానికి ఏమి జరుగుతుంది? ఈ లొంగిపోవడం వల్ల మనం సాధించింది ఏమిటి?" అని ఖేడా ప్రశ్నించారు.

## 'భారత్ లక్ష్యంగా చేసుకున్నది కాదు' అమెరికా వర్క్ వీసా రూల్స్‌పై రూబియో

**అమెరికా :**అమెరికా వర్క్ వీసా నిబంధనల్లో ఇటీవలి తీసుకువచ్చిన మార్పులపై ఆ దేశ విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కొత్త నిబంధనలు భారత్? వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయం కాదని తెలిపారు. అమెరికా జాతీయ ప్రయోజనాలకు, ముఖ్యంగా కార్మికులకు ప్రాధాన్యం ఇస్తోందని రూబియో స్పష్టం చేశారు. భారత్?లో పర్యటించిన ఆయన జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ మేరకు వ్యాఖ్యానించారు. ఈ నిబంధనలపై భారతదేశంలో నెలకొన్న ఆందోళనలను తగ్గించే విధంగా మాట్లాడారు. "ఇది భారతదేశాన్ని దృష్టిలో పెట్టుకుని తీసుకున్న నిర్ణయం కాదు. ఇది కేవలం భారతదేశంపై లక్ష్యంగా చేసుకున్నది కాదు. అమెరికాకు వచ్చి పనిచేయాలనుకునే భారతీయులపై, అలాగే మా వ్యాపార సంస్థలు నెలకొల్పాలని చూస్తున్న వారిపై ఇది ప్రభావం చూపుతుంది. కానీ ఇది భారతదేశాన్ని లక్ష్యంగా చేసుకున్నది కాదు, ఇది ప్రపంచవ్యాప్తమైనది. అమెరికాలో వలస విధానం లోపభూయిష్టంగా ఉంది. మా వ్యాపార సంబంధిత వలస కార్యక్రమాలు చాలా సందర్భాల్లో విపరీతమైన మోసాలకు, దుర్వినియోగానికి గురయ్యాయి. వాటిని అర్థరహితంగా దుర్వినియోగం చేశారు. కాబట్టి ఈ విషయాలను పరిష్కరించాలి. అందుకే మేము వాటిని పరిష్కరించడానికి ప్రయత్నిస్తున్నాం. కానీ అవి భారతదేశాన్ని ఉద్దేశించినవి కావు. అవి ప్రపంచంలోని ఒక్క దేశానికే పరిమితం కాకుండా ప్రతి దేశానికైనా వర్తిస్తాయి."--- మార్కో రూబియో, అమెరికా విదేశాంగ మంత్రిఈ చర్యలన్నీ కేవలం అమెరికన్ కార్మికులను రక్షించడం, వారి ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వడానికే ఉద్దేశించినవని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో అన్నారు. "భారత ప్రభుత్వం ఎల్లప్పుడూ భారత ప్రజలకు, ఆ దేశ జాతీయ ప్రయోజనాలకు మొదటి ప్రాధాన్యం ఇస్తుందని నేను ఆశిస్తున్నాను. అలాగే అధ్యక్షుడు ట్రంప్ నేతృత్వంలోని యునైటెడ్ స్టేట్స్ మన ప్రజలకు, మన కార్మికులకు, మన దేశానికి మొదటి ప్రాధాన్యం ఇవ్వబోతోందని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకుంటారని కూడా నేను ఆశిస్తున్నాను." అని రూబియో తెలిపారు.




అంతకుముందు ఎనిమిది ప్రపంచ టెక్ దిగ్గజ సంస్థలకు శాశ్వత కార్మిక సర్టిఫికేషన్‌ను సస్పెండ్ చేస్తూ అమెరికా భారీ షాక్ ఇచ్చింది. ఇందులో మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్, టాటా, విప్రో, క్యాప్‌జెమినీ, హెచ్‌సీఎల్, కాగ్నిజెంట్, అడోబ్ సంస్థలు ఉన్నాయి. అదే సమయంలో అమెరికా టెక్ దిగ్గజాలైన మైక్రోసాఫ్ట్, అడోబ్‌లను కూడా ఈ కార్యక్రమం నుంచి సస్పెండ్ చేసింది. దీంతో ఆయా సంస్థల తరఫున హెచ్-1బీ వీసాపై అమెరికా వచ్చే ఉద్యోగులు గ్రీన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవడం కుదరదు. హెచ్-1బీ వీసా కార్యక్రమం దుర్వినియోగం నేపథ్యంలోనే ఈ చర్యలు తీసుకున్నట్లు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వెల్లడించారు. ఈ కంపెనీలకు సంబంధించి కొత్త వాటితో పాటు, పెండింగ్‌లో ఉన్న లేబర్ సర్టిఫికేషన్‌లను ఇకపై పరిశీలించమని కార్మికశాఖ మంత్రి కీత్ సాండర్లింగ్ ఆదేశించారు. 2009 నుంచి ఈ కంపెనీలు భారీగా శాశ్వత లేబర్ సర్టిఫికేషన్‌లను పొందాయని, అమెరికాకు చెందాల్సిన లక్షలాది ఉద్యోగాలను లాక్కున్నాయని ఆరోపించారు.

## బలూచిస్థాన్‌లో ఉద్రిక్తత 20 మంది పోలీసుల కిడ్నాప్

**పాకిస్థాన్:** పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో మరోసారి తీవ్ర ఉద్రిక్త పరిసితులు నెలకొన్నాయి. బలోచ్ వేరాటువాదు లుగా అనుమానిస్తున్న కొందరు సాయుధులు, శిక్షణలో ఉన్న 20 మంది పోలీసు సిబ్బందిని అపహరించారు. శుక్రవారం సాయంత్రం మస్తుంగ్ జిల్లాలోని గోర్గినా ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కలాత్ రిక్రూట్ ట్రైనింగ్ సెంటర్ నుంచి సెలవుపై తమ స్వగ్రామాలకు వెళుతున్న పోలీస్ రిక్రూట్‌లు ప్రయాణిస్తున్న వ్యాన్‌ను సాయుధులు అడ్డగించి, వారిని కిడ్నాప్ చేశారు. ఈ ఘటనతో అప్రమత్తమైన పాకిస్థాన్ భద్రతా బలగాలు, అపహరణకు గురైన పోలీసుల ఆచూకీ కోసం భారీ గాలింపు చర్యలు చేపట్టాయి.



మస్తుంగ్ జిల్లా వ్యాప్తంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి భద్రతను కట్టుదిట్టం చేశాయి. ఇదే క్రమంలో, టర్బత్ సమీపంలో కొన్ని సరుకు రవాణా ట్రక్కులకు కూడా బలోచ్ వేర్పాటువాదులు నిప్పుపెట్టినట్లు సమాచారం. ఈ ఘటనలపై దర్యాప్తు కొనసాగుతోంది.

## 'ఫుట్‌పాత్ ఏర్పాటు చేయకపోతే ధర్నాకు దిగుతాం'.. సుప్రీంకోర్టు హెచ్చరిక

**ఢిల్లీ :**అధికార యంత్రాంగంపై సుప్రీం కోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హైకోర్టు వద్ద పాదచారుల కోసం ఫుట్‌పాత్, రోడ్డు దాటేందుకు క్రాసింగ్ లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. త్వరలోనే ఆ సదుపాయాలు కల్పించాలని ఆదేశించింది. తదుపరి విచారణలోగా ఏర్పాటుచేయకపోతే.. తామే అక్కడ స్వయంగా ధర్నాకు దిగుతామని న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్థివాలా, జస్టిస్ కేవీ వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం




హెచ్చరించింది. పనులు పూర్తయ్యేదాకా అక్కడి నుంచి కదిలేదే లేదని వ్యాఖ్యానించింది. అవసరమైతే ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కూడా కోర్టుకు పిలిపిస్తామని స్పష్టం చేసింది. సురక్షితమైన ఫుట్‌పాత్‌లు పౌరుల ప్రాథమిక హక్కుల్లో భాగమని న్యాయస్థానం తెలిపింది. ఇవి రాజ్యాంగంలోని ఆర్టికల్ 21(జీవించే హక్కు), 19(1)(డీ) (స్వేచ్ఛగా తిరిగే హక్కు)కు సంబంధించిన అంశాలని వివరించింది. పాదచారుల హక్కులే తొలి ప్రాధాన్యమన్న ధర్మాసనం.. వాహన రాకపోకల కంటే వాటికే పెద్దపీట వేయాలని పేర్కొంది.

## మెటా కళ్లద్దాలతో నాపై స్టింగ్ ఆపరేషన్‌కు యత్నం

**కర్ణాటక :** కర్ణాటక సీఎం డీకే శివకుమార్ తాజాగా సంచలన ఆరోపణలు చేశారు. తనపై స్టింగ్ ఆపరేషన్‌కు ప్రయత్నం జరిగిందని చెప్పారు. తనతో పాటు కేరళ సీఎం వీడీ సతీశన్‌ను కూడా టార్గెట్ చేశారని ఆరోపించారు. స్థానిక మీడియాకు తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో సీఎం ఈ ఆరోపణలు గుప్పించారు.మెటా స్మార్ట్ కళ్లద్దాలు ధరించిన ఓ వ్యాపారవేత్త తనను కలిసేందుకు రావడంతో అనుమానం కలిగిందని కర్ణాటక సీఎం చెప్పారు. దీంతో, ఆ వ్యాపారవేత్త ఇంకా ఏయే రాజకీయ నాయకుల్ని కలిశారో తెలుసుకునేందుకు ప్రయత్నించానని అన్నారు. కాంగ్రెస్ నేతలే టార్గెట్‌గా భారీ స్టింగ్ ఆపరేషన్‌కు ప్రణాళికలు రెడీ అయ్యాయని ఆరోపించారు. అందులో భాగంగానే తనను టార్గెట్ చేశారని చెప్పారు.అధికారుల ద్వారా అపాయింట్‌మెంట్ తీసుకుని ఓ పారిశ్రామికవేత్త తనను కలిసేందుకు వచ్చారని సీఎం డీకే శివకుమార్ చెప్పారు. తొలుత వ్యాపార వ్యవహారాలు మాట్లాడాక విషయం రాజకీయాలవైపు




మళ్లిందని అన్నారు. రాజకీయ పరిణామాలు, బూత్ స్థాయి వ్యూహాల గురించి ఆ పారిశ్రామికవేత్త మాట్లాడటం ప్రారంభించారని చెప్పారు. చర్చ సడెన్‌గా రాజకీయాల వైపు మళ్లడంతో పాటు ఆ వ్యక్తి పెట్టుకున్న కళ్లద్దాలను చూశాక తనకు అనుమానం కలిగిందని అన్నారు.వ్యాపారవేత్త బ్యాక్‌గ్రౌండ్ ఏంటో కనుక్కోవాలని అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. ఆ వ్యాపారవేత్త స్మార్ట్ గ్లాసెస్ పెట్టుకున్నట్టు తనకు ఆ తరువాత సమాచారం వచ్చిందని తెలిపారు. కేరళ సీఎం వీడీ సతీశన్‌తో సమావేశం సందర్భంగా కూడా ఆ వ్యక్తి మెటా గ్లాసెస్ ధరించినట్టు తెలిసిందని అన్నారు. ఇతర రాష్ట్రాల సీఎంలతో సమావేశం సందర్భంగా మాత్రం ఆయన ఇలాంటి కళ్లద్దాలు పెట్టుకోనట్టు తన దృష్టికి వచ్చిందని చెప్పారు. ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని కేబినెట్ సహచరులకు సూచించానని అన్నారు.స్టింగ్ ఆపరేషన్‌కు ప్రయత్నించిన వారిపై చర్యలు ఎందుకు తీసుకోలేదన్న ప్రశ్నకు ఆయన బదులిస్తూ ఈ వ్యవహారంలో పోలీసులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. విషయాలను గోప్యం ఉంచుతున్నారని వెల్లడించారు. 'చర్యలు తీసుకోవట్లేదని మీకు ఎవరు చెప్పారు? మీకు తెలీదు అంతే.. మేము ఈ విషయాలను బయటకు చెప్పట్లేదు' అని సీఎం డీకే శివకుమార్ అన్నారు.ప్రస్తుతం కాంగ్రెస్, ప్రతిపక్ష పార్టీలు పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నాయి. స్థానిక మీడియాకు తాజాగా ఇంటర్వ్యూలో సీఎం ఈ ఆరోపణలు గుప్పించారు.

# సంపాదకీయం

## నిరసన హక్కు.. నీకేదీ దిక్కు?



ప్రజాస్వామ్యానికి భారత్ పుట్టినిల్లు అని ప్రధాని నరేంద్ర మోడీ ప్రపంచ దేశాలకు పదేపదే చాటి చెబుతుంటారు. కానీ నేడు దేశంలో జరుగుతున్న నిరసనలు, ఉద్యమాలను ప్రభుత్వం ఎంతగా అణచివేస్తోందో పరిశీలిస్తే ఆయన మాటలకు, చేతలకు పొంతన ఎక్కడా కనిపించదు. మొలకు రొయ్యల తాడు కట్టుకున్న పిల్లి శాంతి మంత్రం జపించిందన్న సామెత గుర్తుకు రాకమానదు. ఎన్నో ఉద్యమాలు సాగిస్తేనే కానీ మన దేశానికి బ్రిటిష్ వారి నుంచి స్వాతంత్ర్యం సిద్ధించలేదు. స్వాతంత్ర్య సమరంలో మహాత్మా గాంధీ చేపట్టిన దండియాత్ర ప్రపంచం లోని ఇతర పౌరహక్కుల ఉద్యమాలకు స్ఫూర్తిదాయకమైంది. స్వాతంత్ర్యం కోసం శాసనోల్లంఘన ఉద్యమం వివిధ దశల్లో అనేకసార్లు కొనసాగింది. ఈ ఉద్యమం ప్రపంచ వ్యాప్తంగా ప్రజల ఊహాశక్తిని ఎంతగానో ఆకర్షించింది. 1952లో దక్షిణాఫ్రికాలో జరిగిన శాసన ధిక్కార ఉద్యమంలో నల్లజాతీయులు వర్ణవివక్షకు సంబంధించిన చట్టాలను ఉల్లంఘించారు. 1960లో అమెరికాలో నల్లజాతీయులు చేపట్టిన పౌరహక్కుల ఉద్యమం లో భాగంగా శాసనోల్లంఘన చేపట్టి విజయం సాధించారు. ఆదర్శనీయమైన మన దేశ అహింసాయుత ఉద్యమ వారసత్వానికి ఇప్పుడు మోడీ ప్రభుత్వం పాతర వేస్తోంది. ఇప్పుడు దేశంలో చిన్నచిన్న నిబంధనలను ఉల్లంఘించిన వ్యక్తులను రోజుల తరబడి జైళ్లలో నిర్బంధించడం పరిపాటి అవుతున్నప్పుడు ప్రజాస్వామ్యానికి అర్థమేమైనా ఉందా? చట్టాల్లోని నిబంధనలను దుర్వినియోగం చేస్తూ ఇష్టారాజ్యంగా నిరసనకారులపై అక్రమంగా కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేయడం ప్రజాస్వామ్య సంప్రదాయమా? భారత్ లోని నిరసనలు ఐక్యరాజ్యసమితి దృష్టికి వెళ్లినా భారత ప్రతినిధి దానిని ఖండించారే తప్ప వాస్తవాలను అంగీకరించలేదు. దేశ రాజధాని లోని నిరసన ప్రదర్శనలకు కేటాయించిన ప్రదేశాల జాబితా నుంచి జంతర్ మంతర్‌ను ప్రభుత్వం తొలగించడం నిజమే. అయితే కాక్రోచ్ జనతా పార్టీ నాయకులు అశుతోష్ రంకా, సౌరవ్ దాస్‌లు జంతర్ మంతర్ లోకి ప్రవేశించి, నిరసనలో భాగంగా జాతీయ జెండాను ప్రదర్శించినందుకు వారిని ఎనిమిది రోజులపాటు కటకటాల వెనక్కి పంపడం దేశ ప్రజాస్వామ్య ప్రతిష్టను దిగజార్చడమే. అమెరికాలో పౌర అవిధేయత ఉద్యమానికి నాయకత్వం వహించిన మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ "న్యాయం కోసం పోరాడే సమయంలో ఎదురయ్యే కష్టాలు, బాధలు వృథా కావు. అవి సమాజంలో మార్పుకు మార్గం చూపిస్తాయి" అని అందించిన సందేశం ఇప్పటి కాక్రోచ్ జనతా పార్టీ నేతలకు ఊపిరిపోస్తుంది. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు, శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు, స్వేచ్ఛగా ఓటు వేసే హక్కు కీలకమైనవి. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర పరిశీలన పేరుతో ఎన్నికల ప్రధానాధికారి జ్ఞానేశ్ కుమార్ సాగించిన అవకతవకలపై కాక్రోచ్ జనతా పార్టీ ఢిల్లీలో చేపట్టిన నిరసనలు మోడీ ప్రభుత్వానికి భయాందోళనలు రేకెత్తిస్తున్నాయి. అక్టోబర్ 1011 తేదీల్లో సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, ఇతర ఉద్యమకారులు, ప్రతిపక్ష నాయకులు, భారీ ఎత్తున నిరసనలు చేపట్టగా వారిని అరెస్టు చేశారు. జంతర్ మంతర్‌కు వారు వెళ్లకుండా రోడ్లపై బారికేడ్లు, రైళ్ల రవాణాపై ఆంక్షలు, మొబైల్ ఇంటర్నెట్ సర్వీసులు నిలుపుదల చేశారు. అక్టోబర్ 17న అభిజీత్ దీప్కేను కోర్టు విడుదల చేసింది. శాంతిభద్రతలను కాపాడడం పోలీసుల విద్యుక్త ధర్మమే అయినప్పటికీ, నిరసనకారుల అరెస్టులు లేదా నిర్బంధం అవసరమా, చట్టబద్ధమా, తగిన కారణాలు ఉన్నాయా అనే అంశాలను కూడా పోలీసులు పరిశీలించాలి. చట్టపరమైన ఆధారం లేకుండా వ్యక్తులను నిర్బంధిస్తే వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగినట్టే. రాజ్యాంగం లోని ఆర్టికల్ 21 జీవితాన్ని, వ్యక్తిగత స్వేచ్ఛను రక్షిస్తుంది. ఆర్టికల్ 22 అరెస్టు, నిర్బంధానికి సంబంధించిన కొన్ని రక్షణలను కల్పిస్తుంది. మరి మోడీ ప్రభుత్వం నిరసనకారులకు ఎంతవరకు రక్షణ కల్పిస్తుందో తెలిసిందే. అక్టోబర్ నిరసనల సందర్భంగా పాత్రికేయుల నిర్బంధం, పరికరాల స్వాధీనం, రిపోర్టింగ్‌కు ఆటంకాలపై తీవ్ర ఆరోపణలు వచ్చినట్టు ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ వెల్లడించింది. దీన్ని బట్టి దేశంలో పాత్రికేయులను కూడా కేంద్ర ప్రభుత్వం టార్గెట్ చేసుకుంటోంది. నిరసనలే కాదు ప్రభుత్వ పాలనపై వ్యంగ్య ధోరణిలో విమర్శించే కార్టూన్లపై కూడా పగపట్టింది. ఈ ఏడాది సెప్టెంబర్ 28 నుంచి ఒక వారం రోజుల పాటు, ఆ తర్వాత అక్టోబర్ 20న (మంగళవారం) కేంద్ర ప్రభుత్వం తన కార్టూన్లకు సంబంధించిన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను బ్లాక్ చేసిందని ప్రముఖ కార్టూనిస్టు సతీస్ ఆచార్యం వెల్లడించారు. రాజకీయ కార్టూన్లను చూసి కేంద్ర ప్రభుత్వం భయపడుతోందని, ఆ భయపడడం మానేసేంత వరకు ఈ కార్టూన్ల ప్రదర్శన కొనసాగుతుందని సతీష్ ఆచార్య నిర్భయంగా ప్రకటించారు. ప్రభుత్వానికి అభ్యంతరం కలిగిస్తున్న కంటెంట్‌ను తొలగించాలని ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్ తదితర సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లకు మార్చి నుంచి జులై మధ్య కాలంలో దాదాపు 2 లక్షల ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేయడం గమనార్హం. అంటే దాదాపు ప్రతి రోజూ 1275 ఉత్తర్వులు ప్రభుత్వం నుంచి జారీ అవుతున్నాయని తెలుసుకోవచ్చు. ఇన్‌స్టాగ్రామ్‌కు అత్యధికంగా దాదాపు 1 లక్ష బ్లాకింగ్ ఉత్వర్వులు అందగా, ఫేస్‌బుక్‌కు 80,000, యూట్యూబ్‌కు దాదాపు 15,000 ఆదేశాలు వచ్చాయి. ఏదేమైనా కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ ధోరణి నాటి వలస పాలకుల దురహంకారాన్ని ప్రతిబింబిస్తోంది. సిజెపి నేతల నిరసనలను అడ్డుకోవడానికి అరెస్టులు సాగించడం దేశ ఉద్యమాల వారసత్వానికి విఘాతం కలిగించడమే.

## గూడూరులో అకస్మాత్తుగా బైక్‌లో మంటలు



కర్నూలు జిల్లా : గూడూరు పట్టణంలో రోడ్డుపై వెళ్తున్న ఓ బైక్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగి వాహనం పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనతో స్థానికంగా కలకలం రేగింది. పెద్దమారిడు గ్రామానికి చెందిన రఫీ తన స్నేహితుడితో కలిసి కర్నూలు ఆసుపత్రికి బయలుదేరాడు. మార్గమధ్యలో గూడూరులోని ఓ పెట్రోల్ బంక్‌లో ఇంధనం నింపుకుని ముందుకు సాగుతుండగా, బైక్ నుంచి పొగలు రావడాన్ని గమనించాడు. అప్రమత్తమైన రఫీ వెంటనే వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపివేశాడు. అయితే, కొద్దిసేపటికే బైక్‌కు మంటలు వ్యాపించడంతో చూస్తుండగానే వాహనం పూర్తిగా కాలిపోయింది.

# జలసంరక్షణ.. జన ఉద్యమం కావాలి!

నీటిబొట్టును నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు ఎడారే.. ప్రజల బాధ్యతతో పాటు ప్రభుత్వాల చిత్తశుద్ధి అవసరం! ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పు లు తీవ్ర సవాళ్లను విసురుతున్నాయి. ఇందులో ప్రధానంగా భారత్ లాంటి వ్యవసాయ ఆధారిత దేశాలను వణికిస్తున్న అతిపెద్ద సమస్య 'ఎల్‌నినో'. పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల జలాలు అసాధారణంగా వేడెక్కడం వల్ల ఏర్పడే ఈ పరిస్థితి.. మన దేశంలో రుతుపవనాల గమనాన్ని దెబ్బతీసి, తీవ్ర కరవు పరిస్థితులకు, అకాల వర్షాలకు కారణమవుతోంది. దీనివల్ల తాగునీటి ఎద్దడి, సాగునీటి కొరత, ఆహార సంక్షోభం, ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉంది. ఈ విపత్తును ఎదుర్కోవడానికి కేవలం ప్రభుత్వంపైనే భారం వేయకుండా.. ప్రభుత్వ యంత్రాంగం, సామాన్య ప్రజలు సంయుక్తంగా బాధ్యత వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఒకవైపు ఆకాశం నుంచి కురిసిన వర్షపు నీరు వృథాగా సముద్రంలో కలుస్తోంది.. మరోవైపు గొంతు తడుపుకునేందుకు గుక్కెడు నీటి కోసం ప్రజలు ఎదురుచూడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఒకప్పుడు నీటితో కళకళలాడిన చెరువులు నేడు కబ్జాలకు గురవుతున్నాయి. భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. బోర్లు ఎండిపోతున్నాయి. అయినా మన నీటి వినియోగపు అలవాట్లలో ఆశించిన మార్పు రావడం లేదు. ఈ పరిస్థితి ప్రకృతి వైపరీత్యం మాత్రమే కాదు.. మన నిర్లక్ష్యానికి కూడా అద్దం పడుతోంది. నీటి సంక్షోభం ముంచుకొచ్చిన తర్వాత పరిష్కారాల కోసం పరుగులు తీయడం కంటే, నీటి కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడమే నిజమైన అభివృద్ధి. తగ్గుతున్న జలవనరులు.. పెరుగుతున్న ముప్పు జలం లేనిదే జీవం లేదు. వ్యవసాయం, పరిశ్రమలు, ప్రజారోగ్యం, పర్యావరణం.. ఇలా ప్రతి రంగానికీ నీరే ఆధారం. కానీ పెరుగుతున్న జనాభా, పట్టణీకరణ, భూగర్భజలాల అధిక వినియోగం, చెరువులు కుంటల ఆక్రమణలు, వర్షపు నీటి సంరక్షణలో నిర్లక్ష్యం జలవనరులపై తీవ్ర ఒత్తిడిని పెంచుతున్నాయి. పట్టణాల్లో కాంక్రీటు నిర్మాణాలు విస్తరించడంతో వర్షపు నీరు భూమిలోకి ఇంకే అవకాశాలు తగ్గుతున్నాయి. గ్రామాల్లో సంప్రదాయ జలవనరుల నిర్వహణ బలహీనపడుతున్న ప్రాంతాల్లోనూ నీటి లభ్యత సమస్యగా మారుతోంది. వర్షాలు పడినప్పుడు నీటిని నిల్వ చేసుకోలేకపోవడం, ఎండాకాలంలో నీటి కోసం ఇబ్బందులు పడటం మన జల నిర్వహణలోని లోపాలను స్పష్టం చేస్తున్నాయి. భూమిలోకి చేరుతున్న నీటికంటే బోర్లద్వారా తోడుతున్న నీరు ఎక్కువైతే భూగర్భజలాల మట్టం తగ్గిపోవడం తప్పదు. దీని ప్రభావం తాగునీటి సరఫరాపైనే కాకుండా వ్యవసాయ ఉత్పత్తి, రైతుల ఆదాయం, కుటుంబాల ఆర్థిక పరిస్థితిపైనా పడుతుంది. ప్రతి ఇంటి నుంచే మార్పు



మొదలవ్వాలి. నీటి సమస్యను ప్రభుత్వం మాత్రమే పరిష్కరించలేదని, ప్రజలు మాత్రమే పరిష్కరించలేరని గుర్తించాలి. ఇరువురి భాగస్వామ్యం తప్పనిసరి. వర్షాకాలంలో ఇంటి పైకప్పుపై పడే వర్షపు నీటిని సేకరించి భూమిలోకి ఇంకేలా చేయడానికి ఇంకుడు గుంతలు, వర్షపు నీటి సేకరణ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలి. నీటి సంరక్షణ అంటే నీటిని తక్కువగా వినియోగించడం మాత్రమే కాదు.. వర్షపు నీటిని ఒడిసిపట్టడం, భూగర్భజలాలను పెంచడం, అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా ఉపయోగించడం కూడా. ప్రభుత్వాల బాధ్యత మరింత కీలకం. జలసంరక్షణలో ప్రభుత్వాలు మాటలకే పరిమితం కాకుండా ఫలితాలు కనిపించే చర్యలు చేపట్టాలి. ముందుగా గ్రామాలు, పట్టణాల్లోని చెరువులు, కుంటలు, కాలువలు, ఇతర సహజ జలవనరులపై సమగ్ర సర్వే నిర్వహించాలి. ఆక్రమణలను చట్టబద్ధమైన ప్రక్రియ ద్వారా తొలగించి, నీరు చేరే మార్గాలను పునరుద్ధరించాలి. అవసరమైన చోట పూడికతీత చేపట్టి, చెరువుల నిల్వ సామర్థ్యాన్ని పెంచాలి.

వర్షపు నీరు సహజంగా ప్రవహించే మార్గాలు మూసుకుపోకుండా చర్యలు తీసుకోవాలి. కొత్త భవనాల్లో వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలు నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు అయ్యేలా చూడాలి. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాల్లో ఈ వ్యవస్థల నిర్వహణను పర్యవేక్షించాలి. ఇంకుడు గుంతలు నిర్మించడం వరకే కాకుండా అవి సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అన్నది కూడా పరిశీలించాలి. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు తమ పరిధిలోని నీటి లభ్యత, వినియోగం, వృథా, భూగర్భజలాల పరిస్థితిని అంచనా వేసి స్థానిక జల ప్రణాళికలు రూపొందించాలి. తాగునీటి పైపుల లీకేజీలను త్వరగా సరిచేయాలి. నీటి సరఫరాలో జరిగే నష్టాలను తగ్గించాలి. నీటి నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షించి ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించాలి. వ్యవసాయ రంగంలో నీటి వినియోగాన్ని మెరుగుపరచడం అత్యవసరం. రైతులకు బిందు సేద్యం, తుంపర సేద్యం వంటి సూక్ష్మ సేద్య పద్ధతులపై అవగాహన కల్పించాలి. నేల స్వభావం, వర్షపాతం, నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా శాస్త్రీయ సలహాలు అందించాలి. అవసరానికి మించి నీటిని పెట్టకుండా పంట అవసరాన్ని బట్టి సాగునీటిని అందించే పద్ధతులను ప్రోత్సహించాలి. చెరువులు, కుంటలు, చిన్న నీటి నిల్వ కేంద్రాలను పునరుద్ధరించి వర్షపు నీటిని వ్యవసాయానికి ఉపయోగపడేలా చేయాలి. రైతులకు సాంకేతిక సహాయం, శిక్షణ, సూక్ష్మ సేద్య పరికరాలకు తగిన ప్రోత్సాహకాలు అందించాలి. మురుగునీటిని శుద్ధి చేసి, తాగునీరు అవసరం లేని పారిశ్రామిక, ఇతర పనులకు ఉపయోగించే వ్యవస్థలను పట్టణాల్లో బలోపేతం చేయాలి. జలసంరక్షణకు జవాబుదారీతనం అవసరం ప్రభుత్వాలు పథకాలు ప్రకటించడం, నిధులు కేటాయించడం మాత్రమే సరిపోదు. వాటి అమలును నిరంతరం పర్యవేక్షించాలి. స్థానిక ప్రజలు, రైతు సంఘాలు, స్వచ్ఛంద సంస్థలను పర్యవేక్షణలో భాగస్వాములను చేయాలి. ఈ రోజు మనం కాపాడే ప్రతి నీటి బొట్టు రేపటి తరాల జీవనానికి భరోసా కావాలి. నీటి కోసం భవిష్యత్తులో యుద్ధాలు చేయాల్సిన పరిస్థితి రాకుండా ఉండాలంటే, ఈ రోజే జలసంరక్షణకు నడుం బిగించాలి. ప్రభుత్వాలు బాధ్యతతో ముందడుగు వేయాలి.. ప్రజలు భాగస్వాములు కావాలి.. జలసంరక్షణ ప్రతి ఇంటి సంకల్పంగా, ప్రతి గ్రామం లక్ష్యంగా, ప్రతి ప్రభుత్వ వ్యవస్థ కర్తవ్యంగా మారాలి. నీటిని కాపాడుకుందాం.. భవిష్యత్తును నిలబెట్టుకుందాం!

# జెన్ జీ ప్రభంజనం!

ప్రపంచ రాజకీయాల్లో కొత్త తరం తన ఉనికిని బలంగా చాటుకుంటోంది. దశాబ్దాలుగా అధికారాన్ని తమ గుప్పిట్లో ఉంచుకున్న రాజకీయ నాయకత్వాలకు, ప్రజల ఆకాంక్షలను నిర్లక్ష్యం చేసే పాలనా వ్యవస్థలకు యువత నుంచి సవాళ్లు ఎదురవుతున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలతోనో, ఆకర్షణీయమైన నినాదాలతోనో యువతను మెప్పించడం ఇక అంత సులభం కాదు. అవినీతి, నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు, అవకాశాల కొరత, భావప్రకటనా స్వేచ్ఛపై ఆంక్షలు వంటి అంశాలపై యువత ప్రశ్నిస్తోంది. ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేని పాలకులపై నిరసన గళం వినిపిస్తోంది. నేపాల్ నుంచి ఫ్రాన్స్ వరకు వివిధ దేశాల్లో కనిపిస్తున్న యువత అసంతృప్తి సంప్రదాయ రాజకీయ వ్యవస్థలు తమ పనితీరును పునఃపరిశీలించుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తోంది. సాధారణంగా 1997 నుంచి 2012 మధ్య జన్మించిన వారిని జెన్ జీ తరానికి చెందినవారిగా పరిగణిస్తారు. ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్లు, సామాజిక మాధ్యమాల మధ్య పెరిగిన ఈ తరానికి ప్రపంచ పరిణామాలపై సమాచారం వేగంగా అందుతోంది. పాలకుల ప్రకటనలకు, క్షేత్రస్థాయిలో కనిపించే వాస్తవాలకు మధ్య ఉన్న వ్యత్యాసాలను గుర్తించి ప్రశ్నించే ధోరణి పెరుగుతోంది. రాజకీయ నాయకుల హామీలను గుడ్డిగా నమ్మడం కంటే, వాటి అమలు తీరును పరిశీలించే స్వభావం బలపడుతోంది. అయితే జెన్ జీ యువత అంతా ఒకే విధంగా ఆలోచిస్తుందని భావించడం సరికాదు. దేశం, ప్రాంతం, సామాజిక నేపథ్యం, ఆర్థిక పరిస్థితులను బట్టి వారి అభిప్రాయాలు మారుతాయి. అయినప్పటికీ పారదర్శక పాలన, సమాన అవకాశాలు, అవినీతిపై చర్యలు, ప్రభుత్వాల జవాబుదారీతనం కోసం యువత చేస్తున్న డిమాండ్లలో అనేక సామాన్యతలు కనిపిస్తున్నాయి. 2025 సెప్టెంబరులో నేపాల్‌లో చోటుచేసుకున్న యువజన నిరసనలు ఈ మార్పుకు ముఖ్యమైన ఉదాహరణగా నిలిచాయి. సామాజిక మాధ్యమాలపై ప్రభుత్వ ఆంక్షలు నిరసనలకు తక్షణ కారణమైనప్పటికీ, యువతలో పేరుకుపోయిన అసంతృప్తి అంతకంటే లోతైనది. రాజకీయ అవినీతి, అధికార వర్గాల ప్రత్యేక హక్కులు, నిరుద్యోగం, ఆర్థిక అవకాశాల కొరత, రాజకీయ నాయకత్వంపై తగ్గుతున్న విశ్వాసం వంటి అంశాలు చాలాకాలంగా ప్రజల్లో ఆగ్రహాన్ని పెంచుతున్నాయి. రాజకీయ ప్రముఖుల కుటుంబాలకు చెందినవారు విలాసవంతమైన జీవితాలు గడుపుతుండగా, సాధారణ యువత ఉపాధి కోసం విదేశాలకు వెళ్లాల్సి వస్తోందనే భావన కూడా అసంతృప్తిని తీవ్రతరం చేసింది. సామాజిక మాధ్యమాలపై ఆంక్షలు ఈ ఆగ్రహానికి తక్షణ ప్రేరణగా మారాయి. నేపాల్‌లో నిరసనలు హింసాత్మక మలుపు తిరగడం, ప్రాణనష్టం సంభవించడం, రాజకీయ సంక్షోభం తీవ్రమవడం ఆ దేశ చరిత్రలో కీలక పరిణామాలుగా నిలిచాయి. నిరసనల ఒత్తిడితో అప్పటి ప్రధాని కె.పి. శర్మ ఓలి రాజీనామా చేయడం, సుశీలా కార్కీ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడటం రాజకీయ వ్యవస్థపై ప్రజల ఒత్తిడి ఎంత ప్రభావవంతంగా మారగలదో తెలియజేశాయి. ఫ్రాన్స్‌లో కనిపిస్తున్న యువత అసంతృప్తిని కూడా ఇదే విస్తృత రాజకీయ నేపథ్యంలో పరిశీలించాలి. అయితే నేపాల్, ఫ్రాన్స్‌ల రాజకీయ వ్యవస్థలు, నిరసనలకు దారితీసిన కారణాలు భిన్నమైనవి. ఫ్రాన్స్‌లో జీవన వ్యయం, ఉద్యోగ భద్రత, విద్య, ప్రభుత్వ విధానాలు, ప్రజాసేవల నాణ్యత వంటి అంశాలపై వివిధ వర్గాల నుంచి నిరసనలు వ్యక్తమవుతున్నాయి. యువత తమ భవిష్యత్తును ప్రభావితం చేసే నిర్ణయాలపై ప్రభుత్వాలను ప్రశ్నిస్తోంది. ఆర్థికాభివృద్ధి సాధించిన దేశాల్లోనూ అవకాశాల అసమానతలు, ఆర్థిక ఒత్తిళ్లు, భవిష్యత్తుపై అనిశ్చితి రాజకీయ అసంతృప్తికి కారణమవుతున్నాయి. సంపద పెరిగినంత మాత్రాన దాని ప్రయోజనాలు సమాజంలోని ప్రతి వర్గానికి సమానంగా చేరవని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రజాస్వామ్యం అంటే ఐదేళ్లకోసారి ఓటు వేయడం మాత్రమే కాదు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించడం, ప్రజా సమస్యలపై చర్చించడం, శాంతియుతంగా నిరసన తెలియజేయడం



కూడా ప్రజాస్వామ్య ప్రక్రియలో అంతర్భాగాలే. ప్రపంచవ్యాప్తంగా యువత అసంతృప్తికి ప్రధాన కారణాల్లో నిరుద్యోగం ఒకటి. ఉన్నత విద్యను అభ్యసించినప్పటికీ తగిన ఉద్యోగాలు లభించకపోవడం, ఉద్యోగాలు దొరికినా జీవన వ్యయాలకు సరిపడా ఆదాయం లేకపోవడం, ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు లేదా విదేశాలకు వెళ్లాల్సి రావడం యువతలో నిరాశను పెంచుతున్నాయి. మరోవైపు రాజకీయ పలుకుబడి ఉన్నవారికి అవకాశాలు సులభంగా లభిస్తున్నాయనే భావన అసమానతలపై ఆగ్రహాన్ని పెంచుతోంది. అర్హతకు బదులుగా పరిచయాలకు, ప్రతిభకు బదులుగా పలుకుబడికి ప్రాధాన్యం లభిస్తోందనే అభిప్రాయం ప్రజాస్వామ్యంపై విశ్వాసాన్ని దెబ్బతీస్తుంది. అందుకే యువత కోరుకుంటున్న మార్పు కేవలం నాయకుల మార్పు కాదు. నియామకాల్లో పారదర్శకత, విద్యలో నాణ్యత, ఉపాధిలో సమాన అవకాశాలు, అవినీతిపై చర్యలు, ప్రభుత్వ సేవల్లో జవాబుదారీతనం కూడా వారి ఆకాంక్షల్లో భాగమే. ఈ పరిణామాలు భారతదేశానికి కూడా ముఖ్యమైన పాఠాలను అందిస్తున్నాయి. యువత దేశానికి కీలకమైన మానవ వనరు. వారి శక్తి, సృజనాత్మకత, సాంకేతిక పరిజ్ఞానం దేశాభివృద్ధికి దోహదపడగలవు. అయితే విద్యావకాశాలు, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, పారిశ్రామిక అవకాశాలు, ప్రభుత్వ నియామకాల్లో పారదర్శకత వంటి అంశాలపై తగిన శ్రద్ధ చూపకపోతే ఆ శక్తి అసంతృప్తిగా మారే ప్రమాదం ఉంది. జెన్ జీ సవాల్ సంప్రదాయ రాజకీయ నాయకత్వానికి మాత్రమే కాదు; ప్రజాస్వామ్యాన్ని కేవలం అధికారాన్ని పొందే సాధనంగా భావించే రాజకీయ సంస్కృతికి కూడా హెచ్చరిక. ఎన్నికల్లో విజయం సాధించడం అధికారానికి మార్గం చూపవచ్చు. కానీ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడానికి నిరంతర జవాబుదారీతనం, పారదర్శకత, సమర్థవంతమైన పాలన అవసరం. యువతకు కావాల్సింది కేవలం కొత్త ముఖాలు కాదు; కొత్త ఆలోచనలు, సమాన అవకాశాలు, అవినీతికి తావులేని వ్యవస్థ, తమ భవిష్యత్తుపై భరోసా....

# పద్మనాభ ద్వాదశి రోజున ఇలా వ్రతం చేస్తే కార్యసిద్ధి, శత్రుజయం ఖాయం!



శ్రీ మహావిష్ణువుకు అత్యంత ప్రీతికరమైన తిథి ద్వాదశి! ఏకాదశి మరుసటి రోజు వచ్చే ద్వాదశి తిథి రోజు ఏ పనిచేసినా శ్రీ మహావిష్ణువు అనుగ్రహంతో విజయం సిద్ధిస్తుందని పురాణోక్తి! ముఖ్యంగా ఏకాదశి ఉపవాస దీక్ష ఆచరించిన వారు ద్వాదశి పారణ చేస్తేనే ఏకాదశి వ్రత ఫలం సంపూర్ణంగా లభిస్తుంది. ఒక ఏడాదిలో 24 ద్వాదశులు ఉన్నప్పటికీ కొన్ని ద్వాదశి తిథులు మాత్రం చాలా విశిష్టమైనవి. ఈ క్రమంలో ఆశ్వయుజ శుద్ధ ద్వాదశి రోజు ఆచరించాల్సిన ఒక వ్రతం గురించి తెలుసుకుందాం.

**పద్మనాభ ద్వాదశి**

ఆశ్వయుజ మాసానికి అధిపతి పద్మనాభుడు! ఈ మాసంలో వచ్చే ద్వాదశి రోజు శ్రీ మహావిష్ణువును పద్మనాభుని రూపంలో పూజిస్తాం కాబట్టి ఈ ద్వాదశికి పద్మనాభ ద్వాదశి అని పేరు వచ్చింది.

**పద్మనాభ ద్వాదశి ఎప్పుడు?**

తెలుగు పంచాంగం ప్రకారం ఆశ్వయుజ శుద్ధ ద్వాదశిని పద్మనాభ ద్వాదశి అంటారు. ఈ ఏడాది అక్టోబర్ 23, శుక్రవారం ఆశ్వయుజ శుద్ధ ద్వాదశి కాబట్టి ఈ రోజునే పద్మనాభ ద్వాదశి వ్రతాన్ని ఆచరించాలని పంచాంగ కర్తలు సూచిస్తున్నారు. ఈ క్రమంలో అసలు పద్మనాభ ద్వాదశి వ్రతం విశిష్టత ఏమిటి? పూర్వం ఈ వ్రతాన్ని ఎవరు ఆచరించారు? ఈ వ్రతాన్ని ఎలా ఆచరించాలి? తదితర విషయాలు విపులంగా తెలుసుకుందాం.

**పద్మనాభ ద్వాదశి అంటే!**

ఆశ్వయుజ శుద్ధ ద్వాదశిని పద్మనాభ ద్వాదశి అంటారు. ఈ రోజు శ్రీ మహా విష్ణువు అనంత పద్మనాభ స్వామిని పూజిస్తారు. వ్యాస మహర్షి రచించిన వరాహ పురాణంలో కూడా పద్మనాభ ద్వాదశి వ్రతం గురించిన ప్రస్తావన ఉంది. పాశాంకుశ ఏకాదశి మరుసటి రోజు జరుపుకునే పద్మనాభ ద్వాదశి వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో ఆచరిస్తే కార్యసిద్ధి, శత్రుజయం ఉంటాయని పురాణ వచనం. పూర్వం పాండవులు ఈ వ్రతాన్ని ఆచరించి శత్రుజయం పొందారని పురాణాల ద్వారా తెలుస్తోంది.

**పద్మనాభ ద్వాదశి పూజా విధానం**

పద్మనాభ ద్వాదశి రోజు శ్రీ మహావిష్ణువు స్వరూపమైన అనంత పద్మనాభ స్వామిని విశేషంగా పూజిస్తారు. ఈ రోజు సూర్యోదయానికి ముందే లేచి స్నాన సంధ్యావందనం, నిత్యానుష్ఠానం పూర్తి చేసుకోవాలి. అనంతరం పూజామందిరాన్ని శుభ్రం చేసుకొని లక్ష్మీనారాయణుల చిత్రపటాలను గంధం కుంకుమలతో అలంకరించాలి. ఆవు నేతితో దీపారాధన చేయాలి. అనంతరం లక్ష్మీ నారాయణులను సహస్రనామాలతో అర్చించాలి. వడపప్పు, పానకం, కొబ్బరికాయ, అరటిపండ్లు, పులిహోర, చక్రపొంగలి నైవేద్యంగా సమర్పించాలి. భాగవత కథలు, పద్మనాభ ద్వాదశి వ్రతకథ చదువుకోవాలి.

**పద్మనాభ ద్వాదశి వ్రతకథ**

పూర్వం పాండవులు అరణ్యవాసం చేస్తున్న సమయంలో అనేక కష్టాలను అనుభవించాల్సి వచ్చింది. అనేక కఠిన పరిస్థితులు ఎదుర్కోవాల్సి వచ్చింది. అంతటి చక్రవర్తుల కూడా ఒక సమయంలో తిండి కూడా దొరక్క పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. అప్పుడు పాండవులు శ్రీకృష్ణుని ప్రార్థించి తమ కష్టాలు పోయే మార్గం చెప్పమని కోరారు. అప్పుడు శ్రీకృష్ణుడు ఆశ్వయుజ శుద్ధ ద్వాదశి రోజు వచ్చే పద్మనాభ ద్వాదశి రోజు భక్తి శ్రద్ధలతో శ్రీమహావిష్ణువును నియమ నిష్టలతో పూజిస్తే కష్టాలు తొలగి, కార్యసిద్ధి శత్రుజయం కలుగుతాయని చెప్పాడు.

**కష్టాల నుంచి బయటపడిన పాండవులు**

శ్రీకృష్ణుడు చెప్పినట్లుగా పాండవులు ద్రౌపది సమేతంగా శాస్త్రోక్తంగా పద్మనాభ ద్వాదశి వ్రతాన్ని ఆచరించారు. అటు తర్వాత అరణ్య అజ్ఞాత వాసాలు పూర్తయ్యాక జరిగిన కురుక్షేత్ర సంగ్రామంలో పాండవులు కౌరవులపై విజయం సాధించి తమ రాజ్యాన్ని తిరిగి పొందారు. ఈ విధంగా పద్మనాభ ద్వాదశి వ్రతాన్ని ఆచరించి పాండవులు దరిద్రం నుంచి బయటపడి శత్రువులను జయించి తమ రాజ్యాన్ని తిరిగి పొందారు కాబట్టి ఆనాటి నుంచి కార్యసిద్ధి, శత్రుజయం కోరుకునేవారు పద్మనాభ ద్వాదశి వ్రతాన్ని ఆచరించడం ఆనవాయితీగా వస్తోంది.

**పద్మనాభ ద్వాదశి వ్రత ఫలం**

భక్తిశ్రద్ధలతో పద్మనాభ ద్వాదశి వ్రతాన్ని ఆచరిస్తే చేపట్టిన పనుల్లో ఎదురవుతున్న ఆటంకాలు తొలగిపోయి కార్యసిద్ధి, శత్రుజయం కలుగుతాయి. మనం కూడా పద్మనాభ ద్వాదశి వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో ఆచరిద్దాం. ఆ శ్రీమన్నారాయణుని అనుగ్రహాన్ని పొందుదాం. జై శ్రీమన్నారాయణ!

ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు

# జంటల మధ్య అనుబంధాన్ని శాశ్వతం చేసే "స్లో డేటింగ్?" - ఎలా వర్క్? అవుతుందో తెలుసా?



పెళ్లి అంటే నూరేళ్ల పంట. కానీ ప్రస్తుతం పరిస్థితులు మారుతున్నాయి. చాలా కాపురాలు మూణ్ణాళ్ల ముచ్చటగానే మిగిలిపోతున్నాయి. ప్రేమ పెళ్లి లేదా పెద్దలు కుదర్చిన పెళ్లి ఏదైనా సరే కలిసి ఉండలేక విడాకులు తీసుకుంటున్నారు. అయితే విడాకులు తీసుకోవడానికి ఎన్ని కారణాలు ఉన్నా.. తొందరపాటు నిర్ణయాలు కూడా ఈ కాలపు జంటల్లో డివోర్స్?కు ఓ కారణమే అంటున్నారు రిలేషన్?షిప్? నిపుణులు. అందుకే ప్రేమైనా, పెద్దలు కుదిర్చిన సంబంధమైనా లైఫ్? పార్టనర్?ను నెమ్మదిగా, పూర్తిగా అర్థం చేసుకోవడమే మంచిదని వివరిస్తున్నారు. ఈ క్రమంలోనే "స్లో డేటింగ్"గా పిలిచే రిలేషన్‌షిప్ ట్రెండ్ జంటల మధ్య అనుబంధాన్ని శాశ్వతం చేసేందుకు తోడ్పడుతుందంటున్నారు. ఆ వివరాలు ఇప్పుడు చూద్దాం.

ప్రవర్తన ఎలా ఉంది?: ప్రేమలో పడిన కొత్తలో భాగస్వామిని ఇంప్రెస్ చేయాలని వాళ్లతో ప్రేమగా మాట్లాడటం, బయటికి తీసుకెళ్లడం, గిఫ్ట్?లు ఇవ్వడం వంటివి చేస్తుంటారు. కానీ రోజులు గడిచే కొద్దీ ఇవన్నీ మారిపోతుంటాయి. ముఖ్యంగా కొంతమంది ప్రవర్తనలో కూడా మార్పులొస్తుంటాయి. దీంతో మీరంటే ఇష్టం లేనట్లుగా, లెక్కలేనట్లుగా ప్రవర్తిస్తుంటారు. ఇష్టపడిన వ్యక్తి ఇలా ప్రవర్తిస్తే మనసు బాధపడుతుంది. అయితే ఇలా జరగకుండా ఉండాలంటే "స్లో డేటింగ్" మంచి ఆప్షన్? అని చెబుతున్నారు నిపుణులు. అంటే తొలి చూపులోనే అవతలి వ్యక్తి నచ్చినా.. తమ ఫీలింగ్స్‌ని బయటపెట్టకుండా.. వాళ్లు ఎలాంటి వారు? వాళ్ల స్వభావం లేదా ప్రవర్తన ఎలా ఉంటుంది? అనే విషయాలను ముందుగానే తెలుసుకునే ప్రయత్నం చేయాలని చెప్పడమే దీని అర్థం అని చెబుతున్నారు. అయితే ఇందుకు కనీసం మూడు నెలల పైనే సమయం పడుతుందని వివరిస్తున్నారు. ఈ సమయంలో తరచూ కలుసుకుంటూ వాళ్ల అభిప్రాయాలు, ఇష్టాఇష్టాలు తెలుసుకోవడం, మీ గురించి ఏమీ దాచకుండా పాజిటివ్స్?, నెగిటివ్స్? పంచుకోవడం, ఈ సమయంలో వాళ్ల స్పందన ఎలా ఉంటుందో గ్రహించడం వంటివన్నీ చేయాలంటున్నారు. ఈ విషయాలు అన్నీ తెలిస్తే గానీ అవతలి వ్యక్తి మన లైఫ్? పార్టనర్?గా సరిపోతాడా? లేదా? అనేది అర్థం అవుతుందని.. తద్వారా ప్రేమ, పెళ్లి విషయాల్లో చక్కటి నిర్ణయం తీసుకోగలుగుతామని చెబుతున్నారు.నమ్మకం కుదిరాకే..!: వివాహ బంధం మాత్రమే కాదు ఏ రిలేషన్? అయినా స్ట్రాంగ్?గా ఉండాలంటే ఒకరిపై ఒకరికి నమ్మకం కలగడం ముఖ్యం. అయితే ఇది అంత త్వరగా పూర్తయ్యే పని కాదని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం, ఒకరి గురించి మరొకరు లోతుగా తెలుసుకోవడం వంటి జరిగినప్పుడే అవతలి వారిని 'నమ్మవచ్చా? నమ్మకూడదా?' అనే విషయం అర్థమవుతుందని వివరిస్తున్నారు. ఎందుకంటే లైఫ్? పార్టనర్? అంటే.. ఎన్నో విషయాల్లో వారి గురించి స్పష్టత రావాల్సి ఉంటుందని వివరిస్తున్నారు. అంటే 'ఒకరినొకరు అర్థం చేసుకోగలుగుతున్నామా?', 'అవతలి వారిలో ఆధిపత్యం చెలాయించే గుణాలున్నాయా?', 'గౌరవం ఇచ్చి పుచ్చుకోగలుగుతున్నామా?', 'అవసరమైతే

# విజయనగరం పైడితల్లి సిరిమానోత్సవం ఎప్పుడు?





: ఉత్తరాంధ్ర ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న పైడితల్లి సిరిమాను సంబరాలకు సర్వం సిద్ధమైంది. అమ్మవారి ఉత్సవాలకు ముహూర్తం ఖరారైంది. ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం శ్రీ పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలకు సంబంధించిన తేదీలను ఆలయ కమిటీ, దేవాదాయ శాఖ వారు సంయుక్తంగా ప్రకటించారు. ఆ ప్రకారంగా అమ్మవారి జాతర ఎప్పుడు ప్రారంభం కానుంది? జాతర ఎన్ని రోజులు జరుగుతుంది? ఈ జాతర విఏమిటి? అనే అంశాలు ఇప్పుడు చూద్దాం.

**విజయనగరం పైడితల్లి జాతర షెడ్యూల్ ఇదే!**

ఈ ఏడాది విజయనగరం పైడితల్లి జాతర అక్టోబర్ 26 నుంచి నవంబర్ 11 వరకు కొనసాగనున్నాయి. ఇప్పటికే ఈ జాతరకు సంబంధించి మండల దీక్ష ప్రారంభమైన ఏరోజు ఏ ఉత్సవం జరగనుందో చూద్దాం.

**తోలేళ్ల ఉత్సవం**

పైడితల్లి జాతరలో ప్రధానమైన ఘట్టం తోలేళ్ల ఉత్సవం అక్టోబర్ 26, సోమవారం జరగనుంది. తొలేళ్ల ఉత్సవం సిరిమాను ఉత్సవానికి రోజు జరిగే తొలి ప్రధాన ఘట్టం.

**పేరు వెనుక అర్థం:**

'తొలి ఏర్లు' అంటే మొదటి సారి పొలం దున్నడం లేదా పంటలు వేయడం అనే అర్థం వచ్చే పదం కాలక్రమేణా 'తొలేళ్లు' లేదా 'తొలేళ్ల ఉత్సవం' గా మారింది. ఈ ఉత్సవంలో భాగంగా రైతులు తమ పంట పొలాల్లో వేయాల్సిన విత్తనాలను అమ్మవారి ముందుంచి, మంచి వర్షాలు కురిసి చక్కటి పంటలు పండాలని మొక్కులు చెల్లించుకుంటారు.

**ఘటాల ప్రదర్శన:**

తోలేళ్ల ఉత్సవం సందర్భంగా అమ్మవారి భక్తులు, ముఖ్యంగా మహిళలు అమ్మవారికి ఇష్టమైన ఘటాలను అంటే చక్కగా అలంకరించిన కుండలు, పట్టు చీరలను తలపై పెట్టుకుని ఆలయానికి వచ్చి భక్తిశ్రద్ధలతో తమ మొక్కులు చెల్లించుకుంటారు. విజయనగరం రాజవంశీకులు మరియు వేలాది మంది భక్తులు ఈ వేడుకలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుంటారు.

**సిరిమాను ఉత్సవం**

సాధారణంగా విజయదశమి తరువాత వచ్చే మొదటి మంగళవారం రోజు పైడితల్లి అమ్మవారి సిరిమాను ఉత్సవం జరుగుతుంది. ఈ ఏడాది అక్టోబర్ 27, మంగళవారం సిరిమాను ఉత్సవం ఘనంగా జరగనుంది. ఈ సందర్భంగా ఈ సిరిమాను ఉత్సవం విశిష్టత గురించి తెలుసుకుందాం.

**అంతా అమ్మ ఆజ్ఞమేరకే!**

సిరిమాను ఉత్సవానికి సంబంధించిన ఏర్పాట్లన్నీ అమ్మవారు స్వయంగా పర్యవేక్షిస్తారని విశ్వాసం. అందుకు నిదర్శనంగా సిరిమానోత్సవానికి నెల రోజుల ముందు పైడితల్లి అమ్మవారు ఆలయ పూజారికి స్వప్నంలో సాక్షాత్కరించి సిరిమాను చెట్టు ఎక్కడుందో చెబుతారు. అమ్మవారు సూచించిన చింత చెట్టు కొమ్మనే సిరిమానుగా ఉపయోగిస్తారు. ఆ చెట్టు యజమానితో మాట్లాడి సిరిమానును సిద్ధం చేస్తారు. నిపుణులైన వడ్రంగులు సిరిమాను చెక్కుతుండగా ప్రజలు నీళ్లు, పసుపు చల్లుతూ మొక్కులు తీర్చుకుంటారు.

**కన్నులపండుగగా సిరిమాను ఉత్సవం**

అమ్మవారి ఆజ్ఞతో తయారైన సుమారు 60 అడుగుల పొడవైన సిరిమాను చివర పూజారి కూర్చున్న తర్వాత పవిత్రమైన సిరిమాను భక్తుల జయజయధ్వానాల మధ్య పైకి లేస్తుంది. ఈ సిరిమాను విజయనగరం పట్టణంలోని మూడు లాంతర్ల జంక్షన్ నుంచి కోట వరకు మూడు సార్లు తిరుగుతుంది. ఈ సందర్భంగా రాజకుటుంబీకులు, ప్రముఖులు కోట బురుజు దగ్గర కూర్చుని పైడితల్లి అమ్మవారిని దర్శించుకుంటారు. అమ్మవారి రూపంగా భావించే సిరిమానును అధిరోహించిన పూజారి ప్రజలందరికీ దీవెనలు అందిస్తారు. సిరిమానోత్సవంలో బెస్తవారి వల, పాలధార, తెల్ల ఏనుగు, అంజలి రథం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.

**సిరిమాను ప్రసాదం**

ఉత్సవం పూర్తయ్యాక పూజారి అధిరోహించిన సిరిమానును చిన్న చిన్న ముక్కలుగా చేసి ఆ ముక్కలను భక్తులకు ప్రసాదంగా పంచిపెడతారు.

సిరిమాను ప్రసాద మహత్యం

సిరిమాను ఉత్సవంలో పంచిపెట్టిన సిరిమాను ప్రసాదాన్ని భక్తులు మహా ప్రసాదంగా భావించి తమ ఇంటికి తీసుకెళ్లి పూజామందిరంలో ఉంచుకుని పూజ చేస్తారు. ఈ సిరిమాను ప్రసాదం తమ ఇంట్లో సిరులు నింపుతుందని భక్తుల విశ్వాసం. కొందరు ఈ సిరిమాను ప్రసాదాన్ని తమ పొలంలో రక్షగా ఉంచుతారు. ఇలా చేయడం వలన పంటలు సమృద్ధిగా పండుతాయని నమ్మకం.

**ఇతర ఉత్సవాలకు తేదీలివే!**

నవంబర్ 3, మంగళవారం రోజు తెప్పోత్సవం, నవంబర్ 7, శనివారం కలశ జ్యోతి ఊరేగింపు జరగనున్నాయి. చివరగా నవంబర్ 10, మంగళవారం ఉయ్యాల కంబోత్సవం నవంబర్ 11, బుధవారం రోజు నిర్వహించనున్న చండీహోమంతో ఈ మహోత్సవాలు ముగియనున్నాయి. ఉత్తరాంధ్ర ప్రజల కొంగుబంగారంగా విరాజిల్లే శ్రీ పైడితల్లి జాతరకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉంది. మనం కూడా శ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమాను ఉత్సవంలో పాల్గొని అమ్మవారి అనుగ్రహాన్ని పొందుదాం.

**జై పైడితల్లి!**

ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం

# కజిన్స్ మధ్య "అనుబంధం" పెరగాలా? - ఈ టిప్స్ యూజ్ అవుతాయని సలహా

ఉమ్మడి కుటుంబాల్లో ఉండే ప్రేమలు, ఆప్యాయతలు, పలకరింపులు వేరే లెవల్?. విడిగా ఉండే కుటుంబాలలో ఇవి కనిపించవు. ఇక జాయింట్? ఫ్యామిలీలలో కజిన్స్? మధ్య ఉండే అనుబంధం మరింత ప్రత్యేకం. పెద్దమ్మ-పెదనాన్న, పిన్ని-బాబాయిల పిల్లలతో కలిసి ఆడుకోవడం, ఒకరినొకరు సరదాగా ఆటపట్టించుకోవడం వంటి మూమెంట్స్? ఎప్పటికీ మదిలో అలా నిలిచిపోతాయి. కానీ ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవుతున్న ఈ కాలంలో కజిన్స్? మధ్య ప్రేమలు కూడా దూరమవుతున్నాయి. పెళ్లిళ్లు, కెరీర్ దృష్ట్యా ఊళ్లు, రాష్ట్రాలే కాదు.. దేశాలు కూడా దాటేస్తున్నారు. అయితే దీన్ని ఇలానే నిర్లక్ష్యం చేయకుండా.. కజిన్స్‌తో అనుబంధాన్ని పెంచుకునే మార్గాల్ని అన్వేషించాలంటున్నారు రిలేషన్‌షిప్ నిపుణులు. అప్పుడే ఎంత దూరంగా ఉన్నా.. దగ్గరగా ఉన్న భావన కలగడంతో పాటు.. ఒకరినొకరు మిస్సవకుండా జాగ్రత్తపడవచ్చని సలహా ఇస్తున్నారు. అవేంటో ఈ స్టోరీలో చూద్దాం.



ఒక టైం ఉండాలి: ప్రస్తుతం ప్రతి ఒక్కరి చేతిలో మొబైల్? ఫోన్? ఉండటం కామన్? అయ్యింది. అయితే కజిన్స్? మధ్య బాండింగ్?ను పెంచుకోవడానికి ఫోన్స్? సూపర్? ఆప్షన్? అంటున్నారు. ఎందుకంటే ప్రేమగా ఓ నాలుగు మాటలు మాట్లాడుకోవడం, వీడియో కాల్స్‌లో ఒకరినొకరు చూసుకోవడం వంటి పనుల వల్ల ఎంత దూరంగా ఉన్నా దగ్గరగానే ఉన్న భావన కలుగుతుందంటున్నారు. ఈ క్రమంలోనే అందరికీ కుదిరేలా ఒక టైం సెట్? చేసుకోమంటున్నారు. ఇక ఒక్కొక్కరికీ వేర్వేరుగా కాకుండా.. గ్రూప్ కాల్ చేస్తే.. అందరూ ఒకే చోట ఉన్న భావన కలుగుతుందని వివరిస్తున్నారు. ఇక వాట్సప్ గ్రూప్‌లో ఒకరిపై ఒకరు చేసే టీజింగ్, వేసే సెటైర్లు..అవన్నీ సరే సరి. నిజానికి ఇలాంటి విషయాలు చాలా చిన్నగా అనిపించవచ్చు.. కానీ కజిన్స్‌తో మనకున్న అనుబంధాన్ని శాశ్వతం చేస్తాయని, ఎన్నో మధుర జ్ఞాపకాలను అందిస్తాయని చెబుతున్నారు.గెట్-టు-గెదర్: పెళ్లిళ్లు, ఫంక్షన్లు.. వంటి స్పెషల్? అకేషన్స్? అప్పుడు అందరూ ఒక్క చోట చేరితే ఆ సందడే వేరుగా ఉంటుంది. ఇక ఒకే ఊర్లో ఉండే వారైతే.. పండగలప్పుడు కలిసి గోల గోల చేస్తుంటారు. అయితే ఎప్పుడూ ఇలానే కాకుండా కేవలం కజిన్స్ మాత్రమే గెట్-టు-గెదర్ పార్టీ ఏర్పాటు చేసుకునేలా ప్లాన్ చేసుకోమంటున్నారు. ఈ క్రమంలోనే అందరికీ సూట్? అయ్యేలా ఒక ప్లేస్?ను సెలెక్ట్? చేసుకుని, గేమ్స్?, యాక్టివిటీలు, టీజింగ్‌లు, ఆట పట్టించుకోవడాలు వంటి పనులతో చిన్నప్పుడు ఎంత సరదాగా ఉండేవాళ్లో.. ఈ పార్టీనీ అంతే సరదాగా ఎంజాయ్ చేయమంటున్నారు. ఇవన్నీ పాత జ్ఞాపకాల్ని మరోసారి మీ ముందుకు తీసుకొస్తాయని, బాండ్?ను రెట్టింపు చేస్తాయని చెబుతున్నారు. మరోసారి కలుసుకునే వరకు ఈ జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ కజిన్స్‌తో దగ్గరగా ఉన్న అనుభూతిని పొందచ్చని చెబుతున్నారు

కష్టాల్లోనూ తోడుగా: సుఖాల్లో అందరూ తోడుంటారు.. కానీ కష్టాలొచ్చేసరికి చాలా మంది వ్యక్తిత్వాలు బయటపడతాయి. అయితే సుఖాల్లో ఎలా ఉన్నా, కష్టాల్లో తోడు ఉన్నప్పుడే బాండ్? స్ట్రాంగ్? అవుతుందని నిపుణులు చెబుతున్నారు. కజిన్స్‌తో బంధం పెంచుకోవడానికి ఇదీ ఓ మార్గమే అని సూచిస్తున్నారు. వారితో ఎప్పుడూ టచ్‌లోనే ఉండడం వల్ల ఇద్దరి మధ్య అనుబంధం పెరుగుతుందని.. ఎలాంటి సమస్యలు వచ్చినా నిస్సంకోచంగా ఒకరితో ఒకరు పంచుకోగలుగుతారంటున్నారు. అలాగే సహాయసహకారాలు అందించుకోగలుగుతారని వివరిస్తున్నారు. ఒకవేళ వారు మీతో నేరుగా చెప్పలేకపోయినా.. మూడో వ్యక్తి ద్వారా వారి సమస్యలు తెలిస్తే వెంటనే స్పందించి వారికి సహాయపడడం, కష్టాల్లో నుంచి గట్టెక్కేలా సలహాలు ఇవ్వడం వంటివి చేయమంటున్నారు. ఇలా ఒకరికొకరు దగ్గరగా ఉన్నప్పుడే.. ఎంత దూరంగా ఉన్నా ఇద్దరి మధ్య అనుబంధం శాశ్వతమవుతుందని సలహా ఇస్తున్నారు.అలాగే ఆయా ప్రత్యేక సందర్భాల్లో ఎంత బిజీగా ఉన్నా.. రిమైండర్ పెట్టుకొని విష్ చేయడం, గిఫ్ట్?లు ఇచ్చి సర్‌ప్రైజ్ చేయడం, వీలుంటే అందరూ కలిసి బయటికి వెళ్లడం, పార్టీ చేసుకోవడం.. ఇలాంటి యాక్టివిటీస్? అన్ని కజిన్స్ మధ్య అనుబంధాన్ని పెంచేవే అంటున్నారు రిలేషన్?షిప్? నిపుణులు.

# కోటి దాటిన కోకొల్లల రుచుల సంగమం..

- సరికొత్త మైలురాయిని సరస్ శక్తి ఫుడ్ కోర్టు ప్రాంగణం
- ఎస్‌హెచ్‌జీ మహిళలను ప్రోత్సహించిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, వీఎంసీ ధ్యానచంద్ర



**విజయవాడ, అక్టోబర్ 23, 2026 :** విజయవాడ, పున్నమి ఘాట్‌లో నిర్వహిస్తున్న జాతీయ సరస్ మేళా మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు, వారి నైపుణ్యాలకు, ఆర్థిక స్వావలంబనకు చక్కని వేదికగా నిలుస్తోందని.. అదే విధంగా ప్రాంగణంలోని లైవ్ ఫుడ్ కోర్టులో అమ్మకాలు కోటి రూపాయలు దాటడం విశేషమని, ఇది ఆహార ప్రియుల నుంచి లభిస్తున్న ఆదరణకు, మహిళల కృషికి నిదర్శనమని అన్నారు.సరస్ మేళాలోని ఫుడ్ కోర్టులో అమ్మకాలు రూ. కోటి దాటిన సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం పాల్గొన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళల ఆహార ఉత్పత్తుల విజయాన్ని పురస్కరించుకొని వారిని అభినందించి ప్రోత్సహించారు. కేక్ కట్ చేసి విజయానందపు రుచిని పంచిపెట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రత్యేక వంటకాలు, సంప్రదాయ ఆహార రుచులను ఒకే వేదికపై ఆస్వాదించే అవకాశం సరస్ మేళా ద్వారా కలుగుతోందన్నారు. 50 లైవ్ ఫుడ్ స్టాల్స్‌లో వివిధ ప్రాంతాల ప్రత్యేక వంటకాలను అక్కడికక్కడే తయారుచేసి అందించడం సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోందన్నారు. భిన్న సంస్కృతులు, సంప్రదాయాలు, ఆహార వైవిధ్యాలను పరిచయం చేస్తూ ఆహార ప్రియులకు సరికొత్త అనుభూతిని అందిస్తోందని పేర్కొన్నారు. మహిళలు తమ నైపుణ్యాలను వ్యాపార అవకాశాలుగా మలుచుకొని, స్వయంగా ఆదాయం సంపాదిస్తూ ఆర్థికాభివృద్ధికి తోడ్పడటం అభినందనీయమన్నారు. మహిళల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు, వారి ఉత్పత్తులకు విస్తృత మార్కెట్‌ను కల్పించడం, వినియోగదారులతో నేరుగా అనుసంధానం చేయడం వంటి లక్ష్యాలకు సరస్ మేళా దోహదపడుతోందని వివరించారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్.ఎం. మాట్లాడుతూ జాతీయ సరస్ మేళా నగరంతో పాటు వివిధ ప్రాంతాల ప్రజలకు వివిధ రాష్ట్రాల ప్రత్యేక ఆహార రుచులను ఒకే వేదికపై ఆస్వాదించే అద్భుతమైన అవకాశాన్ని కల్పిస్తోందని పేర్కొన్నారు. లైవ్ ఫుడ్ కోర్టులో కోటి రూపాయలకు పైగా అమ్మకాలు నమోదవడం మహిళా స్వయం సహాయక సంఘాల ప్రతిభకు, కృషికి, ఆహార ప్రియుల ఆదరణకు నిదర్శనమని అన్నారు. ఇలాగే మరిన్ని విజయాలను సొంతం చేసుకోవాలని ధ్యానచంద్ర ఆకాంక్షించారు.సరస్ మేళాలో మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక అభివృద్ధికి బ్యాంకింగ్ సేవల ప్రాధాన్యత, రుణ సదుపాయాల వినియోగం, ఆర్థిక నిర్వహణతో పాటు డిజిటల్ మార్కెటింగ్ ద్వారా తమ ఉత్పత్తులకు విస్తృత ప్రచారం కల్పించడం, ఆన్‌లైన్ విక్రయ అవకాశాలను సద్వినియోగం చేసుకోవడంపై నిపుణుల ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల ద్వారా మహిళలు వ్యాపార నైపుణ్యాలను పెంపొందించుకొని, ఆధునిక మార్కెటింగ్ పద్ధతులను అనుసరిస్తూ ఆర్థికంగా మరింత అభివృద్ధి సాధించేలా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లు, భద్రతా చర్యలు

- జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.లక్ష్మీశ



**విజయవాడ: అక్టోబర్ 23,2026 :** స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత, పారదర్శక, నిష్పక్షపాత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేసిందని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. విజయవాడ జిల్లా పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న జడ్పీటీసీ అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియను శుక్రవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆకస్మికంగా పరిశీలించారు. అభ్యర్థులకు ఏమైనా సందేహాలు ఉంటే ఇక్కడే అడిగి తెలుసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ నామినేషన్ల ప్రక్రియ, హెల్ప్ డెస్కులు, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా ప్రతి కేంద్రం వద్ద నిరంతర వీడియోగ్రఫీ పర్యవేక్షణను ఏర్పాటు చేశాం అన్నారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులకు ఏవైనా సందేహాలు ఉంటే మార్గదర్శనం చేసేందుకు ప్రతి కేంద్రం వద్ద ప్రత్యేకంగా 'హెల్ప్ డెస్క్ సదుపాయాన్ని అందుబాటులో ఉంచాం అన్నారు. అభ్యర్థులు స్వేచ్ఛగా నామినేషన్ దాఖలు చేసుకునేందుకు పూర్తి భద్రత కల్పిస్తున్నాం అన్నారు. ఎవరైనా నామినేషన్ల దాఖలుకు వెళ్లే అభ్యర్థులను అడ్డుకున్నా లేదా ఇబ్బందులకు గురిచేసినా వెంటనే కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్ 9154970454, పోలీస్ కంట్రోల్ రూమ్ లేదా సంబంధిత రిటర్నింగ్ అధికారుల దృష్టికి తీసుకురావచ్చు అన్నారు. అడ్డంకులు సృష్టించే వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం అన్నారు. ఓటర్లు తమ ఓటు హక్కును సౌకర్యవంతంగా వినియోగించుకునేలా జిల్లా వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాలలో 'నిర్దేశిత కనీస వసతులు' తాగునీరు, విద్యుత్, షామియానా, ర్యాంప్ వంటి అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. గత ఎన్నికల పరిస్థితులను పరిశీలించి సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాం అన్నారు. అక్కడ అదనపు పోలీసు బలగాల మోహరింపు, సీసీటీవీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్ ద్వారా నిరంతర నిఘా కొనసాగుతుందన్నారు. పోలింగ్ ముగిసిన అనంతరం ఈవీఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్‌లు, అలాగే ఓట్ల లెక్కింపు ప్రక్రియ కోసం కౌంటింగ్ కేంద్రాల వద్ద విస్తృత భద్రతా ఏర్పాట్లతో పాటు అవసరమైన అన్ని సదుపాయాలను సిద్ధం చేశాం అన్నారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ తూచా తప్పక పాటించాలని, ఎన్నికలు విజయవంతంగా ముగిసేందుకు ప్రజలు, అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

## దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాలు విజయవంతంగా ముగింపు



**విజయవాడ, 23 అక్టోబర్ 2026:** దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని విజయవాడలోని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థాన ప్రాంగణంలో డా. ఎన్.ఆర్.ఎస్. ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల మరియు డా. ఏ.ఎల్. ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి, విజయవాడ సంయుక్తంగా ఈ నెల 11 తేదీ నుండి 23 వ తేదీ వంకు 13 రోజులపాటు నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాలు విజయవంతంగా ముగిశాయి.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆయుష్ శాఖ సంచాలకులు శ్రీ గోపాల కృష్ణ రోణంకి , ఐ.ఏ.ఎస్. గారి ఆదేశాల మేరకు, దసరా ఉత్సవాల సందర్భంగా దేవస్థానానికి విచ్చేసే భక్తులకు నాణ్యమైన ఆయుర్వేద వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో ఈ శిబిరాలను నిర్వహించారు.ఈ వైద్య శిబిరాలకు భక్తులు, ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాల ద్వారా దాదాపు 25,000 మంది భక్తులు, ఉచిత వైద్య సేవలను వినియోగించుకున్నారు. వైద్య బృందాలు మూడు షిఫ్టుల్లో భక్తులకు చికిత్సలను అందించాయి. దూరప్రాంతాల నుండి నడిచి వచ్చే భక్తులకు వైద్యుల సూచనల మేరకు పాదాలు మోకాళ్ళు మొదలైన కీళ్ల నొప్పులకు ఆయిల్ మసాజ్ చికిత్సలు కూడా అందించారు.ఈ వైద్య శిబిరాలు విజయవంతంగా నిర్వహించడంలో ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ శ్రీ జి. లక్ష్మీశ గారు (ఐ.ఏ.ఎస్.) దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈఓ) శ్రీ సీనా నాయక్ అందించిన సహకారానికి నిర్వాహకులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ శిబిరాలను డా. ఎన్.ఆర్.ఎస్. ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల, ప్రిన్సిపాల్ డా. టి. బుల్లయ్య , డా. ఏ.ఎల్. ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా. పి. జగదీష్ గారి పర్యవేక్షణ, సమన్వయంతో నిర్వహించారు.రెండు సంస్థలకు చెందిన అధ్యాపకులు,వైద్యులు, ఆయుర్వేద పీజీ విద్యార్థులు,ఇంటర్నీలు మరియు ఇతర సిబ్బంది ఈ శిబిరాల్లో చురుకుగా పాల్గొని భక్తులకు అంకితభావంతో వైద్య సేవలను అందించారు.ఈ వైద్య శిబిరాల విజయవంతమైన ముగింపు ఆయుష్ శాఖతో పాటు రెండు ప్రభుత్వ ఆయుర్వేద సంస్థలు ప్రజలకు అందుబాటులో ఆరోగ్య సేవలను అందించడంలో, ఆయుర్వేద వైద్య విధానాన్ని ప్రోత్సహించడంలో చూపుతున్న నిబద్ధతకు నిదర్శనంగా నిలిచింది. ముఖ్యంగా, ప్రధాన పండుగలు మరియు ఆధ్యాత్మిక కార్యక్రమాల సందర్భంగా భక్తులకు వైద్య సేవలను అందించడంలో ఈశిబిరాలు విశేషంగా

# అక్రమ మద్యం రవాణా విక్రయాలపై ఉక్కుపాదం

- ఎక్సైజ్ చట్టాల అమల్లో నిర్లక్ష్యానికి తావులేదు
- సరిహద్దు ప్రాంతాల్లో నిరంతర నిఘాకు చర్యలు
- ఎక్సైజ్ కమిషనర్ సీహెచ్ శ్రీధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ



**విజయవాడ, అక్టోబర్ 23, 2026 :** అక్రమ మద్యం రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపడం జరుగుతుందని.. ఎక్సైజ్ చట్టాలను పటిష్టంగా అమలుచేయనున్నట్లు ఎక్సైజ్ కమిషనర్ సీహెచ్ శ్రీధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ అన్నారు. విజయవాడ కరెన్సీ నగర్‌లోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయంలో ఎన్‌టీఆర్, కృష్ణా జిల్లాల ఎక్సైజ్ అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఇందులో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఎక్సైజ్ కమిషనర్ చామకూరి శ్రీధర్ మాట్లాడుతూ మద్యం దుకాణాలు, బార్ల నిర్వహణలో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు తప్పనిసరిగా పాటించేలా తనిఖీలు నిర్వహించాలని, నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. అక్రమ కార్యకలాపాలను గుర్తించడంలో నిర్లక్ష్యం వహించకుండా, విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ మాట్లాడుతూ రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల నుంచి అక్రమంగా మద్యం రవాణా కాకుండా నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని, ఇతర రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం సరఫరాను అడ్డుకునేందుకు అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. అక్రమ మద్యం తయారీ, రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యాలయ డిప్యూటీ కమిషనర్ వివేక్, విజయవాడ డిప్యూటీ కమిషనర్ టి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ లావణ్య, ఎన్‌టీఆర్, కృష్ణా జిల్లాల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎస్.శ్రీనివాసరావు, రెండు జిల్లాల అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఎక్సైజ్ కమిషనర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్.. గొల్లపూడిలోని శ్రీసాయి కృష్ణ వైన్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. మద్యం దుకాణాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, అక్రమ విక్రయాలకు తావులేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# మహిళా సాధికారతకు బ్యాంకుల ప్రోత్సాహం అత్యంత కీలకం

జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశా

- స్వయం సహాయక సంఘాల మహిళల సమగ్ర వికాసానికి, గ్రామీణ మహిళా సాధికారతకు బ్యాంకులు అందిస్తున్న ఆర్థిక సహకారం ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశా పేర్కొన్నారు.




**విజయవాడ,23.10.2026 :** విజయవాడ పున్నమి ఘాట్‌లో జరుగుతున్న జాతీయ సారస్ ఆజీవిక మేళా--2026లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన "సంవాద్ టు సమృద్ధి ఎస్‌హెచ్‌జీ రుణాల నుంచి లక్షపతి దీదీ వరకు" ముఖాముఖి సదస్సులో ఆయన ప్రసంగించారు. మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు, సూక్ష్మ వ్యాపారాలను బలోపేతం చేసుకునేందుకు బ్యాంకింగ్ రంగం నిరంతర తోడ్పాటు అందించాలని సూచించారు. గ్రామీణ జీవనోపాధిని మెరుగుపరుస్తూ స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి విశేష సేవలందిస్తున్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను ఈ సందర్భంగా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ జాతీయ సమన్వయకర్త అనిల్ కుమార్ మాట్లాడుతూ, ఎస్‌హెచ్‌జీ--బ్యాంక్ రుణాల అనుసంధానంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామిగా ఉందని, ఢిల్లీ వెలుపల తొలిసారిగా జాతీయ సరస్ మేళాను ఏపీలో నిర్వహించడం గర్వకారణమని తెలిపారు.అనంతరం యూనియన్ బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా 5 లక్షలకు పైగా సంఘాలకు రూ.33,212 కోట్ల రుణాలు అందించామని, 'యూనియన్ లక్షపతి దీదీ పథకం' కింద అర్హులైన మహిళా పారిశ్రామికవేత్తలకు రూ.1 లక్ష నుంచి రూ.5 లక్షల వరకురుణాలు అందజేస్తున్నామని వివరించారు.సదస్సులో ఏజీఎంలు మహేష్, శ్రీనివాస్, డిఆర్ డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాంచార రావు, అదనపు డైరెక్టర్ వై. రమ స్వయం సహాయక సంఘాలు పాల్గొన్నారు.

# సద్దుల బతుకమ్మ కానుకగా చీరల పంపిణీ మహిళల్లో ఆనందం



**హుజూర్నగర్, అక్టోబర్ 23:** సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని హుజూర్నగర్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు పిల్లుట్ల రఘు గారు బతుకమ్మ కానుకగా అందించిన సుమారు 50 బతుకమ్మ చీరలను హుజూర్నగర్ మున్సిపాలిటీ 10 వ వార్డులో ఘనంగా పంపిణీ చేయడం జరిగింది.ఈ చీరలను 10వ వార్డు ఇన్చార్జ్ సరస్వతి శ్రీనివాసరాజు మరియు ప్రతి కంఠం భారతి గారి ఆధ్వర్యంలో మహిళా సోదరీమణులకు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగ ఎంతో గొప్పదని, తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. పిల్లుట్ల రఘు గారు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గారి స్ఫూర్తితో బతుకమ్మ చీరలను కానుకగా నియోజకవర్గంలోని అనేక చోట్ల పంపిణీ చేస్తున్నారని తెలిపారు. గతంలో ఏ విధంగా అయితే మహిళలందరి ఆశీర్వాదం కేసీఆర్ గారికి దక్కిందో, అదే విధంగా పిల్లుట్ల మరియు ప్రతి కంఠం రఘు గారికి కూడా మహిళల ఆశీర్వాదం దక్కాలని, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఈ సందర్భంగా వార్డు మహిళలందరూ ఆకాంక్షించారు.అనం తరం తమకు చీరలు అందించిన పిల్లుట్ల రఘు గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్ర మంలో వార్డు మహిళలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బెజ్జంకి, ఇల్లంతకుంట ఏఎంసీలకు నూతన పాలకవర్గాలు

- చైర్మన్లుగా మాతంగి శిరీష, అంతగిరి సాహిత్య నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

మానకొండూర్ నియోజకవర్గ పరిధిలోని బెజ్జంకి, ఇల్లంతకుంట వ్యవసాయ మార్కెట్ కమిటీలకు నూతన పాలకవర్గాలు ఏర్పాటయ్యాయి. బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మాతంగి శిరీష, ఇల్లంతకుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అంతగిరి సాహిత్య నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.బెజ్జంకి ఏఎంసీ పాలకవర్గం బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా పర్శ సంతోష్ కుమార్ నియమితులయ్యారు. సభ్యులుగా జిల్లా రాజేశ్వరి, దేశరాజు అనిల్, నందికొండ తిరుపతిరెడ్డి, మైసంపల్లి తిరుపతి, ఇస్కిల్ల ఐలయ్య, జీల లింగం, రెడ్డి రామకృష్ణారెడ్డి, మహమ్మద్ సాదిక్, కుంట హరికృష్ణ, ఎలకంటి శ్రీనివాస్ రెడ్డి, బోయినపల్లి కృష్ణారావు, గుండా వెంకట్ రెడ్డిలను నియమించారు.వీరితో పాటు బెజ్జంకి పీఏసీఎస్ చైర్మన్, జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ అధికారి, ఏడీఏ, స్థానిక సర్పంచ్‌లతో కలిపి నూతన పాలకవర్గాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది.సభ్యులుగా జిల్లా రాజేశ్వరి, దేశరాజు అనిల్, నందికొండ తిరుపతిరెడ్డి, మైసంపల్లి తిరుపతి, ఇస్కిల్ల ఐలయ్య, జీల లింగం, రెడ్డి రామకృష్ణారెడ్డి, మహమ్మద్ సాదిక్, కుంట హరికృష్ణ, ఎలకంటి శ్రీనివాస్ రెడ్డి, బోయినపల్లి కృష్ణారావు, గుండా వెంకట్ రెడ్డిలను నియమించారు.ఇల్లంతకుంట ఏఎంసీ పాలకవర్గం ఇల్లంతకుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా జై భరత్ రెడ్డి నియమితులయ్యారు. సభ్యులుగా వి. మల్లయ్య, బడుగు లింగయ్య, వి. శ్రీనివాస్ రెడ్డి, జెట్టి మల్లేశం, మంద బాల్రెడ్డి, వెలిశాల జ్యోతి, బంగారి అంజయ్య, ఎరుకల తిరుపతి, జుట్టు నగేష్, ఎం. నవీన్ రెడ్డి, ఉప్పల వేణు, జి. శ్రీనివాస్ రెడ్డిలను నియమించారు.బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మాతంగి శిరీష, ఇల్లంతకుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అంతగిరి సాహిత్య నియమితులయ్యారు.ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.బెజ్జంకి ఏఎంసీ పాలకవర్గం బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా పర్శసంతోష్ కుమార్ నియమితులయ్యారు.సభ్యులుగా జిల్లా రాజేశ్వరి, దేశరాజు అనిల్, నందికొండ తిరుపతిరెడ్డి, సభ్యులుగా జిల్లా రాజేశ్వరి, దేశరాజు అనిల్, నందికొండ తిరుపతిరెడ్డి, మైసంపల్లి తిరుపతి, ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.వీరితో పాటు ఇల్లం తకుంట పీఏసీఎస్ చైర్మన్, జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ అధికారి, ఏడీఏ, స్థానిక సర్పంచ్ లతో నూతన పాలకవర్గాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇస్కిల్ల ఐలయ్య, జీలలింగం, రెడ్డి రామకృష్ణారెడ్డి, మహమ్మద్ సాదిక్, కుంట హరికృష్ణ, ఎలకంటి శ్రీనివాస్ రెడ్డి, బోయినపల్లి కృష్ణారావు, గుండా వెంకట్ రెడ్డిలను నియమించారు.వీరితో పాటు బెజ్జంకి పీఏసీఎస్ చైర్మన్, అనకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ పవన్ పల్లి సత్యనారాయణ ప్రోసీతో ప్రభుత్వం ఈ రెండు మార్కెట్ కమిటీలకు కొత్త పాలకవర్గాల ను ఏర్పాటు చేయడంపై ఆయా మండలాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నూతన పాలకవర్గాలు వ్యవసాయ మార్కెట్ల అభివృద్ధికి, రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని రైతులు, స్థానిక ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

# ఏపీలో ఘోర రోడ్డు ప్రమాదం.. నలుగురు భవానీ భక్తులు మృతి







ఏపీలోని కాకినాడ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదంచోటు చేసుకుంది. నడుచుకుంటున్న వెళ్తున్న భక్తుల మీద నుంచి వాహనం దూసుకెళ్లడంతో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషాదకర సంఘటన కత్తిపూడి రావికంపాడు జంక్షన్ దగ్గర ఘటన జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. కొంతమంది భక్తులు విజయనగరం జిల్లా డెంకాడ నుంచి విజయవాడ అమ్మవారి దర్శనానికి ఓ ప్రైవేట్ బస్సులో బయలుదేరారు. మార్గమధ్యలో బస్సు రిపేర్ కావడంతో నడుచుకుంటూ టీ తాగడానికి వెళ్తున్న భక్తులపై.. ఒక్కసారిగా స్కార్పియో వాహనం దూసుకెళ్లింది.దీంతో నలుగురు భక్తులు అక్కడికక్కడే మృతి చెందారు.నడుచుకుంటున్న వెళ్తున్న భక్తుల మీద నుంచి వాహనం దూసు కెళ్లడంతో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘ టన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను దవాఖా ను తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# నీళ్లులేక ఎండిన పంటలు.. జయశంకర్ జిల్లాలో యువరైతు వినూత్న నిరసన వీడియో



**జయశంకర్ భూపాలపల్లి :** రాష్ట్రంలో రైతులు అల్లాడిపోతున్నారు. నీళ్లులేక, కరెంట్ రాక పంటలను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. అయినా పంటలు ఎండిపోతుండటంతో ఆగ్రహించిన అన్నదాతలు వినూత్న పద్ధతుల్లో తమ నిరసన తెలియజేస్తున్నారు. తాజాగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఓ యువరైతు వినూత్న నిరసన తెలిపారు.గణపురం మండలం గొల్లపల్లిలో తన 3 ఎకరాల పొలంలో వరి పంట నీళ్లు లేక, కరెంటు రాక ఎండిపోవడంతో తన ద్విచక్ర వాహనంతో పొలంలో తిరుగుతూ ప్రవీణ్ అనే యువ రైతు నిరసన తెలిపాడు.తాజాగా జయశంకర్ భూపాలపల్లిఅయినా పంటలు ఎండిపోతుం డటంతో ఆగ్రహించిన అన్నదాతలు వినూత్న పద్ధతుల్లో తమ నిరసన తెలియజేస్తున్నారు. తాజాగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఓయువరైతు వినూత్న నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతులకు సాగునీరు లేక, కరెంటు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. లేదంటే ఆత్మహత్యే శరణ్యం అంటూ రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

# ఘనంగా డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రూబీ జూబ్లీ వేడుకలు

- 40వ వార్షికోత్సవ వేడుకలను అక్టోబర్ 26న నిర్వహణ
- ముఖ్య అతిథిగా భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్,గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరు
- డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి. చంద్రశేఖర్

**విజయవాడ, తేదీ: 23.10.2026 :** దేశంలోనే తొలి వైద్య విశ్వవిద్యాలయంగా ఏర్పాటైన డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం 40 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా రూబీ జూబ్లీ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి. చంద్రశేఖర్ వెల్లడించారు.నవంబర్ 1, 2026కి యూనివర్సిటీ ఏర్పాటై 40 వసంతాలు పూర్తి అయిన సందర్భంగా అక్టోబర్ 26 సోమవారం విజయవాడ లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కళావేదికలో ఈ ప్రతిష్ఠాత్మక వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. విజయవాడలోని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం సిల్వర్ జూబ్లీ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో రిజిస్ట్రార్ సాయి సుధీర్‌తో కలిసి వైస్ ఛాన్సలర్ వేడుకల వివరాలను వెల్లడించారు.ఈ సందర్భంగా డాక్టర్ పి. చంద్రశేఖర్ మాట్లాడుతూ... దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు దూరదృష్టితో 1986లో స్థాపించిన ఈ విశ్వవిద్యాలయం వైద్య విద్యారంగంలో దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఎన్టీఆర్ ఆలోచనతో ప్రారంభమైన ఈ విద్యా సంస్థ నాలుగు దశాబ్దాలుగా వైద్య, ఆరోగ్య విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తూ, అంచెలంచెలుగా విస్తరించిందని పేర్కొన్నారు.ఉపరాష్ట్రపతి ముఖ్య అతిథిగా హాజరు అక్టోబర్ 26న ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే రూబీ జూబ్లీ వేడుకలకు భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరవుతారని వైస్ ఛాన్సలర్ తెలిపారు. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) అధ్యక్షుడు డాక్టర్ ఎం.కె. రమేశ్ ప్రత్యేక ఆహ్వానితుడిగా హాజరవుతారని వెల్లడించారు.ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ తరఫున గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఉపరాష్ట్రపతికి విమానాశ్రయంలో స్వాగతం పలికి వేడుకలకు తీసుకువస్తారని వివరించారు. ఈ కార్యక్రమం సుమారు గంటా పది నిమిషాల పాటు కొనసాగుతుందని తెలిపారు.580 కి పైగా కళాశాలలకు అనుబంధ విశ్వ విద్యాలయం ప్రారంభంలో కొద్ది కళాశాలలతో ప్రారంభమైన డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నేడు 580 కి పైగా కళాశాలలకు అనుబంధంగా కొనసాగుతూ విశేష అభివృద్ధి సాధించిందని డాక్టర్ చంద్రశేఖర్ వివరించారు. విశ్వవిద్యాలయం పరిధిలో 18 ప్రభుత్వ, 20 ప్రైవేట్ వైద్య కళాశాలలు కలిపి మొత్తం 38 మెడికల్ కళాశాలలు ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా రెండు ప్రభుత్వ, 15 ప్రైవేట్ డెంటల్ కళాశాలలు, 280కి పైగా నర్సింగ్ కళాశాలలు, సుమారు 95 ఫిజియోథెరపీ కళాశాలలు అనుబంధంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఆయుష్ విభాగంలో ఆయుర్వేద, యునానీ, హోమియోపతి, నేచురోపతి కళాశాలలు కూడా వైద్య విద్యను అందిస్తున్నాయని తెలిపారు.40 ఏళ్ల ప్రస్థానాన్ని ప్రతిబింబించే ప్రత్యేక సావనీర్ విశ్వ విద్యాలయం నాలుగు దశాబ్దాల ప్రస్థానం, సాధించిన విజయాలు, వైద్య విద్యారంగానికి అందించిన సేవలను ప్రతిబింబించేలా ప్రత్యేక సావనీర్‌ను ఆవిష్కరించనున్నట్లు వైస్ ఛాన్సలర్ వెల్లడించారు. ఈ చారిత్రక వేడుకలకు అనుబంధ కళాశాలల నుంచి వెయ్యి మందికి పైగా వైద్య విద్యార్థులు, వివిధ విభాగాల అధిపతులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఇతర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు.వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు రిసెప్షన్, సావనీర్, ప్రోటోకాల్ తదితర విభాగాల్లో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అతిథుల ఆహ్వానం నుంచి కార్యక్రమ నిర్వహణ వరకు అన్ని ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేస్తున్నామని డాక్టర్ పి. చంద్రశేఖర్ తెలిపారు.వైద్య విద్యారంగంలో విశేష ప్రస్థానాన్ని కొనసాగిస్తున్న డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం 40 ఏళ్ల మైలురాయిని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ రూబీ జూబ్లీ వేడుకలు విశ్వవిద్యాలయ చరిత్రలో చిరస్మరణీయంగా నిలవనున్నాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ టి. సాయి సుధీర్, పరిశోధన మరియు అభివృద్ధి విభాగం డైరెక్టర్ . సూర్య ప్రభ,ప్రచురణల విభాగం డైరెక్టర్ డా. కె.సుధలు పాల్గొన్నారు.

# సాహసమే ఆయుధం అప్రమత్తతే రక్షణ

- అసమాన విన్యాసాలతో ఆకట్టుకున్న ఆక్టోపస్ కమాండోలు
- పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక ప్రదర్శన
- ఉగ్రవాద ముప్పులను ఎదుర్కొనేందుకు కమాండోల ప్రత్యేక శిక్షణా నైపుణ్యాల ప్రదర్శన




**విజయవాడ, అక్టోబర్ 23, 2026 :** పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా, ఆంధ్రప్రదేశ్ పోలీస్‌కు చెందిన ప్రత్యేక ఉగ్రవాద నిరోధక దళం ఆక్టోపస్ (ఆక్టోపస్) ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడలోని వీరమాచనేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో ఓపెన్ హౌస్, ప్రత్యేక సామర్థ్య ప్రదర్శన నిర్వహించారు. ఆక్టోపస్ ఆపరేషన్స్ ఐజీ సీహెచ్ శ్రీకాంత్ ఐపీఎస్ సూచనలు, దిశానిర్దేశంతో జరిగిన ఈ కార్యక్రమంలో ద్వారా ఆక్టోపస్ దళ వృత్తిపరమైన నైపుణ్యం, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే సామర్థ్యం, నిరంతర శిక్షణ, క్రమశిక్షణ, సమన్వయం, ప్రజల భద్రత పట్ల దళానికి ఉన్న నిబద్ధతను ప్రదర్శించారు. కార్యక్రమంలో భాగంగా ఉగ్రవాద దాడి, భవనంలో బందీలుగా ఉన్న వ్యక్తుల రక్షణ, అత్యవసర పరిస్థితుల్లో ప్రత్యేక దళాలు చేపట్టే చర్యలను అనుకరిస్తూ వివిధ ప్రదర్శనలు నిర్వహించారు. భవనాలపైకి తాళ్ల సహాయంతో చేరుకోవడం, మాన్యువల్ క్లైంబింగ్, స్పీడ్ రాపెల్లింగ్, అబ్సెలింగ్, స్పైడర్ టెక్నిక్, వాల్ డ్రాప్, స్లైడింగ్ విత్ మిడిల్ డ్రాప్ వంటి ప్రత్యేక నైపుణ్యాలను కమాండోలు ప్రదర్శించారు. అలాగే, వాహనంలో బందీలుగా ఉన్న వ్యక్తులను రక్షించేందుకు చేపట్టే చర్యలను వివరించే సిమ్యులేటెడ్ సెడాన్ అసాల్ట్ ప్రదర్శన నిర్వహించారు. భవనాల్లో ఉగ్రవాద ముప్పును ఎదుర్కొనే క్రమంలో ప్రత్యేక బృందాల సమన్వయం, వేగవంతమైన స్పందన, శిక్షణ మరియు క్రమశిక్షణ ఎంత ముఖ్యమో ఈ ప్రదర్శనలు తెలియజేశాయి.బాంబు నిర్వీర్యకరణ పరికరాల ప్రదర్శన: ఆక్టోపస్ బాంబు నిర్వీర్యకరణ బృందం (బీడీడీఎస్) అనుమానాస్పద పేలుడు పదార్థాన్ని గుర్తించడం, పరిశీలించడం, సురక్షితంగా నిర్వీర్యం చేసే ప్రక్రియను ప్రదర్శించింది. ఈ సందర్భంగా రిమోట్ ఆపరేటెడ్ వెహికల్ (ఆర్‌వోవీ/ఎంఆర్‌వోవీ), వాటర్ జెట్ డిస్రప్టర్ వంటి ప్రత్యేక పరికరాల వినియోగాన్ని వివరించారు. పేలుడు పదార్థాల నిర్వీర్యకరణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సురక్షిత విధానాలు మరియు శిక్షణ పొందిన సిబ్బంది పాత్రను ఈ ప్రదర్శన ద్వారా తెలియజేశారు.క్లోజ్ క్వార్టర్ కాంబాట్, కే9 ప్రదర్శన:కమాండోలు క్లోజ్ క్వార్టర్ కాంబాట్‌కు సంబంధించిన నైపుణ్యాలను ప్రదర్శించారు. అనంతరం ప్రత్యేక శిక్షణ పొందిన పోలీస్ కే9 డాగ్స్ ద్వారా అడ్డంకులను అధిగమించడం, హ్యాండ్లర్లతో సమన్వయం మరియు అత్యవసర పరిస్థితుల్లో రక్షణ చర్యలకు సంబంధించిన ప్రదర్శనలు నిర్వహించారు. ఈ ప్రదర్శనలు పోలీస్ సిబ్బంది, ప్రత్యేక శిక్షణ పొందిన కుక్కల మధ్య ఉన్న సమన్వయం, నైపుణ్యం, నిరంతర సాధన యొక్క ప్రాముఖ్యతను చాటిచెప్పాయి. ఆక్టోపస్ దళం గతంలో నిర్వహించిన వివిధ ఆపరేషన్లతో పాటు జాతీయ స్థాయి పోటీల్లో కూడా తన ప్రతిభను చాటుకుంది. 2013 లో చిత్తూరు జిల్లాలో జరిగిన ఆపరేషన్ పుట్టూర్, 2025లో రాయచోటి వద్ద నిర్వహించిన బాంబు నిర్వీర్యకరణ చర్యలు, విజయవాడలో నిర్వహించిన ఆపరేషన్ రెడ్ వెబ్ వంటి ఘటనలను కార్యక్రమ ప్రసంగంలో ప్రస్తావించారు.అదేవిధంగా, జాతీయ స్థాయి స్నైపర్ పోటీలు, నేషనల్ జాయింట్ కౌంటర్ టెర్రరిస్ట్ ఎక్స రసైజ్, జాయింట్ కౌంటర్ ఎక్సర్‌సైజ్ లలో ఆక్టోపస్ సాధించిన విజయాలు మరియు అంతర్జాతీయ స్థాయి పోలీస్ ఫైరింగ్ పోటీల్లో సాధించిన పతకాలను కూడా వివరించారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యం: ఆక్టోపస్ నిర్వహించిన ఈ ఓపెన్ హౌస్ మరియు సామర్థ్య ప్రదర్శన ద్వారా విద్యార్థులకు ప్రత్యేక పోలీస్ దళాల విధులు, ఉగ్రవాద నిరోధక చర్యలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే విధానాలు మరియు ఆధునిక పరికరాల వినియోగం గురించి అవగాహన కల్పించారు. నిరంతర శిక్షణ, క్రమశిక్షణ, ధైర్యం సమన్వయం, వృత్తిపరమైన నైపుణ్యాలే ప్రత్యే క దళాల సామర్థ్యానికి పునాదులని ఈకార్యక్రమం చాటిచెప్పింది.

ప్రజల భద్రతను పరిరక్షించడం, ఉగ్రవాద ముప్పులను సమర్థవంతంగా ఎదుర్కోవడం మరియు అత్యవసర పరిస్థితుల్లో స మన్వయంతో స్పందించడం కోసం ఆంధ్రప్రదేశ్ పోలీస్ ఆక్టోపస్ దళం నిరంతరం సిద్ధంగా ఉంటుందని కార్యక్రమం ద్వారా తెలియజేశారు .

# స్థానిక సంస్థలు ఎన్నికల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలను పకడ్బందీగా ఏర్పాటు చేయాలి

- రిసెప్షన్ సెంటర్లు, పోలింగ్ స్టేషన్లు, స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాళ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ.
- భద్రత, బారికేడింగ్, సీసీ కెమెరాలు, విద్యుత్ సదుపాయాలు, సిబ్బంది రాకపోకలకు ప్రత్యేక మార్గాలపై అధికారులకు సూచనలు




**నందిగామ మైలవరం :అక్టోబర్ 23 2026 :** స్థానిక సంస్థలు ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సంబంధిత అధికారులను ఆదేశించారు. దీనిలో భాగంగా జగ్గయ్యపేట ఎస్.జి.ఎస్ కళాశాల యూజీసీ బ్లాక్, కంచికచర్ల, మార్కెట్ యార్డ్, కొండపల్లి జెడ్పీ పాఠశాల తదితర ప్రాంతాల్లో ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా రిసెప్షన్ సెంటర్లు, పోలింగ్ స్టేషన్లు, స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాళ్లను రెవెన్యూ, పోలీస్ శాఖల సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత భవన సముదాయాలు, వాటి ప్రాంగణాలు, కౌంటింగ్ హాళ్లు, గదుల్లో చేపడుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. కౌంటింగ్ లేదా స్ట్రాంగ్ రూములుగా వినియోగించనున్న గదుల్లో నేలపై ఏర్పాటు చేసిన నంబర్డ్ గ్రిడ్లు, మార్కింగ్‌లను పరిశీలించి, కౌంటింగ్ ప్రక్రియకు అనువుగా ఏర్పాట్లు ఉండేలా తగిన సూచనలు చేశారు. భవన ప్రాంగణంలో బారికేడింగ్, టేబుళ్ల ఏర్పాటు, సిబ్బంది విధుల నిర్వహణకు అవసరమైన స్థలం, రాకపోకలకు అనువైన మార్గాలపై అధికారులతో చర్చించారు. కౌంటింగ్ హాళ్లలో ఒక్కో విభాగం, వరుసకు అవసరమైన టేబుళ్ల సంఖ్య, టేబుళ్ల మధ్య ఉండాల్సిన దూరం, అధికారులు, సిబ్బంది సులభంగా రాకపోకలు సాగించేందుకు అవసరమైన మార్గాలపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ క్రమంలో అధికారులు సిద్ధం చేసిన లేఅవుట్ మ్యాప్‌లు, నివేదిక పత్రాలను పరిశీలిస్తూ గదుల కొలతలు, ప్రవేశ ద్వారాలు, నిష్క్రమణ ద్వారాలు, భద్రతాపరమైన అంశాలను అంచనా వేశారు. కౌంటింగ్ ప్రక్రియ సజావుగా, క్రమబద్ధంగా నిర్వహించేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని సూచించారు. పోలింగ్ స్టేషన్లు,కౌంటింగ్ హాళ్లు ఉన్న ప్రాంగణాల్లో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది, ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా ప్రాంగణాల్లో తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. అవసరమైన ఇతర సౌకర్యాలను ముందుగానే గుర్తించి, వాటి ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. స్ట్రాంగ్ రూముల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సూచించారు. స్ట్రాంగ్ రూమ్ ప్రవేశ ద్వారం స్పష్టంగా కనిపించేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భద్రతాపరమైన ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. అలాగే భవనాల చుట్టూ, కౌంటింగ్ కేంద్రాల లోపల బారికేడింగ్, ఫెన్సింగ్ ఏర్పాట్లను ఇప్పటి నుంచే ప్రారంభించి, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సంబంధిత ప్రాంతాల్లో భద్రతా నియంత్రణకు అనువుగా ఏర్పాట్లు ఉండేలా పోలీస్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కౌంటింగ్ హాళ్లలోకి ప్రవేశించే కౌంటింగ్ అధికారులు, సిబ్బంది, ఏజెంట్ల కోసం వేర్వేరు ప్రవేశ మార్గాలను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.రాకపోకల సమయంలో రద్దీ ఏర్పడకుండా, విధుల నిర్వహణకు ఆటంకం కలగకుండా ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను ముందుగానే గుర్తించి తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేసి, భద్రత, మౌలిక సదుపాయాలు, కౌంటింగ్ హాళ్ల లేఅవుట్ వంటి అంశాల్లో నిర్దేశిత ప్రమాణాలను పాటించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సంబంధిత అధికారులకు సూచించారు.ఈ సందర్భంలో నందిగామ ఆర్డీవో జి.అనిల్ కుమార్, విజయవాడ ఆర్డీవో వెన్నెల శ్రీను, జగ్గయ్యపేట తహసిల్దార్ ఎస్.శిరీష, మున్సిపల్ కమిషనర్ దుర్గాప్రసాద్, ఎంపీడీవో అరుణ, కంచికచర్ల తహసిల్దార్ నరసింహారావు, ఇబ్రహీంపట్నం తహసిల్దార్

# తెలంగాణ ముఖ్యమంత్రి సమక్షంలో ఇతర రాష్ట్రాల పోలీసు అధికారులతో సమన్వయ సమావేశం ప్రారంభం




దక్షిణ భారతదేశాన్ని అత్యంత సురక్షిత ప్రాంతంగా మార్చేందుకు, దక్షిణ రాష్ట్రాలన్నీ సమన్వయంతో కలిసి పనిచేయాలని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సహకారాన్ని పెంపొందించేందుకు, తెలంగాణకు చెందిన సాంకేతిక మౌలిక సదుపాయాలను మరియు 'ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్' వ్యవస్థను పొరుగు రాష్ట్రాలతో పంచుకోవడానికి తెలంగాణ సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. హైదరాబాద్‌లోని 'ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్'లో దక్షిణ రాష్ట్రాల సీనియర్ పోలీసు అధికారుల సమన్వయ కమిటీ సమావేశాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా, తెలంగాణ అనుసరిస్తున్న పోలీసింగ్ వ్యూహాలను వివరించిన ఆయన, నేరరహిత ప్రాంతాన్ని సృష్టించేందుకు అంతర్-రాష్ట్ర సమన్వయం ఎంత అవసరమో నొక్కి చెప్పారు.సమావేశంలో పాల్గొన్న వారిని ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "ఏ ఒక్క రాష్ట్రం కూడా కేవలం తమ సొంత వనరులు, ప్రయత్నాలతోనే నేరరహితంగా మారడం సాధ్యం కాదు. అన్ని రాష్ట్రాల పోలీసు విభాగాల మధ్య సమన్వయం చాలా కీలకం. ఈ సదస్సులో కీలక అంశాలపై సమగ్ర చర్చలు జరిగి, ఒక బలమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందాలి" అని అన్నారు. ? "దక్షిణ భారతదేశాన్ని సురక్షిత ప్రాంతంగా మార్చడం, నేరాల రేటును కనిష్ట స్థాయికి తగ్గించడం మనందరి సామూహిక బాధ్యత. వివిధ రాష్ట్రాల పోలీసు ప్రధాన కార్యాలయాల మధ్య, రాష్ట్ర సరిహద్దులను దాటి అతుకులు లేని సమన్వయం ఉండేలా పటిష్టమైన వ్యవస్థలను ఏర్పాటు చేయాలి.""సాంకేతిక మౌలిక సదుపాయాలు మరియు 'ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్' వ్యవస్థ విషయంలో సహకరించడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. దక్షిణ భారతదేశాన్ని సురక్షిత ప్రాంతంగా మార్చేందుకు మనమంతా కలిసి పనిచేద్దాం" అని ఆయన కోరారు. భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు, ఈ సదస్సులో అర్థవంతమైన మరియు నిర్మాణాత్మక చర్చలు జరుగుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ? "పోలీసు వ్యవస్థ సమర్థవంతంగా పనిచేయాలని, భద్రతను కల్పించాలని, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని మరియు నైతిక విలువలను కాపాడాలని ప్రజలు ఆశిస్తారు. ప్రభుత్వం పోలీసు వ్యవస్థకు సమకూర్చే వనరులను నేను కేవలం ఖర్చుగా కాకుండా, మెరుగైన సమాజాన్ని నిర్మించడానికి మరియు పౌరుల భద్రతను చేయడానికి చేసే పెట్టుబడిగా భావిస్తాను. అవసరమైనప్పుడు సంస్కరణలను ప్రవేశపెట్టడానికి నేను కట్టుబడి ఉన్నాను. నేరాల స్వభావం నిరంతరం మారుతున్న నేటి కాలంలో, (రాష్ట్ర స్థాయి పోలీస్/ప్రజా సమన్వయ కేంద్రాలు) వంటి వేదికలు ఎంతో కీలకం. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పోలీసు వ్యవస్థ తనను తాను మార్చుకోవాలి; పోలీసు వ్యవస్థలో సంస్కరణలు అనేవి నిరంతర ప్రక్రియగా కొనసాగాలి." "తెలంగాణ పోలీసు విభాగంలో అమలు చేసిన పలు సంస్కరణలు సానుకూల ఫలితాలను ఇచ్చాయి. మాదకద్రవ్యాల నియంత్రణ, సైబర్ నేరాల అదుపు, మరియు వామపక్ష తీవ్రవాదం (నక్సలిజం) వల్ల కలిగే హింసను అంతం చేయడంలో తెలంగాణ పోలీసు విభాగం అద్భుతమైన పనితీరును కనబరిచి, జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది.ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు, హైదరాబాద్ మహానగర ప్రాంతంలోని పోలీసు వ్యవస్థను హైదరాబాద్, సైబరాబాద్ మరియు మల్కాజిగిరి అనే మూడు ప్రత్యేక కమిషనరేట్లుగా పునర్వ్యవస్థీకరించడం జరిగింది. ఈ పునర్వ్యవస్థీకరణ వల్ల, ఆయా పోలీస్ కమిషనర్లు తమ పరిధిలోని భౌగోళిక ప్రాంతాలపై మరింత సమర్థవంతంగా దృష్టి సారించే అవకాశం ఏర్పడింది, దీని ఫలితంగా మెరుగైన ఫలితాలు వస్తున్నాయి. అంతేకాకుండా, నిర్దిష్ట రకాల నేరాలను ఎదుర్కోవడానికి మేము మరియు వంటి ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేశాము." ? నేటి కాలంలో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా మరియు ట్రాఫిక్ నిర్వహణ వంటివి ప్రధాన సమస్యలుగా మారాయి. ప్రత్యేక విభాగాలపై దృష్టి సారించడం, సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించడం మరియు కఠినమైన శిక్షణ ద్వారా మనం అద్భుతమైన ఫలితాలను సాధించవచ్చు. సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. రాష్ట్రంలో నక్సలిజం కార్యకలాపాలను పూర్తిగా నిర్మూలించేందుకు తెలంగాణ పోలీసులు చేసిన కృషిని కేంద్ర హోంమంత్రి అభినందించారని, ప్రధాన మంత్రి అధ్యక్షతన జరిగిన 'ప్రగతి' సమీక్షా సమావేశంలో కూడా ఈ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారని ముఖ్యమంత్రి గుర్తు చేశారు.

మాదకద్రవ్యాల నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన విభాగం, తన పనితీరుకు గాను కేంద్ర ప్రభుత్వం నుండి 80% కంటే ఎక్కువ స్కోరును సాధించింది. అంతేకాకుండా, సైబర్ నేరాల బాధితులు కోల్పోయిన సొమ్మును తిరిగి ఇప్పించడంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో కొత్త ప్రమాణాలను నెలకొల్పింది.ఆహార కల్తీని అరికట్టడానికి మరియు ఔషధాల నియంత్రణను బలోపేతం చేయడానికి, అమెరికాలోని ' తరహాలో అనే కొత్త సమన్వయ విభాగం ప్రారంభించబడింది.తెలంగాణలో ప్రారంభించిన (హైడ్రా) అనే కార్యక్రమం, సరస్సులు మరియు జలవనరులను పరిరక్షించి, వాటికి పూర్వ వైభవాన్ని తీసుకురావడం ద్వారా ప్రజల మద్దతును పొందుతోంది. అదే సమయంలో, ప్రభుత్వ మరియు ప్రజా ఆస్తులను కాపాడేందుకు ఇది అవిశ్రాంతంగా కృషి చేస్తోంది. ? హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ విభాగంలో ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్‌జెండర్ వ్యక్తులను నియమించిన దేశంలోని మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది."ప్రజల భద్రత కోసం పోలీసు సిబ్బంది తరచుగా తమ ప్రాణాలను పణంగా పెడుతుంటారు. పోలీసు బలగాల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుంది. విధి నిర్వహణలో ఉన్న పోలీసు సిబ్బంది ఎదుర్కొనే ప్రధాన సమస్యలలో ఒకటి..."

# మూడేండ్లయినా ముచ్చట లేదు.. ఊసే లేని హనుమకొండ కొత్త బస్ స్టేషన్ నిర్మాణం



**హనుమకొండ, అక్టోబర్ 22 :** వరంగల్ రెండో రాజధాని అని మంత్రులు పదేపదే చెబుతున్న ప్రకటనలకు, అభివృ ద్ధిలో ప్రభుత్వ తీరుకు పొంతన కుదరడం లేదు. రవాణాలో కీలకమైన హనుమకొండ బస్ స్టేషన్ కొత్త భవనం నిర్మాణంలో కాంగ్రెస్ సర్కారు నిర్ల క్ష్యంగా వ్యవహరిస్తున్నది. ప్రతి రోజూ 3 లక్షల మంది రాకపోకలు సాగించే ఈ బస్టాండ్ కొత్త భవన నిర్మాణాన్ని పట్టించుకోవడంలేదు. అధికారంలోకి వచ్చి మూడేండ్లు పూర్తవుతున్నా ఒక్క ఇటుకైనా పెట్టలేదు. దీని నిర్మాణం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.83 కోట్లు మంజూరు చేసింది. 2023 అక్టో బర్లో అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పనులు మొదలు కాలేదు. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. మూడేండ్లు పూర్తవుతున్నా దాని ముచ్చటే మరిచింది.పట్టించుకోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలుఉమ్మడి జిల్లాలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పట్టించుకోకపోవడంతో హనుమకొండ బస్టేషన్ కొత్త భవన నిర్మాణ పనులు మొదలు కావడంలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మొదలుపెట్టిన పనులను పూర్తి చేసే విషయంలోనూ కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తు న్నది. అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు లేదు. పాత పనులను పూర్తి చేసేందుకు మంజూరైన నిధులను విడుదల చేయడం లేదు. లక్షల మంది ప్రయాణికులతో కిక్కిరిసిపోయే హనుమకొండ బస్ స్టేషన్ ప్రస్తుతం దయనీయంగా ఉన్నది. ఎలాంటి వసతులు లేక ప్రయాణికులు ఇబ్బంది. పడుతున్నారు. మహిళా ప్రయాణికులు అవస్థలు చెప్పలేని విధంగా ఉన్నాయి. టాయిలెట్స్ వసతి లేదు. తాగునీరు అసలే ఉండడం లేదు. పండుగ సమయాల్లో రోజువారీ కంటే రెట్టింపు సంఖ్యలో ప్రయాణికులు వస్తుం టారు. బస్సుల కోసం నిల్చునేందుకు వారికి స్థలం సరిపోవడం లేదు. శిథి లావస్థలో ఉన్న ప్రస్తుత భవనానికి మరమ్మతులు చేసినా ఉపయోగం ఉండ దని, కొత్తది నిర్మిస్తేనే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని అధికారులు చెబుతున్నారు. వాటి నిర్మాణ పనులు అస్సలు మొదలు కావడంలేదు.హనుమకొండ బస్ స్టేషన్ ప్రస్తుత భవనం 1974లో ప్రారంభ మైంది. 16 ఎకరాల విస్తీర్ణం ఉన్నా భవనం చిన్నగా ఉండడంతో రద్దీకి అనుగుణంగా వసతులు లేవు. 1990లో మరో కొత్త భవనాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ప్రయాణికులు వేల రెట్లు, పెరిగాయి.

నేటి చర్చ
జాతీయ తెలుగు దిన పత్రిక
శనివారం,
అక్టోబర్ 24, 2026



# తొలి వన్డేలో భారత బౌలర్ల జోరు




## జింబాబ్వే 197 పరుగులకే ఆలౌట్.. శ్రీ చరణి నాలుగు వికెట్లతో మెరుపులు

**వడోదర:** ఇప్పటికే టీ20 సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన భారత జట్టు, వన్డే సిరీస్‌పైనా ఆధిపత్యం సాధించాలనే లక్ష్యంతో బరిలోకి దిగింది. మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భాగంగా జరిగిన తొలి పోరులో భారత బౌలర్లు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. సమష్టిగా రాణించిన బౌలింగ్ దళం జింబాబ్వే బ్యాటర్లను కట్టడి చేయడంతో ప్రత్యర్థి జట్టు 49.5 ఓవర్లలో 197 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో భారత్ ముందు 198 పరుగుల లక్ష్యం నిలిచింది. ముఖ్యంగా తెలుగు అమ్మాయి శ్రీ చరణి నాలుగు వికెట్లు పడగొట్టి జింబాబ్వే బ్యాటింగ్ పతనంలో కీలక పాత్ర పోషించింది. **శ్రీ చరణి సూపర్ బౌలింగ్** భారత బౌలర్లలో శ్రీ చరణి అద్భుతమైన బౌలింగ్‌తో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కేవలం 23 పరుగులిచ్చి నాలుగు వికెట్లు పడగొట్టిన ఆమె ప్రత్యర్థి జట్టు పరుగుల వేగాన్ని నియంత్రించడమే కాకుండా కీలక బ్యాటర్లను పెవిలియన్‌కు పంపింది. జింబాబ్వే బ్యాటర్లు నిలదొక్కుకునే ప్రయత్నం చేసిన ప్రతిసారీ భారత బౌలర్లు ఒత్తిడి పెంచుతూ వికెట్లు సాధించారు. శ్రీ చరణి ప్రదర్శనకు తోడు మిగతా బౌలర్లు కూడా సమర్థంగా సహకరించడంతో జింబాబ్వే జట్టు భారీ స్కోరు సాధించలేకపోయింది. **క్రాంతి గౌడ్ సైతం కీలక పాత్ర** భారత బౌలింగ్‌లో క్రాంతి గౌడ్ కూడా తనదైన ముద్ర వేసింది. 42 పరుగులిచ్చి మూడు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి జట్టు బ్యాటింగ్ క్రమాన్ని దెబ్బతీసింది. మరోవైపు దీప్తి శర్మ రెండు వికెట్లు తీసి జింబాబ్వేపై ఒత్తిడి పెంచగా, షఫాలీ వర్మకు ఒక వికెట్ దక్కింది. ఈ విధంగా భారత బౌలర్లు సమష్టిగా రాణించి జింబాబ్వేను తక్కువ స్కోరుకే పరిమితం చేశారు. **బెలోవెడ్ బిజా అర్ధశతకం** టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే జట్టులో బెలోవెడ్ బిజా 62 పరుగులతో ఆకట్టుకుంది. ఆమె అర్ధశతకంతో జట్టుకు కొంత ఊరట లభించింది. మిచెల్లె మవుంగ 29 పరుగులు, మోడెస్టర్ ముపచిక్వా 25 పరుగులు, చిపో ముగేరి 21 పరుగులు చేసి తమ వంతు సహకారం అందించారు. అయితే మిగతా బ్యాటర్లు ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోవడంతో జింబాబ్వే ఇన్నింగ్స్ 49.5 ఓవర్లలో 197 పరుగుల వద్ద ముగిసింది. **భారత్ లక్ష్యం 198 పరుగులు** తొలి ఇన్నింగ్స్‌లో భారత బౌలర్లు ఆధిపత్యం ప్రదర్శించడంతో జింబాబ్వేను 197 పరుగులకే పరిమితం చేయగలిగారు. ఇప్పుడు 198 పరుగుల లక్ష్యాన్ని ఛేదించాల్సిన బాధ్యత భారత బ్యాటర్లపై ఉంది. టీ20 సిరీస్‌లో చూపిన జోరును వన్డేల్లోనూ కొనసాగించి తొలి మ్యాచ్‌లో విజయం సాధించాలని భారత జట్టు లక్ష్యంగా పెట్టుకుంది. బౌలర్లు అందించిన అవకాశాన్ని బ్యాటర్లు ఎలా సద్వినియోగం చేసుకుంటారన్నది కీలకంగా మారింది.

# అనూహ్యంగా భారత జట్టులోకి వైభవ్ సూర్యవంశీ!

## - అతి పిన్న వయసులోనే అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం.. యువ సంచలనంపై భారీ అంచనాలు



**న్యూఢిల్లీ:** భారత క్రికెట్‌లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ పేరు మరోసారి మార్మోగుతోంది. తన అసాధారణ బ్యాటింగ్ ప్రతిభతో అతి తక్కువ కాలంలోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ యువ ఆటగాడు జాతీయ జట్టులో చోటు సంపాదించి అందరి దృష్టిని ఆకర్షించాడు. చిన్న వయసులోనే అద్భుతమైన షాట్లతో బౌలర్లను ఇబ్బంది పెట్టగల సామర్థ్యం కలిగిన వైభవ్‌పై క్రికెట్ అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. అతడి ఆటతీరు, పరుగులు సాధించే వేగం, ఒత్తిడిలోనూ దూకుడుగా ఆడే విధానం భవిష్యత్తులో భారత క్రికెట్‌కు మంచి అవకాశాలను సూచిస్తున్నాయి. **చిన్న వయసులోనే సంచలన ప్రదర్శనలు** వైభవ్ సూర్యవంశీ అతి చిన్న వయసులోనే క్రికెట్ ప్రపంచం దృష్టిని ఆకర్షించాడు. యువ క్రికెట్ పోటీల్లో అద్భుతమైన ప్రదర్శనలు చేయడంతో పాటు, దేశవాళీ క్రికెట్‌లోనూ తన ప్రతిభను చాటుకున్నాడు. ముఖ్యంగా భారీ షాట్లు ఆడటంలో అతడికి ఉన్న నైపుణ్యం, వేగంగా పరుగులు సాధించే సామర్థ్యం అతడిని ఇతర యువ ఆటగాళ్ల నుంచి ప్రత్యేకంగా నిలబెట్టాయి. ప్రత్యర్థి జట్టు బౌలర్లపై ఒత్తిడి పెంచుతూ దూకుడుగా ఆడటం అతడి ప్రధాన బలంగా మారింది. **ఐపీఎల్‌లోనూ అదరగొట్టిన యువ ఆటగాడు** ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో వైభవ్ ప్రదర్శనలు అతడి ప్రతిభను మరింత వెలుగులోకి తీసుకొచ్చాయి. అనుభవజ్ఞులైన బౌలర్లను ఎదుర్కొంటూ ధైర్యంగా బ్యాటింగ్ చేయడం ద్వారా అభిమానులను ఆకట్టుకున్నాడు. తక్కువ బంతుల్లోనే ఎక్కువ పరుగులు సాధించగల సామర్థ్యం అతడికి ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టింది. ఐపీఎల్‌లో లభించిన అనుభవం అతడి ఆత్మవిశ్వాసాన్ని పెంచడంతో పాటు, ఉన్నత స్థాయి క్రికెట్‌కు సిద్ధమయ్యేందుకు దోహదపడింది. **భారత జట్టులో అవకాశంతో కొత్త అధ్యాయం** జాతీయ జట్టులో చోటు సంపాదించడం ప్రతి క్రికెటర్ కల. వైభవ్ సూర్యవంశీకి చిన్న వయసులోనే ఈ అవకాశం లభించడం అతడి ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తోంది. అయితే అంతర్జాతీయ క్రికెట్‌లో నిలదొక్కుకోవాలంటే ప్రతిభతో పాటు నిలకడ, పరిస్థితులకు అనుగుణంగా ఆడే నైపుణ్యం, మానసిక దృఢత్వం కూడా అవసరం. జట్టు యాజమాన్యం అతడికి ఎప్పుడు, ఏ విధంగా అవకాశం కల్పిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. **అభిమానుల్లో భారీ అంచనాలు** వైభవ్ సూర్యవంశీ ఆటతీరుపై అభిమానులు ఆశలు పెట్టుకున్నారు. అతడు తన సహజమైన దూకుడును కొనసాగిస్తూ జట్టు అవసరాలకు అనుగుణంగా ఆడగలిగితే భారత క్రికెట్‌లో మరింత ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. అయితే యువ ఆటగాడిపై అతిగా అంచనాలు పెట్టకుండా, అనుభవం సంపాదించేందుకు తగిన సమయం ఇవ్వడం కూడా అంతే ముఖ్యం.

# భల్లెం విసురులో హనీకి స్వర్ణ పతకం

## - ప్రపంచ రికార్డు బద్దలు.. 60.49 మీటర్ల దూరం విసిరి అగ్రస్థానం కైవసం



**నాగోయా:** ఆసియా దివ్యాంగుల క్రీడల్లో భారత క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరుస్తున్నారు. పురుషుల భల్లెం విసురు పోటీలో భారత క్రీడాకారుడు హనీ స్వర్ణ పతకాన్ని సాధించి దేశ కీర్తిని చాటాడు. చివరి ప్రయత్నంలో ఏకంగా 60.49 మీటర్ల దూరం భల్లెం విసిరి సరికొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. ఈ అద్భుత ప్రదర్శనతో ప్రత్యర్థులను వెనక్కి నెట్టి అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. **చివరి ప్రయత్నంలో ప్రపంచ రికార్డు** పోటీ ఆరంభం నుంచే హనీ మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ప్రతి ప్రయత్నంలోనూ తన ప్రతిభను చాటుతూ ముందుకు సాగాడు. ఐదో ప్రయత్నంలో 59.72 మీటర్ల దూరం భల్లెం విసిరిన హనీ, చివరి ప్రయత్నంలో మరింతగా సత్తా చాటాడు. ఏకంగా 60.49 మీటర్ల దూరం విసిరి ప్రపంచ రికార్డును తిరగరాశాడు. ఈ ప్రదర్శనతో స్వర్ణ పతకాన్ని అందుకోవడంతో పాటు భారత క్రీడా ప్రతిష్ఠను అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టాడు. **కాంస్యం నుంచి స్వర్ణం వరకు** హనీ ఈ క్రీడా పోటీల్లో వరుసగా పతకాలు సాధిస్తూ సత్తా చాటుతున్నాడు. పురుషుల చక్రం విసురు పోటీలో 57.04 మీటర్ల దూరం విసిరి కాంస్య పతకాన్ని సాధించాడు. తాజాగా భల్లెం విసురులో ప్రపంచ రికార్డుతో స్వర్ణ పతకాన్ని గెలుచుకున్నాడు. రెండు విభాగాల్లోనూ తన ప్రతిభను చాటిన హనీ ప్రదర్శన క్రీడాభిమానులను ఆకట్టుకుంటోంది. **భారత క్రీడాకారుల పతకాల జోరు** ఆసియా దివ్యాంగుల క్రీడల్లో భారత క్రీడాకారులు పతకాల వేట కొనసాగిస్తున్నారు. పురుషుల 400 మీటర్ల పరుగు పోటీలో సందీప్ ప్రపంచ రికార్డుతో స్వర్ణ పతకాన్ని సాధించాడు. మరో భారత క్రీడాకారుడు అజయ్ కుమార్ కాంస్య పతకాన్ని దక్కించుకున్నాడు. సందీప్ 52.28 సెకన్లలో గమ్యాన్ని చేరగా, అజయ్ కుమార్ 53.61 సెకన్లలో పరుగు పూర్తి చేశాడు. ఈ విజయాలతో భారత పతకాల సంఖ్య వంద దాటింది. **దేశానికి గర్వకారణంగా క్రీడాకారులు** వైకల్యాలను అధిగమించి అంతర్జాతీయ వేదికలపై భారత క్రీడాకారులు సాధిస్తున్న విజయాలు దేశానికి గర్వకారణంగా నిలుస్తున్నాయి. నిరంతర సాధన, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో వారు ప్రపంచ రికార్డులను తిరగరాస్తున్నారు. హనీ సాధించిన స్వర్ణ పతకం దేశవ్యాప్తంగా యువ క్రీడాకారులకు స్ఫూర్తినివ్వనుంది. భవిష్యత్తులోనూ మరిన్ని అంతర్జాతీయ పోటీల్లో భారత క్రీడాకారులు విజయాలు సాధించాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

# ఇషాన్ కిషన్‌కు గాయం.. రెండో టీ20కి దూరం!

## న్యూజిలాండ్‌తో పోరుకు అందుబాటులో లేని భారత వికెట్ కీపర్.. వైభవ్ సూర్యవంశీకి జట్టులో చోటు దక్కే అవకాశం



**క్రైస్ట్‌చర్చ్:** న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తొలి టీ20లో గాయపడిన భారత వికెట్ కీపర్, బ్యాటర్ ఇషాన్ కిషన్ రెండో టీ20 మ్యాచ్‌కు దూరమయ్యాడు. కుడి తొడ లోపలి కండరానికి స్వల్ప గాయం కావడంతో అతడు ఈ మ్యాచ్‌లో ఆడటం లేదని భారత క్రికెట్ నియంత్రణ మండలి వెల్లడించింది. ప్రస్తుతం వైద్య బృందం అతడి గాయం తీవ్రతను పరిశీలిస్తూ, కోలుకునే పరిస్థితిని పర్యవేక్షిస్తోంది. ఇషాన్ గాయం కారణంగా రెండో టీ20లో భారత తుది జట్టు కూర్పులో మార్పులు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. **తొలి మ్యాచ్‌లోనే గాయం** న్యూజిలాండ్‌తో గురువారం జరిగిన తొలి టీ20లో ఇషాన్ కిషన్ గాయానికి గురయ్యాడు. ఈ మ్యాచ్‌లో అతడు సాధారణంగా ఆడే స్థానంలో కాకుండా ఐదో స్థానంలో బ్యాటింగ్‌కు దిగడం గమనార్హం. తొలి వికెట్ పడిన తర్వాత తిలక్ వర్మ, శ్రేయస్ అయ్యర్ ముందుగా బ్యాటింగ్‌కు రావడానికి ఇషాన్ గాయమే కారణమని భారత జట్టు బ్యాటింగ్ కోచ్ వెల్లడించాడు. గాయం కారణంగా ఇషాన్ ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో రెండో మ్యాచ్‌కు అతడు అందుబాటులో ఉండటం కష్టమని ముందుగానే సంకేతాలు వెలువడ్డాయి. తాజాగా భారత క్రికెట్ నియంత్రణ మండలి ప్రకటనతో అతడు రెండో టీ20కి దూరమైన విషయం స్పష్టమైంది. **వైభవ్ సూర్యవంశీకి అవకాశం?** ఇషాన్ కిషన్ దూరం కావడంతో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి తుది జట్టులో చోటు దక్కే అవకాశాలు పెరిగాయి. ఇటీవల తన దూకుడైన బ్యాటింగ్‌తో క్రికెట్ అభిమానుల దృష్టిని ఆకర్షించిన వైభవ్, భారత జట్టులో మరోసారి తన సత్తా చాటేందుకు ఎదురుచూస్తున్నాడు. వెస్టిండీస్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో అతడికి తుది జట్టులో ఆడే అవకాశం లభించలేదు. ఇప్పుడు ఇషాన్ గాయం కారణంగా ఏర్పడిన ఖాళీని భర్తీ చేసేందుకు జట్టు యాజమాన్యం వైభవ్ పేరును పరిశీలించే అవకాశం ఉంది. అయితే అతడికి తుది జట్టులో చోటు కల్పిస్తారా లేదా అన్నది జట్టు ఎంపికపై ఆధారపడి ఉంటుంది. **తొలి మ్యాచ్‌లో భారత్ అద్భుత విజయం** న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టీ20లో భారత జట్టు అద్భుతంగా రాణించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆతిథ్య జట్టు నిర్ణీత ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 225 పరుగుల భారీ స్కోరు సాధించింది. గ్లెన్ ఫిలిప్స్ అజేయంగా 82 పరుగులు చేయగా, ఫిన్ అలెన్ 45 పరుగులతో ఆకట్టుకున్నాడు. భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత్‌కు సంజూ శాంసన్ 67 పరుగులతో శుభారంభం అందించాడు. అనంతరం శ్రేయస్ అయ్యర్ 42 పరుగులు, నామన్ ధీర్ అజేయంగా 42 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. దీంతో భారత్ మరో రెండు బంతులు మిగిలి ఉండగానే ఆరు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించి ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 1‌0 ఆధిక్యంలో నిలిచింది. **రెండో టీ20పై ఆసక్తి** తొలి మ్యాచ్‌లో విజయం సాధించిన భారత జట్టు అదే జోరును కొనసాగించాలని భావిస్తోంది. మరోవైపు న్యూజిలాండ్ జట్టు సిరీస్‌ను సమం చేయాలనే పట్టుదలతో బరిలోకి దిగనుంది. ఇషాన్ కిషన్ గైర్హాజరు భారత బ్యాటింగ్ కూర్పుపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అతడి స్థానంలో ఎవరిని ఎంపిక చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. వైభవ్ సూర్యవంశీకి అవకాశం లభిస్తే తన ప్రతిభను నిరూపించుకునేందుకు మంచి వేదికగా నిలవనుంది. అయితే గాయం నుంచి ఇషాన్ ఎప్పుడు పూర్తిగా కోలుకుంటాడనే విషయంపై వైద్య బృందం నుంచి తదుపరి సమాచారం రావాల్సి ఉంది.

# ప్రపంచ రికార్డుతో సందీప్‌కు స్వర్ణ పతకం

## ఆసియా దివ్యాంగుల క్రీడల్లో 400 మీటర్ల పరుగులో అద్భుతం.. భారత కీర్తిని చాటిన అథ్లెట్

**నాగోయా:** ఆసియా దివ్యాంగుల క్రీడల్లో భారత క్రీడాకారులు అద్భుత విజయాలతో దూసుకెళ్తున్నారు. పురుషుల 400 మీటర్ల పరుగు పోటీలో భారత అథ్లెట్ సందీప్ కుమార్ ప్రపంచ రికార్డు సృష్టించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. అత్యంత వేగంగా పరుగెత్తి ప్రత్యర్థులను వెనక్కి నెట్టిన సందీప్ తన అసాధారణ ప్రతిభతో భారత కీర్తిని అంతర్జాతీయ స్థాయిలో చాటాడు. ఈ విజయంతో భారత క్రీడా బృందంలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. **52.28 సెకన్లలో గమ్యానికి** పురుషుల 400 మీటర్ల టీ44 విభాగంలో జరిగిన తుది పోటీలో సందీప్ కుమార్ అద్భుత వేగాన్ని ప్రదర్శించాడు. నిర్ణీత దూరాన్ని కేవలం 52.28 సెకన్లలో పూర్తి చేసి ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. పోటీ ప్రారంభం నుంచే వేగాన్ని కొనసాగించిన సందీప్, చివరి వరకు అదే పట్టుదలను ప్రదర్శించి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. ఈ ప్రదర్శనతో స్వర్ణ పతకాన్ని సాధించడమే కాకుండా తన పేరును ప్రపంచ రికార్డుల జాబితాలో నమోదు చేసుకున్నాడు. **అజయ్ కుమార్‌కు కాంస్యం** ఇదే పోటీలో మరో భారత క్రీడాకారుడు అజయ్ కుమార్ కూడా పతకం సాధించాడు. 400 మీటర్ల పరుగును 53.61 సెకన్లలో పూర్తి చేసి కాంస్య పతకాన్ని అందుకున్నాడు. ఒకే పోటీలో ఇద్దరు భారత క్రీడాకారులు పతకాలు సాధించడం విశేషంగా నిలిచింది. సందీప్ స్వర్ణం, అజయ్ కాంస్యంతో భారత పతకాల ఖాతాలో మరో రెండు పతకాలు చేరాయి. వీరిద్దరి ప్రదర్శన భారత క్రీడాభిమానుల్లో ఉత్సాహాన్ని నింపింది. **పట్టుదలతో విజయ శిఖరాలకు** దివ్యాంగుల క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు అనేక సవాళ్లను అధిగమిస్తూ నిరంతరం సాధన చేస్తుంటారు. శారీరక పరిమితులను అధిగమించి అంతర్జాతీయ వేదికలపై ప్రతిభను చాటడం వారి కఠోర శ్రమకు నిదర్శనం. సందీప్ కుమార్ సాధించిన ప్రపంచ రికార్డు యువ క్రీడాకారులకు స్ఫూర్తినిచ్చే విజయంగా నిలుస్తోంది. లక్ష్యంపై ఏకాగ్రత, క్రమశిక్షణ, నిరంతర సాధన ఉంటే అసాధ్యమనుకున్న లక్ష్యాలను సైతం సాధించవచ్చని ఆయన




నిరూపించాడు. **భారత పతకాల సంఖ్యకు మరింత బలం** ఆసియా దివ్యాంగుల క్రీడల్లో భారత క్రీడాకారులు పలు విభాగాల్లో పతకాలు సాధిస్తూ దేశ ప్రతిష్ఠను పెంచుతున్నారు. పరుగుపందేలు, భల్లెం విసురు, చక్రం విసురు వంటి పోటీల్లో భారత క్రీడాకారులు రాణించడం విశేషం. సందీప్ కుమార్ ప్రపంచ రికార్డుతో స్వర్ణ పతకం సాధించడం భారత బృందానికి మరింత ఉత్సాహాన్నిచ్చింది. అంతర్జాతీయ పోటీల్లో భారత క్రీడాకారుల ప్రతిభకు లభిస్తున్న గుర్తింపు భవిష్యత్తులో మరిన్ని విజయాలకు మార్గం సుగమం చేయనుంది.

# ప్రియదర్శి, నాగదుర్గ

## 'ఇడుపు కాయితం' విడుదల తేదీ ఖరారు



ప్రియదర్శి, నాగదుర్గ కీలక పాత్రల్లో నటిస్తున్న ఫ్యామిలీ డ్రామా 'ఇడుపు కాయితం' విడుదల తేదీ ఖరారైంది. వంశీరెడ్డి దొండపాటి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని డిసెంబరు 11న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి బన్నీ వాస్ వర్క్స్ పతాకంపై బన్నీ వాస్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. టైటిల్ ప్రకటనతోనే ఆసక్తి రేకెత్తించిన ఈ చిత్రం తెలంగాణ కుటుంబ నేపథ్యంతో తెరకెక్కుతోంది.విడుదల తేదీ ప్రకటన నేపథ్యంలో శుక్రవారం చిత్ర బృందం 'గడప' పాట లిరికల్ వీడియోను విడుదల చేసింది. సురేశ్ బొబ్బిలి సంగీతం అందించిన ఈ పాటకు అభినయ శ్రీనివాస్ సాహిత్యం రాశారు. తేలు విజయ ఆలపించారు. 'ఇడుపు కాయితం' అంటే విడాకుల పత్రం అని అర్థం. ఈ పేరుతో రూపొందుతున్న సినిమా కుటుంబ సంబంధాలు, వాటి చుట్టూ సాగే కథతో ప్రేక్షకుల ముందుకు రానుంది.

# మితిమీరిన స్కిన్ షో చేయడం నాకు ఇష్టం ఉండదు

## : రష్మిక మందన్న



టాలీవుడ్, బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా రాణిస్తున్న రష్మిక మందన్న, సినిమాల్లో దుస్తుల విషయంలో తనకంటూ కొన్ని హద్దులు ఉన్నాయని స్పష్టం చేశారు. మితిమీరిన స్కిన్ షో, ఎక్స్‌పోజింగ్‌తో కూడిన దుస్తులు ధరించడానికి తాను ఇష్టపడనని తేల్చిచెప్పారు. ఇటీవల నటుడు విజయ్ దేవరకొండతో కలిసి ఆమె ప్రముఖ టాక్ షో 'కాఫీ విత్ కరణ్'లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన వృత్తిపరమైన పరిమితులపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.“కథ ప్రకారం కొన్నిసార్లు బికినీ వంటివి ధరించాల్సి రావచ్చు. కానీ, శరీర ప్రదర్శన ఎక్కువగా ఉండే దుస్తులు ధరించడం నాకు సౌకర్యంగా ఉండదు. నేను అలాంటి వ్యక్తిని కాదు“ అని రష్మిక అన్నారు. ఏ సినిమా అయినా ఒప్పుకునే ముందు ఈ విషయంపై దర్శకులతో స్పష్టంగా మాట్లాడతానని, నటీనటుల సౌకర్యానికి విలువ ఇచ్చే దర్శకులతోనే పనిచేయడానికి ప్రాధాన్యత ఇస్తానని వివరించారు. ఈ విషయంలో నటుడు విజయ్ దేవరకొండ తనకు మద్దతుగా ఉంటారని, కొన్నిసార్లు ఆయన సలహా తీసుకుంటానని కూడా రష్మిక తెలిపారు. దీనిపై విజయ్ స్పందిస్తూ, “నటీనటులు ఇబ్బందికర దుస్తులు వేసుకోమని చెప్పినప్పుడు, 'మీరు నటులు, ఇది మీ పని కదా' అంటూ ఒత్తిడి చేస్తారు. అలాంటప్పుడు వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉంది“ అని అభిప్రాయపడ్డారు. గ్లామర్ కోసం తన వ్యక్తిగత హద్దులు దాటనని రష్మిక చేసిన వ్యాఖ్యలను నెటిజన్లు ప్రశంసిస్తున్నారు.

# 'కల్కి 2'లో భైరవగా ప్రభాస్..

## బర్త్‌డే స్పెషల్ వీడియోతో అంచనాలు పెంచిన మేకర్స్!



'కల్కి 2898 ఏడీ'లో భైరవగా ప్రేక్షకులను అలరించిన ప్రభాస్.. ఇప్పుడు సీక్వెల్‌లోనూ అదే పాత్రలో సందడి చేసేందుకు సిద్ధమయ్యాడు. 'కల్కి 2' షూటింగ్‌లో ఆయన పాల్గొంటున్నాడు. ప్రభాస్ భైరవగా తిరిగి సెట్స్‌లో అడుగుపెట్టడంతో ఈ సినిమా కోసం ఎదురుచూస్తున్న అభిమానుల్లో ఆసక్తి పెరుగుతోంది.

దర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి సంబంధించి ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక తెరవెనుక వీడియోను విడుదల చేశారు. ఇందులో భైరవగా ప్రభాస్ కనిపించడంతో పాటు, సినిమా కోసం రూపొందిస్తున్న భారీ సెట్ కూడా చూపించారు. సీక్వెల్‌పై ఈ వీడియో అంచనాలను మరింత పెంచుతోంది.'కల్కి 2898 ఏడీ'లో తన స్టైల్, హాస్యంతో కూడిన డైలాగులు, నటనతో భైరవ పాత్రకు ప్రభాస్ ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చాడు. ఇప్పుడు సీక్వెల్‌లోనూ ఆ పాత్రను కొనసాగిస్తూ.. కల్కి ఆగమనానికి సంబంధించిన తన లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లనున్నట్లు చిత్రబృందం వెల్లడించింది.

ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్ అశ్వత్థామగా, కమల్ హాసన్ సుప్రీమ్ యాస్కిన్‌గా తిరిగి కనిపించనున్నారు. వైజయంతీ మూవీస్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో భారతీయ సినిమాలో ఇంతకు ముందెన్నడూ చూడని స్థాయి విజువల్స్‌ను చూపించనున్నట్లు నిర్మాతలు తెలిపారు. సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో వెల్లడించనున్నారు.

# 'రామాయణ' ముందు భారీ సవాల్..



భారత సినీ పరిశ్రమలో అత్యంత భారీ బడ్జెట్‌తో, ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం 'రామాయణ: పార్ట్ 1'. నితీశ్ తివారీ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమా బడ్జెట్ దాదాపు రూ. 2000 కోట్లుగా ప్రచారంలో ఉంది. ఈ స్థాయిలో భారీ పెట్టుబడి పెట్టినప్పుడు, సినిమా లాభాల బాట పట్టడం అంత సులభం కాదు. ట్రేడ్ విశ్లేషకుల అంచనాలను ఉటంకిస్తూ ఇండియా టుడే కథనం ప్రకారం.. ఈ సినిమా పెట్టిన పెట్టుబడిని తిరిగి రాబట్టి లాభాల్లోకి వెళ్లాలంటే ప్రపంచవ్యాప్తంగా కనీసం రూ. 5000 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించాల్సి ఉంటుంది. సాధారణంగా బడ్జెట్‌కు 2.5 రెట్ల వసూళ్లు వస్తేనే సినిమాను విజయవంతమైనదిగా పరిగణిస్తారు. ఈ భారీ లక్ష్యాన్ని చేరుకోవాలంటే సినిమాకు ఆకాశమంత ఓపెనింగ్స్ అవసరమని ట్రేడ్ నిపుణుడు రమేశ్ బాల అభిప్రాయపడ్డారు. దేశీయంగా అడ్వాన్స్ బుకింగ్స్ ద్వారానే రూ. 75 కోట్ల నుంచి రూ. 100 కోట్లు, ప్రపంచవ్యాప్తంగా ప్రీ-సేల్స్ ద్వారా రూ. 150 కోట్ల నుంచి రూ. 200 కోట్లు వసూలు చేయడం ఆరంభానికి ఎంతో కీలకమని ఆయన విశ్లేషించారు.

ఇక, తొలిరోజు భారత్‌లో రూ. 100-125 కోట్ల నెట్ కలెక్షన్లు, ప్రపంచవ్యాప్తంగా రూ. 175-200 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధిస్తే, సినిమాకు బలమైన పునాది పడుతుందని భావిస్తున్నారు. దేశీయ వసూళ్లలో దక్షిణాది మార్కెట్ల నుంచి 35-40 శాతం ఉంటుందని అంచనా వేస్తున్నారు.

అక్టోబర్ 22 నాటికి పరిమిత సంఖ్యలో అందుబాటులో ఉన్న షోల కోసం జరిగిన అడ్వాన్స్ బుకింగ్స్ ద్వారా సుమారు 1.33 లక్షల టికెట్లు అమ్ముడయ్యాయి. దీని ద్వారా రూ. 7.52 కోట్లు సమకూరాయి. అయితే, భారీ బడ్జెట్ చిత్రం కావడంతో కేవలం ఓపెనింగ్స్ మీదే ఆధారపడలేరు. సినిమాకు మంచి మౌత్ టాక్ వస్తేనే లాంగ్ రన్‌లో నిలదొక్కుకోగలదు. కేవలం థియేట్రికల్ వసూళ్లే కాకుండా, శాటిలైట్, డిజిటల్, ఇతర హక్కుల అమ్మకాల ద్వారా కూడా నిర్మాతలకు పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరనుంది.

రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా, యశ్ రావణుడిగా, రవి దూబే లక్ష్మణుడిగా నటిస్తున్న ఈ చిత్రాన్ని యశ్ నిర్మాణ సంస్థ మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్, నమిత్ మల్హోత్రాకు చెందిన ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ సినిమాను నవంబర్ 5న దీపావళి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనుండగా, నవంబర్ 4న ప్రత్యేక ప్రీమియర్ షోలు ప్రదర్శించనున్నారు.

# 'నా వైఫ్ మిస్సింగ్'

## : చాలా ఏళ్ల తర్వాత మళ్లీ వరుణ్‌తో..

## శ్వేతాబసు ప్రసాద్ ఆనందం



'కొత్త బంగారు లోకం' చిత్రంతో తెలుగు ప్రేక్షకులను అలరించిన నటి శ్వేతా బసు ప్రసాద్, సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ తెలుగు తెరపైకి పునరాగమనం చేశారు. 'ఆహా' ఓటీటీ వేదికగా రూపొందిన 'నా వైఫ్ మిస్సింగ్' అనే వెబ్ సిరీస్ ద్వారా ఆమె రీఎంట్రీ ఇచ్చారు. ఇది తనకు లభించిన ఒక అద్భుతమైన అవకాశమని, తిరిగి టాలీవుడ్‌లోకి రావడం సొంత ఇంటికి వచ్చినట్లుగా ఉందని ఆమె సంతోషం వ్యక్తం చేశారు.ఈ సిరీస్ ప్రమోషన్లలో భాగంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్వేతా బసు ప్రసాద్ మాట్లాడుతూ, “చాలా ఏళ్ల తర్వాత మళ్లీ తెలుగులో నటించడం ఎంతో సంతోషంగా ఉంది. ఈ వెబ్ సిరీస్ నా కెరీర్‌కు మంచి పునరాగమనం అవుతుందని భావిస్తున్నాను. ఇందులో నేను పోషించిన 'స్వప్న' అనే పాత్ర ఎంతో శక్తిమంతంగా ఉండటంతో వెంటనే నటించడానికి అంగీకరించాను“ అని పేర్కొన్నారు. 'కొత్త బంగారు లోకం' తర్వాత మళ్లీ వరుణ్ సందేశ్‌తో కలిసి పనిచేయడంపై స్పందిస్తూ, “వరుణ్ నా సోల్ మేట్. ఇన్నేళ్ల తర్వాత మళ్లీ అతనితో కలిసి నటించడం ఒక మధురానుభూతి“ అని అన్నారు.గత కొన్నేళ్లుగా తెలుగు చిత్ర పరిశ్రమకు దూరంగా ఉన్న శ్వేతా బసు ప్రసాద్, ప్రధానంగా హిందీ సినిమాలు, వెబ్ సిరీస్‌లపై దృష్టి కేంద్రీకరించారు. దర్శకురాలు స్వాతి అంకితభావంతో పనిచేసే వ్యక్తి అని, ఆమెతో కలిసి పనిచేయడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని శ్వేత తెలిపారు. ఈ అవకాశం కల్పించిన 'ఆహా' యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రేక్షకులందరూ ఈ సిరీస్‌ను ఆదరిస్తారని ఆకాంక్షించారు. కాగా, ఈ వెబ్ సిరీస్ ప్రస్తుతం తెలుగుతో పాటు తమిళ భాషలోనూ 'ఆహా' ఓటీటీలో అందుబాటులో ఉంది.

# రాజకీయాల్లోకి వెళ్లి ఆస్తులు అమ్ముకున్నా: నరేశ్

సీనియర్ నటుడు నరేశ్ తన రాజకీయ జీవితం గురించి, దానివల్ల ఎదుర్కొన్న ఆర్థిక ఇబ్బందుల గురించి సంచలన విషయాలు వెల్లడించారు. రాజకీయాల్లోకి వెళ్లడం వల్ల ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయానని, ఆ నష్టాలను పూడ్చుకోవడానికి సొంత ఆస్తులను సైతం అమ్ముకోవాల్సి వచ్చిందని ఆయన తెలిపారు.హీరోగా మంచి అవకాశాలు వస్తున్న సమయంలోనే ప్రజాసేవ చేయాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి అడుగుపెట్టానని నరేశ్ చెప్పారు. డబ్బు సంపాదన తన లక్ష్యం కాదని, పార్టీ కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాల కోసం పెద్ద మొత్తంలో సొంత డబ్బు ఖర్చు చేశానని చెప్పారు. అదనపు ఆదాయం కోసం ప్రారంభించిన అడ్వర్టైజింగ్ ఏజెన్సీ వంటి వ్యాపారాలు కూడా ఆశించిన ఫలితాలు ఇవ్వలేదని వివరించారు.

తన ఉదార స్వభావం కూడా ఆర్థిక ఇబ్బందులకు ఒక కారణమని నరేశ్ అంగీకరించారు. 1998లో రాజకీయాల్లో పూర్తిగా చురుకుగా మారిన తర్వాత దాదాపు 12 నుంచి 15 ఏళ్ల పాటు సినిమాలకు దూరంగా ఉన్నానని తెలిపారు. చిన్నప్పటి నుంచే ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ సిద్ధాంతాల పట్ల ఆకర్షితుడినయ్యానని, హిందూపురం లోక్‌సభ స్థానం నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశానని కూడా ఆయన గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో సంపాదించిన డబ్బును భూముల వంటి స్థిరాస్తులపై పెట్టుబడి పెట్టి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని నరేశ్ అభిప్రాయపడ్డారు

